SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 101 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 3 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |




వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాన్ని

## తిప్పికొట్టాలి

- 'తప్పుడు ప్రచారాన్ని ఎందుకు తిప్పికొట్టడం లేదు'
- జనసేన నేతలపై పవన్ కల్యాణ్ ఆగ్రహం
- మహిళల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచన

# హింసను ప్రేరేపించేందుకు వైఎస్సార్సీపీ కుట్ర

- అధికారం కోల్పోయామనే అసహనంతో వైఎస్సార్సీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజం
- వైఎస్సార్సీపీ ట్రాప్‌లో పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సీనియర్ నేతలకు సూచన
- హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోంది
- అధికారం కోల్పోయామనే అసహనంతోనే రెచ్చగొట్టే చర్యలకు పాల్పడుతోంది
- అలజడి సృష్టించేందుకే ఆ పార్టీ నేతలు బూతులు మాట్లాడుతున్నారు

### వారి ట్రాప్‌లో పడొద్దు: చంద్రబాబు
### పార్టీ ముఖ్య నేతలతో టెలీకాన్ఫరెన్స్

**అమరావతి:** రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైకాపా కుట్రలు పన్నుతోం దని, వారి ట్రాప్‌లో పడొద్దని సీఎం చంద్రబాబు తెలుగుదేశం పార్టీ శ్రేణులకు సూచించారు. మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో సోమవారం సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అంబటి రాంబాబు, జోగి రమేష్ బూతు మాటలపై టీడీపీ శ్రేణుల నిరసనలు ఉద్రిక్తతకు దారితీసిన నేపథ్యంలో తెలుగుదేశం సీనియర్ నేతలతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో హింసను ప్రేరేపించటానికి వైఎస్సార్సీపీ కుట్రలు పన్నుతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయామనే అసహనంతో ఆ పార్టీ నేతలు రెచ్చగొట్టే

మిగతా 5 లో





## యూపీ సీఎం యోగి సంచలన నిర్ణయం

ఉద్యోగులు ఆస్తుల వివరాలు ఇవ్వాలని ఆదేశం

.. వివరాలు 4లో



## ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు

ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే

దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది

మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

.. వివరాలు 3లో




# నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా?

అడ్డంగా సంపాదించి.. అధికార దుర్వినియోగం చేసివేలకోట్లు కూడాబెడితే అడుగొద్దా?

### అధికారంలో ఉండగా ఉద్యమకారులు గుర్తురాలేదా?

బీఆర్ఎస్ నేతల తీరుపై మండిపడ్డ సీఎం రేవంత్

రావినారాయణరెడ్డి లాంటి నేతలు అరుదని కితాబు

జస్టిస్ సుదర్శన్ రెడ్డికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందజేత

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** బీఆర్ఎస్, కేసీఆర్‌పై పరోక్షంగా విమర్శలు గుప్పించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కొందరు తమకు తామే తెలంగాణ జాతిపిత అనుకుంటున్నారన్నారు. ఉద్యమకారులను అవమానిస్తారా అని గగ్గోలుపెడుతున్నారని ఎద్దేవా చేశారు. వారి హయాంలో ఉద్యమకారులను అవమానించలేదా అని సీఎం ప్రశ్నించారు. అక్రమాలకు పాల్పడితే ఎవరైనా విచారణ ఎదుర్కోవాల్సిందే అన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా విచారణ ఎదుర్కోక తప్పదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మీ ఇంటి తలుపులు బద్దలు కొట్టలేదు.. మిమ్మల్ని ఎవరూ ఈడ్చుకెళ్లలేదు.. చేసిన తప్పులకు నోటీసులు ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

మిగతా 2 లో



కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో

## ఎదురుదెబ్బ

సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

2

## నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖన

లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై గందరగోళం

అడ్డుకున్న మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా



రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారం గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణె రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో గందరగోళం చెలరేగింది. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నరవణె పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు.

4

## బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్



బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐ టీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులను వివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు.

మిగతా 4 లో




## గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

3

బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు

ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ చీఫ్ రామచంద్రరావు



2

## తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం

కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం

తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన

అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక

## రేబిస్ వ్యాక్సిన్ వికటించి పాప మృతి

విచారణ చేపడతామన్న ఆర్ఎంవో

2





# కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంలో ఎదురుదెబ్బ

## సోషల్ మీడియా పోస్టులపై అప్పీల్ తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** కాంగ్రెస్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగలింది. సామాజిక మాధ్యమాల పోస్టులపై రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా కేసులు పెట్టడం ఏ మాత్రం చెల్లదంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పీల్‌ను అత్యున్నత ధర్మాసనం తిరస్కరించింది. సోషల్ మీడియా పోస్టులపై అక్రమ కేసులు పెట్టడం ఏమాత్రం చెల్లదని గత ఏడాది సెప్టెంబర్‌లో హైకోర్టు సంచలన తీర్పును ఇచ్చింది. రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులతో పాటు చట్టాల స్ఫూర్తితోనే పోలీసులు పని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ తీర్పు అప్రజాస్వామిక పద్ధతులతో సోషల్ మీడియా యాక్టివిస్టులను అణచివేయాలని చూస్తున్న ప్రభుత్వానికి ఒక హెచ్చరికగా మారింది. ఒక ట్వీట్ చేసినందుకు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినందుకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పోస్టులు చేసినందుకు కేసులు పెడతామంటే చెల్లదని, కేసులు పెట్టే ప్రతి వ్యక్తి ఏ విధంగా తనకు వ్యక్తిగతంగా నష్టం జరిగిందో చెప్పాల్సిన అవసరం బాధ్యత ఉంటుందని అప్పుడే ఎఫ్ఐఆర్లు నమోదు చేయాలని కఠినమైన ఆదేశాలను మార్గదర్శకాలను జారీ చేసింది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చేసిన పోస్టుల వలన మనోభావాలు దెబ్బతిన్నాయి, సామాజిక సమతుల్యత దెబ్బతింటుంది అంటూ అసత్యపు పునాదుల పైన ఆక్రమ కేసులు ఇప్పటిదాకా పెట్టిన ప్రభుత్వానికి ఈ తీర్పు ఒక గట్టి ఎదురు దెబ్బ అని చెప్పవచ్చు. హైకోర్టు తన తీర్పులో ఇచ్చిన మార్గదర్శకాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసే ముందు ఫిర్యాదుదారుడు స్వయంగా బాధితుడా కాదా అనేది నిర్ధారించుకోవాలి, మూడవ పక్షం చేసే ఫిర్యాదులు పరువు నష్టం కేసులలో చెల్లవు. ప్రాథమిక విచారణ లేకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకూడదు. అంతేకాకుండా, కేవలం రాజకీయ విమర్శలు లేదా కఠినమైన వ్యాఖ్యలను నేరంగా పరిగణించకూడదు. హింసను ప్రేరేపిస్తేనే అలాంటి కేసులు నమోదు చేయాలి. పరువు నష్టం అనేది నాన్-కాగ్నిజబుల్ నేరం కాబట్టి, నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్‌ను సంప్రదించాలని హైకోర్టు సూచించింది. చివరగా, పోలీసులు అరెస్టు చేసేటప్పుడు ఆర్నేష్ కుమార్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని, రాజకీయ ప్రేరేపితమైన లేదా నిరాధారమైన ఫిర్యాదులను తిరస్కరించాలని ఆదేశించింది. బీఆర్ఎస్ పార్టీ ట్వీట్లను రీట్వీట్ చేసినందుకు గానూ సోషల్ మీడియా వారియర్ శశిధర్ గౌడ్, అలియాస్ నల్ల బాలుపై పోలీసులు అక్రమంగా నమోదు చేసిన మూడు కేసులను హైకోర్టు కొట్టివేసింది.

# రేబిస్ వ్యాక్సిన్ వికటించి పాప మృతి

## విచారణ చేపడతామన్న ఆర్ఎంవో



**కామారెడ్డి, ఫిబ్రవరి 2:** యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వికటించి చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన కామారెడ్డిలో చోటుచేసుకున్నది. చిన్నారి మృతి ఘటనపై విచారణ చేపడుతామని ఆర్ఎంవో సంతోష్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు దవాఖాన నుంచి బయటికి వెళ్లారని, ప్రైవేట్ దవాఖానకు సుమారు 2.30 గంటలకు వెళ్లారని ఈ మధ్యలో ఏమి జరిగిందో విచారణ చేసిన తర్వాత చెప్పగలమని ఆయన పేర్కొన్నారు. రెండు డోస్‌లు వేసినప్పుడు పాప బాగానే ఉన్నదని, మూడో డోస్ వేసినప్పుడు కూడా బాగానే ఉన్నదని తెలిపారు. విచారణ తరువాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మండలం కొటాల్‌పల్లికి చెందిన అర్చన-రమేశ్ దంపతులు కామారెడ్డిలోని అయ్యప్ప నగర్‌కాలనీలో నివాసముంటున్నారు. వీరికి బాబు, పాప ఉన్నారు. జనవరి 25న ఇంటి ఎదుట ఆడుకుంటుండగా రెండున్నరేండ్ల క్రితిక్ సారాను కుక్క కరిచింది. కుటుంబ సభ్యులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన తరలించగా, ఇంజెక్షన్ ఇచ్చారు. ఆదివారం మూడో డోస్ ఇప్పించడానికి చిన్నారిని జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. డోస్ తీసుకోగానే చిన్నారి అపస్మారక స్థితికి చేరగా, వెంటనే ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే చిన్నారి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే చిన్నారి మృతి చెందిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ ఆందోళనకు దిగారు. దవాఖానలోని ఫర్నిచర్, అద్దాలను ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబీకులకు నచ్చజెప్పినా వినిపించుకోకుండా సుమారు రెండున్నర గంటలపాటు ఆందోళన చేశారు.

# 9,10 తేదీల్లో ఉస్మానియాలో తెలుగు లిటరరీ కాంగ్రెస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఈనెల 9, 10 తేదీల్లో రూమ్ నెంబర్ 133, ఆర్ట్స్ కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయం రెండు రోజులపాటు రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ జరగబోతోంది. యువరచయితల సాహిత్య సజన కేంద్రంగా జరగబోతున్న ఈ కాంగ్రెస్లో మొత్తం పది సెషన్లు ఉంటాయి. దాదాపు 55 మంది యువ కవులు, రచయితలు, నవలాకారులు, విమర్శకులు, సినిమా రచయితలు పాల్గొంటారని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాసిం తెలిపారు. ఈ రెండు రోజులూ ఆర్ట్స్ కళాశాల ముందు బహిరంగ ఆవరణలో కవితా దునియా, కవిత జిందగీ పేర్లతో కవితా పఠనం, గాన/కళా ప్రదర్శనలు జరుగుతాయి. దీంట్లో దాదాపు 40 మంది యువ కవిగాయకులు, జానపద వత్తికళా ప్రదర్శకులు పాల్గొంటారు. ఈ రెండవ కాంగ్రెస్ కు డైరెక్టర్‌గా ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ చింతకింది కాశీం, కన్వీనర్‌గా తెలుగుశాఖ అధ్యక్షులు, ఆచార్య సాగి కమలాకర శర్మవ్యవహరిస్తారు.

# నేరాలు చేస్తాం.. ప్రశ్నించొద్దంటే ఎలా?

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రావినారాయణ రెడ్డి ఆడిటోరియంలో జరిగిన రావి నారాయణ రెడ్డి జాతీయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డికి పురస్కారాన్ని ప్రదానం చేశారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయిన మహనీయుడు రావి నారాయణ రెడ్డి అని సీఎం గుర్తు చేశారు. ఈ మధ్య తెలంగాణ జాతిపిత అని కొందరు వాళ్లకు వాళ్లే రాసుకుంటున్నారని, ఉద్యమకారులమని వాళ్లే చెప్పుకుంటున్నారని విమర్శించారు. పోలీసులు చిన్న నోటీసులు ఇస్తే జాతిపితకు నోటీసులు ఇస్తారా అని అంటున్నారని, తెలంగాణ సమాజానికి అవమానం జరిగిందని ప్రచారం చేస్తున్నారని సీఎం ఎద్దేవా చేశారు. ఆనాడు జాతిపిత గాంధీజీ పదవులను త్యాగం చేశారని, దుర్మార్గుల తూటాలకు ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. ఇప్పుడు జాతిపిత అని చెప్పుకుంటున్న వాళ్లు ఏం చేశారని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులను ఏకం చేసి ఉద్యమాన్ని నడిపించిన ప్రొఫెసర్ కోదండరాం ఉద్యమకారుడు కాదా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఆనాడు తలుపులు బద్దలు కొట్టి కోదండరాంను అరెస్టు చేసినప్పుడు ఉద్యమకారులు గుర్తుకురాలేదా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిలదీశారు. నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తేనే ఏదో జరిగినట్లు రాద్ధాంతం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారు తెలంగాణ కోసం సర్వం కోల్పోయారని, పదవులు, వేలకోట్ల ఆస్తులు సంపాదించుకున్న వాళ్లు ఉద్యమకారులు ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించినప్పుడు అర్థం చేసుకుని.. హుందాగా తప్పుకుంటే కొంతైనా మీ గౌరవం నిలబడేదన్నారు.

ప్రజలే తప్పు చేశారని చెప్పడం.. ఇదెక్కడి ప్రజాస్వామ్యం, ఇదెక్కడి ఉద్యమకారుడి లక్షణం, ఇదెక్కడి జాతిపిత లక్షణం అని ప్రశ్నించారు. అక్రమ మార్గం ఎంచుకున్న వారికి ప్రజాస్వామ్యంలో విచారణ ఎదుర్కోవాల్సిందే అని అంబేద్కర్ చెప్పారని, శిబు సోరెన్ లాంటి వాళ్లు విచారణ ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. మధ్య యుగాల చక్రవర్తులు తమ బాధను రాజ్యం బాధగా ప్రచారం చేసేవారని, ఇది ప్రజాస్వామ్య యుగమని, మధ్య యుగాల చక్రవర్తులకు కాలం చెల్లిందని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో తప్పు చేసినవారు విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు.

## జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అవార్డు దక్కడం సముచితం: సీఎం

రావి నారాయణరెడ్డి జాతీయ పురస్కారం జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి గారికి దక్కడం సముచితమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్న నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. తొలి తరంలో బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి స్ఫూర్తినిస్తే, మలి తరంలో జైపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి లాంటి వాళ్లు తెలంగాణ సమాజానికి ఒక స్ఫూర్తి నింపారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. 2019 లో నిబద్ధత కలిగిన, ప్రశ్నించగలిగిన వారు రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డిని తాను కోరానని గుర్తు చేశారు. ఆ సమయంలో తరం మారింది.. ప్రత్యక్ష రాజకీయాలకు తను దూరం అని, యువతరం రాజకీయాల్లో ఉండాలని జైపాల్ రెడ్డి తనను ప్రోత్సహించారని తెలిపారు. సమాజంలో వస్తున్న మార్పును, ప్రజల ఆలోచనని గౌరవించిన గొప్ప నాయకులు జైపాల్ రెడ్డి, రావి నారాయణరెడ్డి అని సీఎం అన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిబద్ధత ప్రధాని మోదీని భయపెడుతుందని, ఆయనను రాహుల్ గాంధీ ఉపరాష్ట్రపతిగా బరిలో దించారన్నారు. ప్రజలకు ప్రజాస్వామ్య స్ఫూర్తిని అందించాలనే ఏక పార్టీ, ఏక వ్యక్తి పాలనకు వ్యతిరేకంగా సుదర్శన్ రెడ్డి ఎన్నికల బరిలో దిగారని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తికి రావి నారాయణరెడ్డి పురస్కారం అందించడం సముచితమని ముఖ్యమంత్రి తెలిపారు.

## రావి నారాయణ రెడ్డికి గౌరవం కల్పిస్తాం

అరాచక శక్తులకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించిన మహనీయుడు రావి నారాయణరెడ్డి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినా పేద ప్రజల కోసం తన 500 ఎకరాల భూమిని దానం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. రాచరిక పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెట్టిచాకిరీ విముక్తి కోసం ఆయన పోరాడారన్నారు. బండెనక బండి కట్టి, పదహారు బండ్లు కట్టి అని తెలంగాణ సమాజాన్ని చైతన్యం చేసిన బండి యాదగిరి లాంటి నిరక్షరాస్యులను ప్రభావితం చేసిన గొప్ప వ్యక్తి అని గుర్తు చేశారు. దేశంలో మొట్ట మొదటి ప్రధాని నెహ్రూ కంటే ఎక్కువ మెజారిటీతో పార్లమెంట్ సభ్యుడిగా




ఎన్నికయ్యారన్నారు. ప్రజా తీర్పును ప్రతిబింబించేలా ఆనాడు మొట్టమొదటి పార్లమెంట్ భవనాన్ని రావి నారాయణరెడ్డితో నెహ్రూ ప్రారంభింపజేశారని సీఎం తెలిపారు. అరవై ఏళ్ల వయసులో ప్రజలకు స్ఫూర్తినిస్తూ పార్టీ, రాజకీయ పదవుల నుంచి తప్పుకున్న గొప్ప నేత రావి నారాయణరెడ్డి అన్నారు. ఈ కాలంలో ప్రజలు ఓడించినా కొందరు పదవులు వదులుకోవడానికి సిద్ధంగా ఉండటం లేదన్నారు. మున్సిపల్ ఎన్నికల తరువాత రావి నారాయణ రెడ్డికి సముచిత గౌరవం ఇచ్చేందుకు చేపట్టాల్సిన చర్యలు తీసుకుంటామని సీఎం తెలిపారు. సచివాలయంలోఅందరితో సమావేశమై తెలంగాణలో సముచిత గౌరవం కల్పించే బాధ్యత ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

## రాజ్యాంగంపై దాడిని తిప్పి కొట్టాలి:

రాజ్యాంగాన్ని రద్దు చేయడమే బీజేపీ రహస్య ఎజెండా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. మోదీ ప్రభుత్వం దేశంలో ఏక పార్టీ, ఏక వ్యక్తి వ్యవస్థను తీసుకువచ్చే కుట్ర చేస్తోందన్నారు. అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదం ఫలించకపోవడంతో రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును కాలరాయాలని బీజేపీ SIRను తీసుకువచ్చిందన్నారు. ఓటు హక్కును కాలరాయాలన్న కుట్రపై కమ్యూనిస్టులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని కోరారు. రాజ్యాంగంపై దాడి జరుగుతోందని.. దీనిపై మనమంతా ప్రజల్లో చైతన్యం కలిగించాలని పిలుపునిచ్చారు. నాణానికి ఒకవైపు కాంగ్రెస్, మరోవైపు కమ్యూనిస్టులు నిలిచి రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# పట్టణాల్లో కాంగ్రెస్‌నే గెలపించండి

## బిఆర్ఎస్‌ను ఓడిస్తేనే అభివృద్ధి సాధ్యం

## బిజెపికి 8మంది ఎంపిలున్నా రాష్ట్రానికి శూన్యం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపు



**జయశంకర్ భూపాలపల్లి, ఫిబ్రవరి 2:** రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటేసి గెలిపించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పట్టణ ప్రాంత ప్రజలకు ఒరిగిందేమీ లేదని, అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పట్టణ ప్రజలకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి, కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా మున్సిపల్ శాఖ బాధ్యతలను నిర్వహిస్తూ, పట్టణాల్లో మౌలిక సదు-పాయాల కల్పనకు , సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వివరించారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని, మున్సిపాలిటీలను అభివృద్ధి పథంలో నడిపిస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణ నుంచి ఎనిమిది మంది బీజేపీ పార్లమెంట్ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధించడంలో వారు పూర్తిగా విఫలమయ్యారని శ్రీధర్ బాబు విమర్శించారు. ఇంతమంది ఎంపీలు ఉండి కూడా నిధులు రాకపోవడం బాధాకరమని, ఇది రాష్ట్ర ప్రజలకు జరిగిన అవమానమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ బడ్జెట్ తెలంగాణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లిందని, పూర్తిగా నిరాశజనకంగా ఉందని ఆయన విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లవుతున్నా, విభజన చట్టంలోని 42 కీలక అంశాలు నేటికీ పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉండటం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ సమావేశాల్లోనైనా ఆ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ఆశించామని, కానీ కేంద్రం మళ్ళీ మొండిచేయి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా కేంద్రం వెంటనే స్పందించి విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన ప్రతిష్టాత్మక సంస్థల విషయంలో కేంద్రం అనుసరిస్తున్న తీరును శ్రీధర్ బాబు ఎండగట్టారు. తెలంగాణకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎం వంటి ఉన్నత విద్యాసంస్థ వస్తుందని రాష్ట్రం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, కానీ బ్జడెట్‌లో దాని ఊసే లేకపోవడం దారుణమన్నారు. అలాగే హైదరాబాద్ నగరవాసుల చిరకాల స్వప్నమైన మెట్రో ఫేజ్-2 విస్తరణకు నిధులు కేటాయిస్తారని ఆశించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. విద్యా రంగంలో కేంద్రీయ , నవోదయ విద్యాలయాల కేటాయింపులో కూడా రాష్ట్రానికి మొండిచేయి ఎదురైందని విమర్శించారు. ఐటి , పారిశ్రామిక రంగంలో కీలకమైన సెమీ కండక్టర్ చిప్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలను తెలంగాణకు కేటాయించడంలో కేంద్రం పక్షపాత ధోరణి ప్రదర్శిస్తోందని, గతంలోనూ ఇదే జరిగిందని ఆయన గుర్తు చేశారు. అయితే, తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న లైఫ్ సైన్సెస్ , ఫార్మా పాలసీలను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకోవడం మన పాలనకు నిదర్శనమని చెప్పారు. అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని, కేంద్రం కూడా తన బాధ్యతను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలకు నిధులు విడుదల చేయాలని కోరారు.

# తెలుగు రాష్ట్రాల్లో పులి సంచారం కలకలం

- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న ప్రచారం
- తొర్రేడులో పులిజాడతో ప్రజల భయాందోళన
- అప్రమత్తంగా ఉండాలని అటవీ అధికారుల హెచ్చరిక
- పులిని పట్టుకునేందుకు బోను, సిసి కెమెరాల ఏర్పాటు



**రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 2:** రాజమహేంద్రవరం మండలంలోని తొర్రేడులో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. పెద్దపులి దాడిలో మృతి చెందిన రెండు ఆవులు, దూడ కళేబరాలను వారు గుర్తించారు. పెద్దపులిని పట్టుకునేందుకు తొర్రేడు తోటల్లో పులి బోను, ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ, సీతానగరం మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు డీఈవో సోమవారం సెలవు ప్రకటించారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రజల్ని, పర్యాటకుల్ని అధికారులు అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి రెండు పెద్ద పులులు జనారణ్యంలోకి వచ్చినట్టు అటవీ అధికారులు భావిస్తున్నారు. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద పులుల సంచారం కలకలం రేపుతున్నాయి. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పులుల సంచారం ఎక్కువైపోయింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుంచి తెలుగు రాష్ట్రాల్లోకి వచ్చిన పులులు అలజడి సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు ఏలూరు జిల్లా ఏజెన్సీని వణికించిన పెద్దపులి ఇప్పుడు తూర్పు గోదావరిలోకి ప్రవేశించింది. నిన్న రాజమహేంద్రవరం రూరల్ తొర్రేడులో పశువులపై దాడి చేసి చంపేసింది. పులి దాడిపై స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మీడియా సమావేశం నిర్వహిస్తుండగా.. వారి వెనకాలే పులి కనిపించింది. పులి సంచారం నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు రాజమండ్రి రూరల్, కోరుకుంట్ల, సీతానగరం మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. పిల్లల్ని బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్త తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించింది. ఇక నెల్లూరు జిల్లా దత్తలూరు మండలం నందిపాడులోనూ పెద్దపులి కలకలం సృష్టిస్తోంది. రేమానుకుంట వద్ద స్థానికులకు పెద్దపులి కనిపించింది. దీంతో ఉదయగిరి పరిసర ప్రాంతాలవారు భయాందోళనలో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో పెద్దపులి సంచారం.. జనాలతో పాటు ఫారెస్ట్ అధికారుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. 15 రోజులుగా ఫారెస్ట్ అధికారులు పెద్దపులిని పట్టుకోవటానికి ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అయినప్పటికీ లాభం లేకుండా పోయింది. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ అభయారణ్యం నుంచి ఆ పెద్దపులి వచ్చినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ఈ పెద్దపులి యాదాద్రి భువనగిరితో పాటు సిద్ధిపేట జిల్లా సరిహద్దులోనూ సంచరిస్తోంది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతంలోనూ ఓ పెద్దపులి తిరుగుతున్నట్లు సమాచారం.

# గ్యారెంటీల పేరుతో ఓట్లు దండుకున్న కాంగ్రెస్

**బూటకపు హామీ లు - మోసపూరిత వాగ్దానాలు**

**ఛార్జ్‌షీట్ విడుదల చేసిన బీజేపీ చీఫ్ రామచంద్రరావు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ ఓట్లు దండుకున్నదే కానీ ప్రజలకు చేసిందేమీ లేదని తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విమర్శించారు. ఈ మేరకు రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పై రాంచందర్‌రావు నిప్పులు చెరిగారు. సోమవారం హైదరాబాద్‌లోని హోటల్ పీపుల్స్ ప్లాజాలో 'బూటకపు హామీలు - మోసపూరిత వాగ్దానాలు' అంటూ కాంగ్రెస్ అరాచక, అవినీతి పాలనపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఛార్జ్‌షీట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బూటకపు హామీలు, మోసపూరిత వాగ్దానాలు, సేవ్ తెలంగాణ, ఓట్ బీజేపీ థీమ్‌తో ఈ ఛార్జ్ షీట్‌ను విడుదల చేశామన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేని పరిస్థితుల్లో రేవంత్ ప్రభుత్వం ఉండటం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారని.. కానీ నేటికి ఒక్క పైసా కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద వేల కోట్ల రూపాయిల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్రంలో విద్య, వైద్యం పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటీ సంపూర్తిగా అమలు కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని.. తద్వారా లక్షలాది మంది లబ్ధి పొందుతున్నారని వివరించారు. షో పుటప్ తప్ప.. రాష్ట్రంలో ఒక్క ఇందిరమ్మ ఇల్లు లేదంటూ రేవంత్ ప్రభుత్వంపై మండిపడ్డారు. ఓట్ల కలెక్షన్ల కోసమే ఇందిరమ్మ ఇళ్లు అంటూ ఎద్దేవా చేశారు. మున్సిపాలిటీలకు చేసిందేమిటో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ఆయన నిలదీశారు. 7 మున్సిపల్ కార్పొరేషన్లలో టాక్సీల పేరు మీద భారీ కుంభకోణం జరుగుతోందని విమర్శించారు. దీనిలో రూ. 250 కోట్లకుపైగా కుంభకోణం జరిగిందని వివరించారు. మున్సిపాలిటీలకు వచ్చే నిధుల్లో ప్రతి పైసా కేంద్ర ప్రభుత్వం నుంచి వస్తున్నవేనని గుర్తు చేశారు. రాష్ట్రంలో రహదారులన్నీ అధ్వానంగా మారాయని.. నిత్యం రోడ్డు ప్రమాదాల వల్ల అనేక మంది మరణిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో క్రైమ్ విపరీతంగా పెరిగిపోయిందంటూ ఆందోళన వ్యక్తం చేశారు. లా అండ్ ఆర్డర్ పూర్తిగా విఫలం అయిందన్నారు. డ్రగ్స్‌కు కేంద్రంగా తెలంగాణ మారిపోయిందంటూ మండిపడ్డారు. హిందూ దేవాలయాలపై దాడులు పెరుగుతున్నాయన్నారు. చివరకు దేవాలయాల భూములు రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మారుతున్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. కమిషన్, కాంట్రాక్ట్, కరప్షన్ ప్రభుత్వమని అభివర్ణించారు. ఇది 40 పర్సెంట్ కమిషన్ ప్రభుత్వమని వ్యంగ్యంగా అన్నారు. తమ ఫోన్లు ట్యాపింగ్ చేసి.. తమపైనే కేసులు పెట్టారని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ చేయవలసిన అవసరం ఎందుకొచ్చిందంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. తొలుత బీజేపీ నేతల ఫోన్లనే ట్యాపింగ్ చేశారని గుర్తు చేశారు. సేవ్ తెలంగాణ.. ఓట్ బీజేపీ నినాదంతో ప్రజల్లోకి వెళ్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించాలని, గతంలో రెండు పార్టీలకు అవకాశం ఇచ్చారని.. ఒకసారి బీజేపీకి కూడా అవకాశం ఇవ్వండంటూ టీ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు విజ్ఞప్తి చేశారు.



# ఎవరిపైనా కక్షసాధింపు చర్యలు లేవు

**ఫోన్ ట్యాపింగ్ దుశ్చర్యలు బయటపడాల్సిందే**

**దోషులు ఎవరో తేల్చాల్సి ఉంది**

**మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** ఫోన్ ట్యాపింగ్ కేసుపై తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. చట్టం తన పని తాను చేస్తుందని స్పష్టం చేశారు. భార్యాభర్తల సంభాషణలు వినే దుశ్చర్యకు పాల్పడితే విచారణ జరపాలా వద్దా అని ప్రశ్నించారు. తప్పుచేసి మాపైనే అభియోగాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎవరి మీదా కక్ష సాధింపు ఆలోచన లేదని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం రాష్ట్రానికి చెడ్డపేరు తెచ్చిందన్నారు. సాధారణంగా ఉగ్రవాదులు, ఆటంకవాదుల ఫోన్లను ట్యాప్ చేస్తారని.. కానీ ఇక్కడ నాయకులు, జడ్జిలు, వ్యాపారవేత్తల ఫోన్లనే ట్యాప్ చేశారని చెప్పారు. ఆధారాలు లభించిన నేపథ్యంలో విచారణ జరుగుతోందని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ ఎవరు చేశారు? ఎందుకు చేశారో.? తేల్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. బీజేపీ నేతలు బండి సంజయ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ధర్మపురి అర్వింద్ ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ చేయాలని డిమాండ్ చేశారని ప్రస్తావించారు. వారి కుటుంబ సభ్యులు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని బీజేపీ నేతలు చెబుతున్నారన్నారు. ఈ నీచానికి ఎవరు ఒడిగట్టారో విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. దుశ్చర్యకు పాల్పడ్డవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు.

# సిట్ చీఫ్ సజ్జన్నార్ వ్యాఖ్యలు సరికాదు

**చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ అని ఎలా ప్రకటిస్తారు**

**ఇది పోలీస్ మాన్యువల్‌కు వ్యతిరేకం అని తెలియదా**

**కేసీఆర్ విచారణ తరవాత ఘటనపై హరీష్ రావు అభ్యంతరం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** చట్టవిరుద్ధ ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ విచారణ ముగిసిందని నగర పోలీస్ కమిషనర్, సిట్ ఇన్‌ఛార్జ్ సజ్జనార్ చేసిన ప్రకటనపై మాజీ మంత్రి హరీశ్‌రావు సీరియస్ అయ్యారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం విచారణలోనే ఉన్నప్పుడే ఇల్లీగల్ అని ఎలా తేల్చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ ఇల్లీగల్ అవునా కాదా అనేది ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం నిర్ణయాంచాల్సి ఉంటుందని తెలిపారు. ఈ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై విచారణ కొనసాగుతున్న దశలోనే దీనిని అక్రమంగా పేర్కొనడం చట్ట విరుద్ధమని హరీశ్‌రావు తెలిపారు. కానీ ఈ తరహా వ్యాఖ్యలు సిట్ చీఫ్ సజ్జనార్ చేయడం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్యంలో న్యాయస్థానం తుది తీర్పు ఇచ్చే వరకు ఏ ఆరోపణను కూడా నేరంగా పరిగణించకూడదన్నది స్థిరమైన న్యాయసూత్రమని ఆయన స్పష్టం చేశారు. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 21లో భాగమైన డాక్టరిన్ ఆఫ్ ప్రిజంప్షన్ ఆఫ్ ఇన్నోసెన్స్ చెబుతుందని తెలిపారు. దర్యాప్తు చేయడమే పోలీసుల బాధ్యత తప్ప.. తీర్పు చెప్పే అధికారం వారికి లేదని వ్యాఖ్యానించారు.. ఫోన్ ట్యాపింగ్ చట్టబద్ధమా? కాదా అన్నది భారత టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యాక్ట్ అలాగే పీయూసీఎల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉందో లేదో న్యాయస్థానమే నిర్ణయించాల్సి ఉంటుందని హరీశ్‌రావు స్పష్టం చేశారు. కానీ కేసీఆర్ సిట్ విచారణ పూర్తయ్యిందని చేసిన అధికారిక ప్రకటనలోనే అక్రమమం అని తేల్చడం సరికాదని అన్నారు. సిట్ చీఫ్ సజ్జనార్ వ్యాఖ్యలు దర్యాప్తు ఫలితంపై ముందస్తు అభిప్రాయంతో ఉన్నట్లు కనిపిస్తున్నాయని హరీశ్‌రావు తెలిపారు. ఇది ఆలిండియా సర్వీసెస్ (కండక్ట్) రూల్స్ 1968కు విరుద్ధమని అన్నారు. మాజీ సీఎం, ప్రతిపక్ష నాయకుడికి సంబంధించి రాజకీయంగా సున్నితమైన అంశంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం ద్వారా దర్యాప్తులో నిష్పక్షపాతత్వంపై అనుమానాలను కలిగిస్తున్నాయని తెలిపారు. విచారణకు ముందే తప్పు జరిగిందనే భావన కలిగించేలా చేసిన ప్రకటనలు ప్రజలకు న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. పోలీస్ కమ్యూనికేషన్లను రాజకీయ కథనాలను బలపరిచేందుకు ఉపయోగించరాదని స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలు స్వతంత్రంగా, వృత్తిపరంగా చట్ట పరిధిలోకి లోబడే పనిచేయాలని హరీశ్‌రావు సూచించారు. పోలీసుల ప్రకటనల ద్వారా కాకుండా తీర్పులను కోర్టులు ఇవ్వాలని అన్నారు. రాజ్యాంగ పరిమితులను దర్యాప్తు సంస్థలు విస్మరిస్తే ప్రజాస్వామ్యం నిలవదని హెచ్చరించారు. ప్రతిపక్ష నేతగా కేసీఆర్‌ను సీట్ చీఫ్ ఎందుకు గుర్తించడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో హరీష్‌రావు ఒక పోస్టు పెట్టారు. పోలీసులకు దర్యాప్తు బాధ్యత మాత్రమే అప్పగించబడిందని, విచారణ దశలో ఏదైనా చర్యను చట్టవిరుద్ధమని ప్రకటించడానికి పోలీసులు న్యాయమూర్తులో లేదా న్యాయనిర్ణేతలో కాదని పేర్కొన్నారు.

# కులం కాదు.. గుణం చూసి ఓటేయండి

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాం**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2:** మున్సిపల్ ఎన్నికల్లో కులం కాదని.. గుణం చూసి ఓటేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. పైసలు కాదని.. పని చేసేవారికి ఓటు వేయాలని సూచించారు. మంచి అభ్యర్థులు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా ఓటు వేయాలని కోరారు. తెలంగాణ జాగృతి తరఫున మంచి అభ్యర్థులు ఫార్వర్డ్ బ్లాక్ గుర్తుపై పోటీ చేస్తున్నారని కవిత పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి కార్యాలయంలో సోమవారం మీడియాతో కవిత మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ టార్గెట్‌గా విమర్శలు చేశారు. మునిసిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఎవరు నిలబడ్డ కారు గుర్తుపై ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారని ప్రస్తావించారు. చెడ్డ వాళ్లకి ఓటు వేయాలని కేటీఆర్ చెబుతున్నారా అని ప్రశ్నించారు. కేటీఆర్ మాటలు నియంతృత్వం, రాచరికపు పోకడలకు నిదర్శనమని విమర్శించారు. రేవంత్‌రెడ్డితో హరీశ్‌రావు కుమ్మక్కు అయి.. నాటకాలాడుతు న్నారని కవిత విమర్శలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంలో ఫెయిర్‌గా విచారణ జరగాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్‌ని సిట్ విచారణకు పిలిచిందని ప్రస్తావించారు. ఈ కేసులో సిట్ విచారణకు పిలిస్తే ఎవరైనా పోక తప్పదని కవిత స్పష్టం చేశారు. కేందప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్జడెట్‌లో తెలంగాణకు మోదీ సర్కార్ అన్యాయం చేసిందని కవిత విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్న ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించారు. గంజాయి ముఠా దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీ ఫీజు సొంతంగా కట్టుకున్నారా..? ప్రభుత్వ సొమ్ముతో కట్టారా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ఈ విషయంపై ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి దావోస్ వెళ్లి ఎన్ని ఏంఓయూలు చేసుకున్నారని నిలదీశారు. ఫేక్ కంపెనీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంఓయూలు చేసుకుందని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఫేక్ ఎంఓయూలపై యువత దృష్టి పెట్టాలని సూచించారు. ఫేక్ ఏంఓయూలపై జాగృతి పోరాటం చేస్తుందని కవిత పేర్కొన్నారు.

# మేం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్‌లో ఎవరూ మిగలరు

**మంత్రి అడ్లూరి సంచలన వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 2 :** మేం గేట్లు ఓపెన్ చేస్తే బీఆర్ఎస్ పార్టీలో ఎవరూ మిగలరని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డిని కాదని కేసీఆర్ దగ్గరికి వెళ్లే నేతలు ఎవరూ ఉండరని మంత్రి స్పష్టం చేశారు. బిఆర్ఎస్‌లో చేరేందుకు ఎవరు కూడా సిద్దంగా లేరన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరికలు ఉంటాయని కేసీఆర్ అనడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్.. పదేళ్లలో కాంగ్రెస్ నేతలపై పెట్టిన అక్రమ కేసులపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తాము రెండేళ్లలో బీఆర్ఎస్ నేతలపై ఎలాంటి అక్రమ కేసులు పెట్టలేదన్నారు. అక్రమంగా దోచుకున్న డబ్బులతో బీఆర్ఎస్ నేతలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని విమర్శించారు. తప్పు చేయకపోతే విచారణకు సహకరించాలి తప్ప.. భయపడటం ఎందుకని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో ఎన్నో దుర్మార్గాలు జరిగాయన్నారు. అవన్నీ బయటపడాల్సి ఉందన్నారు.

# రాహుల్‌ను అడ్డుకోవడం సరికాదు

**చెప్పాల్సిన విషయం చెప్పకుండా పోయింది**

**లోక్‌సభలో ప్రభుత్వ తీరును తప్పుపట్టిన శశిథరూర్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** రాహుల్ గాంధీ లోక్‌సభలో చేసిన వ్యాఖ్యలపై అధికార పక్షం అతిగా స్పందించిందని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ వ్యాఖ్యానించారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణెళి రాసిన పుస్తకం లోని విషయాలతో వచ్చిన ఒక ఆర్టికల్‌ను రాహుల్ తన ప్రసంగంలో ప్రస్తావిస్తుండగా అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం తలెత్తి సభ వాయిదా పడింది. అనంతరం మీడియా సమావేశంలో రాహుల్‌కు బాసటగా శశిథరూర్ స్పందించారు. తన ఆందోళనను బయటపెట్టే అవకాశం ఆయనకు ఎప్పుడూ రాలేదు' అని శశిథరూర్ పేర్కొన్నారు. ఆ కథనం బలగాలను కానీ సైనికులను కానీ తప్పుపట్టలేదని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న, తీసుకోకుండా పోయిన కొన్ని అంశాలను మాత్రమే రాహుల్ గాంధీ ప్రస్తావించాలనుకున్నారని, దానికి ప్రభుత్వం అంత అతిగా స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. రాహుల్ లేవనెత్తాలనుకున్న అంశం గురించి ప్రజలకు తెలిసిందేనని, ఆయన ఓ మ్యాగజైన్‌లో ప్రచురితమైన కథనంగా ఆధారంగానే మాట్లాడారని వివరించారు. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని ప్రభుత్వం అభ్యంతరం చెప్పడానికి బదులుగా ఆయనకు మాట్లాడే అవకాశం ఇచ్చి ఉండాల్సి ఉందని శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అతిగా స్పందించాల్సిన అవసరం లేదు. అది సభ వాయిదాకు దారితీసింది. చర్చ కొనసాగించి ఉంటే పార్లమెంటులో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రతిబింబించి ఉండేది. నిజాలు తప్పయితే నిజాలను సవరించాలి. కానీ నిజాలను ప్రసారం కాకుండా అడ్డుకోకూడదు' అని శశిథరూర్ వ్యాఖ్యానించారు. పండిట్ జవహర్‌లా నెహ్రూ హయాంలో పార్లమెంటులో జరిగిన కీలక చర్చను ఈ సందర్భంగా శశిథరూర్ ప్రస్తావించారు. 1962లో చైనా-భారత్ యుద్ధం జరుగుతుండగా పార్లమెంటు సమావేశమైందని, ఒకవైపు యుద్ధం జరుగుతుండగా చర్చలను పొడిగించి మరీ నిర్వహించారని చెప్పారు. 'అప్పుడు ఎలాంటి విప్‌లు లేవు. ప్రభుత్వ ఎంపీలు సైతం ప్రభుత్వాన్ని, ప్రధానమంత్రి నెహ్రూను సైతం విమర్శించగలిగే వారు' అని తెలిపారు. 1965, 1971 యుద్ధాల సమయంలోనూ పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసి ఆ వివరాలను ఎంపీలతో పంచుకోవడం, దేశ ప్రజలను పరిగణనలోకి తీసుకోవడం జరిగిందని ఆయన వివరించారు.




సంపాదకీయం

# మసిపూసి మారేడుకాయ!

మసిపూసి మారేడుకాయ చేయడమంటే ఇదే. దేశంలో ప్రజల ఆకలిబాధలను, పరిస్థితులను,రోదనలను పట్టించుకోకుండా బడ్జెట్ యధావిధిగా ప్రవేశ పెట్టారు. గత 9 ఏళ్లుగా నిర్మలా సీతారామన్ బడ్జెట్ వల్ల దేశంలో మార్పులు ఏమైనా వచ్చాయా అని చర్చిస్తే..వచ్చాయనే చెప్పాలి. దేశంలో ఆర్థిక మందగమనం సాగుతోంది. ప్రజల కొనుగోలు శక్తి తగ్గింధి. నిత్యాసవర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు పెరిగాయి. ముఖ్యంగా ఔషధాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కోవిడ్ తరవాత ధరలను పరిశీలిస్తే 200 నుంచి 500 శాతం వరకు ఔషధాల ధరలు పెరిగాయి. సామాన్యునులు వైద్యం చేయించుకునే మాటెలా ఉన్నా..మందులు కొనుక్కుని వేసుకునే దిక్కులేకుండా పోయింది. మరి బడ్జెట్ ప్రగతిశీలమైతే ఇవన్నీ ప్రభావం చూపాలి. చూపడం లేదంటే బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని గుర్తించాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో మార్పురావడం లేదు. ప్రజల చేతుల్లో డబ్బులు ఆడడం లేదు. సంపాదించింది తిండికి కూడా సరిపోవడం లేదు. ఇలా నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మరోసారి సామాన్యులను నిజంగానే వంచించింది. ఒకదాని తరువాత ఒకటిగా చోటుచేసుకుంటున్న అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ ఆర్థిక సర్వే చేసిన హెచ్చరికలను సైతం బేఖాతరు చేసింది. కొద్దిమంది కోటీశ్వరుల ప్రయోజనాలను రక్షించేదిగా మాత్రమే బడ్జెట్ ఉంది. వరుసగా తొమ్మిదవసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తన ప్రసంగంలోఘనంగా చెప్పిన 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్' నిర్దాక్షిణ్యంగా సగటుజీవి పైనుండి దూసుకెళ్ళింది. ఫలితం 53,47,315 కోట్ల రూపాయల బడ్జెట్ సామాన్యులను ప్రమాదంలోకి నెట్టింది. కార్పొరేట్లకు, కోటీశ్వరులకు రాయితీలు, వరాల వర్షం కురిపించి నప్పుడు గుర్తుకురాని ఆర్థిక క్రమశిక్షణ కార్మికులకు, రైతులకు, వ్యవసాయ కూలీలకు, మధ్య తరగతి ప్రజానీకానికి మాత్రం గుర్తు చేశారు. దేశంలోని కోటానుకోట్ల జనానికి మేలు చేసేదిలా బడ్జెట్ లేదన్నది ముమ్మాటికీ నిజం. ప్రతిపక్ష సభ్యులు మొదలు, ఆర్థిక సంస్కరణ అభిలాషులు సైతం దీనిని అంగీకరిం చారు. ఫలితంగా వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, విద్య, వైద్యం, ఆరోగ్యం, సామాజిక సంక్షేమం ఇలా ఒకటేమిటి?అన్ని రంగాల సాధారణ ప్రజానీకానికి సంబంధించిన పథకాల కేటాయింపుల్లో కోతలు పడ్డాయి. చివరికి, మహిళా సంక్షేమం, అభివృద్ధి కోసం కేటాయించే 'జెండర్ బడ్జెట్'కూ నిధులలోనూ కోత పెట్టడం మోడీ సర్కారు తీరుకు నిదర్శనం. దీంతో రానున్న రోజుల్లోనూ నిరుద్యోగం, అధికధరలు, జీవన వ్యయాలు పెరగడం, ఉపాధి కోత వంటి కష్టాలు తప్పవన్న విశ్లేషణలు వినిపిస్తున్నాయి. కేంద్రబడ్జెట్‌లో సామాన్యులకు నేరుగా ప్రయోజనం కల్పించే చర్యలు పెద్దగా లేవు. గత ఏడాదిలో ఆదాయ పన్ను, జీఎస్టీల్లో భారీ కోతలతో ఉపశమనం కల్పించిన ప్రభుత్వం ఈసారి వాటి జోలికి వెళ్లలేదు. అయితే పలు విభాగాల్లో మినహాయింపు లను ఇవ్వడం ద్వారా పరోక్షంగా సాయం చేసేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకుంది. అయితే అది ఏమేర ప్రతిఫలిస్తుందన్నది చూడాలి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో.. మధ్య తరగతి వారు, చిన్న ఇన్వెస్టర్లకు పలు అంశాల్లో మినహాయింపులను ప్రకటించారు. వ్యవసాయం, విద్య, చిన్న పరిశ్రమలు, ఆరోగ్య రంగం,ఫైనాన్షియల్ మార్కెట్లు, ఐటీ రంగం, రవాణా మౌలిక వసతులు, పర్యాటకం, క్రీడా రంగాల ద్వారా సామాన్యులకు పరోక్షంగా ప్రయోజనం కల్పించే చర్యలను మంత్రి వెల్లడించారు. పోటీతత్వం పెంచడంతోనే ఆర్థికవృద్ధిని వేగవంతం చేయగలమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఉత్పాదకతను, పోటీతత్వాన్ని పెంచడం ద్వారా నిలకడగల ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం, వారి సామర్థ్యాలను మెరుగుపరచడం, ప్రతి కుటుంబం, సమాజం, ప్రాంతం వృద్ధికి వనరులు, అవకాశాలను పొందేలా చూడటం అనే మూడు 'కర్తవ్యాలు'ను ప్రభుత్వం చేపట్టిందని మంత్రి పేర్కొన్నా.. గత 9 ఏళ్లుగా ఇవేమీ కనిపించడం లేదు. ఏటా కొత్తకొత్త ప్రకటనలతో మభ్య పెట్టడం సాధ్యం కాదని పాలకుల తెలుసుకుంటే మంచిది. ఈ కర్తవ్యాలను సక్రమంగా నెరవేర్చడానికి సంస్కరణల ఎక్స్‌ప్రెస్ వేగంగా ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. గత 12ఏళ్ళుగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల ఫలితమే ఈనాటి అనిశ్చిత పరిస్థితుల్లో కూడా నిలకడగల వృద్ధిని, ఆర్థిక సుస్థిరతను సాధించగలిగామని నిర్మలమ్మ చెప్పుకున్నారు. అయితే ఈ లెక్కలు దేనిని బేరీజు వేసుకుని చెప్పారన్నది అర్థం కావడం లేదు. గ్రామాలకు వెళితే ప్రజల జీవన పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలుస్తాయి. వారికి ఇంకా ఉచిత బియ్యం అందిస్తున్నామంటే, వారి అర్థిక పరిస్థితిని గమనించవచ్చు. రైతులు ధాన్యం పండిస్తున్నా గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. తిండి గింజలు కొనుక్కోలేక సామాన్యులు విలవిల్లాడుతున్నారు. అయితే కేన్సర్ పేషెంట్లకు ఊరట కలిగించేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. కేన్సర్ చికిత్స కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకునే అత్యావశ్యక ఔషధాలపై దిగుమతి సుంకాన్ని మినహాయిస్తారు. దీనిలో భాగంగా 17 రకాల ఔషధాలు ధరలు తగ్గుతాయి. అరుదైన వ్యాధుల చికిత్సకు ఉపయోగించే మరో ఏడు కీలక ఔషధాలపై కూడా దిగుమతి సుంకాలు తగ్గుతాయి. కేన్సర్ చికిత్సలో వాడే మందులు, ఇతర ఔషధాలు, ఆహార పదార్థాలు, పరికరాలపై కూడా సుంకాలు తగ్గుతాయి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఆకళింపు చేసుకోకుండా ఎన్ని బడ్జెట్లు ప్రవేశ పెట్టినా భారత పురోగతి కాగితాలకే పరిమితం అవుతుంది.





# బలూచీ ఆత్మాహుతి దాడిలో 50మది మృతి

## ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లు పాల్గొన్నట్లు గుర్తింపు



**ఇస్లామాబాద్, ఫిబ్రవరి 2:** పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్సులో నరమేథం కొనసాగుతోంది. పాక్ సైన్యం చేపట్టిన ఆపరేషన్‌కు వ్యతిరేకంగా ఆత్మహుతి దాడులు సాగుతున్నాయి. దీంతో ఇప్పటికే వందల్లో మృతి చెందారు. బలూచిలోని 12 వేర్వేరు ప్రాంతాల్లో పెద్దఎత్తున జరుగుతోన్న దాడులకు బాధ్యత వహిస్తూ.. బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ప్రకటన వెలువరించింది. పాక్ దళాలపై దాడి చేసింది తమ విభాగానికి చెందిన ఇద్దరు మహిళా ఆత్మాహుతి బాంబర్లేనని వెల్లడించింది. వీరిలో 24 ఏళ్ల ఆసిఫా మెంగల్ అనే యువతి చేసిన దాడిలో పాక్ సిబ్బంది సహా 50 మంది మృతి చెందినట్లు తెలిపింది. మరో ఆత్మాహుతి బాంబర్ దాడిలోనూ అనేకమంది ప్రాణాలు కోల్పోయినట్లు పేర్కొంది. అయితే ఆ బాంబర్ పేరును మాత్రం వెల్లడించలేదు. బలోచిస్థాన్ అంతటా భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకొని 'హీరోఫ్' పేరుతో రెండో దశ ఆపరేషన్‌ను ప్రారంభించను న్నట్లు బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ ఆదివారం పేర్కొంది. ఈ విషయంపై పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మా ట్లాడుతూ.. ఆత్మాహుతి దాడుల్లో ఇద్దరు మహిళా నేరస్థులు పాల్గొన్నట్లు గుర్తించామన్నారు. ఈ దాడులపై బలోచిస్థాన్ ముఖ్యమంత్రి సర్ఫరాజ్ బుగతీ స్పందించారు. పాకిస్థాన్ భద్రతా దళాలు 40 గంటలుగా ఉగ్రవాద ఏరివేత చర్య లు కొనసాగిస్తున్నాయని.. ఇందులోభాగంగా ఇప్పటివరకు 140 మందికి పైగా వేర్పాటువాదులను మట్టుబెట్టాయని వెల్లడించారు. స్థానిక పౌరుల వేషధారణలో ఉన్న బలోచ్ రెబల్స్ పాఠశాలలు, బ్యాంకులు, మార్కెట్లు, ఆసుపత్రులలోకి ప్రవేశించి కాల్పులకు తెగబడుతున్నారని పాక్ మిలిటరీ తెలిపింది. ఏదైనా నగరం లేదా వ్యూహాత్మక స్థావరాన్ని స్వాధీనం చేసుకోవడానికి బలోచ్ రెబల్స్ ప్రయత్నాలు చేస్తున్నాయని.. అయితే వాటిని తమ దళాలు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాయని పేర్కొంది.



# నరవణె పుస్తకంలోని వ్యాఖ్యల ఉల్లేఖన

## లోక్‌సభలో రాహుల్ ప్రసంగంపై గందరగోళం

## అడ్డుకున్న మంత్రులు రాజ్‌నాథ్, అమిత్ షా



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో సోమవారం గందరగోళం తలెత్తింది. విపక్ష నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఆర్మీ మాజీ చీఫ్ మనోజ్ ముకుంద్ నరవణెళి రాసిన పుస్తకంలోని ఒక వాక్యాన్ని ప్రస్తావించడంతో గందరగోళం చెలరేగింది. వెంటనే రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాహుల్ ప్రసంగాన్ని అడ్డుకున్నారు. నరవణెళి పుస్తకం ఇంకా పబ్లిష్ కాలేదని, ప్రచురితం కాని పుస్తకం నుంచి వ్యాఖ్యలను పార్లమెంటరీ ప్రొసీడింగ్స్‌లో ఎలా ప్రస్తావిస్తారని నిలదీశారు. సబ్జెక్ట్‌పై మాట్లాడాలన్నారు. రాజ్‌నాథ్ సింగ్ లేవనెత్తిన అభ్యంతరాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సమర్థించారు. 'మ్యాగజైన్ ఏదైనా రాయవచ్చు. పుస్తకం అధికారికంగా ప్రచురితం కానప్పుడు దానికి విశ్వసనీయత ఉండదు' అని అన్నారు. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ రాహుల్ మాట్లాడటం సరికాదన్నారు. పార్లమెంటరీ విధివిధానాలను పాటించాలని సూచించారు. దీంతో స్పీకర్ జోక్యం చేసుకుని ఆ పుస్తకం ఎక్కడుందో చూపించాలని అడిగారు. ప్రతిపక్ష నేతగా మీరు ఆరోపణలు చేస్తున్నారే కానీ సభ నిబంధనలను పాటించడం లేదన్నారు. ఇది సరైన పద్ధతి కాదన్నారు. దీంతో రాహుల్ వెంటనే స్పందించారు. 'ఏమి మాట్లాడమంటారో దయచేసి మీరే చెప్పండి' అన్నారు. దీనిపై స్పీకర్ వెంటనే జవాబిచ్చారు. నేను మీ సలహాదారుని కాదు. స్పీకర్‌గా సభ సజావుగా సాగేలా చూడటం నా బాధ్యత. నిర్దేశిరచిన సబ్జెక్ట్ మీదే చర్చ ఉండాలి' అన్నారు. దీంతో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

# యూపీ సీఎం యోగి సంచలన నిర్ణయం

## ఉద్యోగుల స్థిరచరాస్తుల వివరాలు సమర్పించాలని ఆదేశం



**లక్నో, ఫిబ్రవరి 2:** ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆధిత్యనాథ్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో అవినీతి రహిత పాలన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగుల స్థిర,చర ఆస్తులు అంటే ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి తరలించే వాహనాలు ఇతర ఆస్తులతో స్థిరాస్తులైన ఇళ్లు, స్థలాల వివరాలను అందించాలని సూచించారు. ఇందుకోసం మానవ్ సంపద పేరుతో ఓ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 8,66,261 ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. డిసెంబర్ 31,2025 నుంచి జనవరి 31,2026 వరకు వారి ఆస్తుల వివరాల్ని పోర్టల్‌లో పొందుపరచాలని ఆదేశించారు. నిర్దేశించిన గడువు లోపు ఆస్తుల వివరాలు అందించాలని, లేదంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చీఫ్ సెక్రటరీ ఎస్పీ గోయల్ పర్యవేక్షించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీఎం యోగి ఆధిత్యనాథ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఉద్యోగులు తమ తమ ఆస్తులు ఇవేనంటూ సంబంధిత ఆస్తుల వివరాల్ని మానవ్ సంపద్ పోర్టల్‌లో ఆధాలతో సహా అప్‌లోడ్ చేశారు. వారిలో 68వేల మంది ఉద్యోగులు వారి వివరాల్ని ఇవ్వలేదు. ఉద్యోగుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన యూపీ సీఎం వారి జనవరి జీతాల్ని నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగుల ఆస్తుల వివరాలు ఇచ్చే వరకు జీతాలు ఇవ్వకూడదని సంబంధిత శాఖ అధికారులకు స్పష్టం చేశారు. అంతేకాదు, ప్రమోషన్ల నిలిపివేయడం, వారిపై పెనాల్టీ విధిస్తామని హుకుం జారీ చేశారు.

# చీరల గురించి కాదు.. బడ్జెట్‌పై చర్చించండి

## సోషల్ మీడియా వార్తలపై నిర్మలమ్మ అసహనం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** ఏటా బడ్జెట్ వేళ ఆర్థిక కేటాయింపుల పైనే కాకుండా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ధరించే చీరలపై అందరి దృష్టి ఉంటుంది. ఎందుకంటే ఆమె చేనేతకు సంబంధించిన ప్రత్యేకించిన చీరలను ధరిస్తారు. అలాగే ఎంతో హుందాగా దర్శనమిస్తారు. ఈ సందర్భంగా ఏటా ఆమె ధరించే చీరలపై చర్చ సాగుతూనే ఉంటుంది. దేశ సంస్కృతీ సంప్రదాయాల్ని ప్రతిబింబించేలా ఆమె ఎంచుకునే చీరలపై చర్చలు జరుగుతాయి. ప్రతి ఏడాది బడ్జెట్ సమయంలో తన చీరలపై జరుగుతోన్న చర్చలపై ఆర్థికమంత్రి అసహనం వ్యక్తంచేశారు. ప్రతి సంవత్సరం బడ్జెట్రోజు నేను ఏం ధరించబోతున్నా ననే ప్రశ్నలు నాకు ఒత్తిడిగా మారుతున్నాయన్నారు. 'ఎందుకు ఇలా ప్రశ్నలతో వేధిస్తున్నారు? ఒకవేళ బడ్జెట్ ప్రవేశపెట్టేది పురుష మంత్రులైతే వారిని కూడా ఇలాగే వారి దుస్తుల గురించి అడిగేవారా? నేను ధరించే చీరను కూడా బడ్జెట్‌లో ఒక అంశంలా మార్చేస్తున్నారు' అంటూ సీతారామన్ అసహనం వ్యక్తంచేశారు.బడ్జెట్లో ఉన్న అంశాలు ఏమిటి అనే విషయాలను తెలుసుకోవడంపై ప్రజలు దృష్టి పెట్టాలని.. తన చీరలపై కాదని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. ఇటువంటి అనవసర విషయాల గురించి ఆలోచించడం వల్ల ముఖ్యమైన విషయాలపై పట్టు కోల్పోతామన్నారు. కాగా ఆదివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ వేళ ఆమె కాంచీపురం చీరలో కన్పించారు. బంగారు, కాఫీ వర్ణం అంచుతో ఉన్న మెజెంటా రంగు చీర, గోల్డెన్ కలర్ బ్లౌజ్, శాలువాతో కన్పించారు. అది తమిళనాడు నేపథ్యం ఉన్న చీర. కొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ.. ఆమె కాంచీపురం చీరను ఎంచుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీనిపై నెట్టింట చర్చ జరుగుతోన్న సమయంలో నిర్మలా సీతారామన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం

# బుల్లెట్ ట్రైన్ హబ్‌గా హైదరాబాద్

## బుల్లెట్ ట్రైన్ల కేటాయిపులపై మంత్రి అశ్వినీ వైష్ణవ్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 2:** బుల్లెట్ ట్రైన్‌కు హైదరాబాద్ మహా నగరం హబ్‌గా మారుతుందని రైల్వే, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు.బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన రైల్వే ప్రాజెక్టులతోపాటు నిధుల కేటాయింపులనువివరించారు. సోమవారం న్యూఢిల్లీలో మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణలో రైల్వే ప్రాజెక్టులకు రూ.5,454 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. అలాగే మూడు బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులు ఇచ్చామని చెప్పారు. అవి.. హైదరాబాద్ – బెంగళూరు (రెండున్నర గంటల ప్రయాణం..) , హైదరాబాద్ – చెన్నై (2:55 గంటల ప్రయాణం..), హైదరాబాద్ – పుణె (1:45 గంటల ప్రయాణం..) అంటూ సోదాహరణగా వివరించారు. కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంట్‌కు సమర్పించారు. ఈ బడ్జెట్‌లో కేటాయింపును ఆయన వివరించారు. బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లు అన్నీ ఎలివేటెడ్ కారిడార్‌గా నిర్మిస్తామన్నారు. అందుకు సంబంధించిన పనులను త్వరలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఇది సౌత్ ఇండియా డైమండ్ హై స్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అభివర్ణించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కంటే అధికంగా తెలంగాణ రాష్ట్రానికి రైల్వే ప్రాజెక్టులకు నిధులు కేటాయించామని ఈ సందర్భంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ చెప్పారు. అయినా 2026-27 బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపిందంటూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీలోని పలువురు అగ్రనేతలు ఆరోపిస్తున్నారు. అలాంటి వేళ రైల్వే శాఖ ద్వారా తెలంగాణకు జరిగిన బడ్జెట్ కేటాయింపులను ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సోదాహరణగా వివరించారు.



# జనం ముంగిట జల సిరి

- జల జీవన్ మిషన్ గడువు పెంపుతో రాష్ట్రానికి ఊరట
- 18 నెలలుగా జేజేఎం కార్యక్రమాన్ని గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం
- తాగునీరు అందించేలా రూ.84,500 కోట్లతో సమగ్ర నివేదిక
- తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మార్గం సుగమం



**అమరావతి:** జల జీవన్ మిషన్(జేజేఎం) కార్యక్రమం అమలు గడువు 2028 వరకు పొడిగించడంతో రాష్ట్రంలో వివిధ దశల్లో ఉన్న పెండింగ్ తాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మార్గం సుగమం కానుంది. వీటికి కేంద్రం వాటా నిధులు రాబట్టే అవకాశం కూడా కలిగింది. నదులు, జలాశయాల నుంచి నీరు సేకరించి ప్రజలకు అందించేలా రూ.70 వేల కోట్ల అంచనాలతో ప్రతిపాదించిన పనులను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే కేంద్ర ఆమోదానికి పంపింది. ఈ ప్రయత్నాలు కూడా కొలిక్కి రానున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జల జీవన్ మిషన్‌కు రాష్ట్ర వాటా నిధులు సమకూర్చకుండా ఈ కార్యక్రమాన్ని భ్రష్టుపట్టించింది. కేంద్రం అప్పట్లో రాష్ట్రంలో సుమారు రూ.27 వేల కోట్ల పనులకు అనుమతులిచ్చినా, ఐదు సంవత్సరాల వ్యవధిలో గత ప్రభుత్వం కేవలం రూ.4 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగలిగింది. రాష్ట్ర వాటా నిధులివ్వని కారణంగా మిగిలిన పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్ర వాటా నిధులు సరిగా కేటాయించకపోగా, కేంద్ర నిధులనూ ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో రాష్ట్రంలో 64.78 లక్షలకు పైగా ఇళ్లకు కుళాయిల ద్వారా 2024 నాటికి తాగునీటి సౌకర్యం కల్పించా లన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరలేదు. ఇచ్చిన కొద్దిపాటి కుళాయిల ద్వారా నీరు సరిగా సరఫరా చేయలేకపోయింది.

### ఫలితాలిచ్చిన సంప్రదింపులు

గత 18 నెలలుగా జల జీవన్ మిషన్ కార్యక్రమాన్ని గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం యత్నిస్తోంది. ఇందుకోసం 40 వేల పాత పనులను రద్దు చేసి, కొత్త పనులు ప్రతిపాదించింది. 2024 మార్చి తరువాత పథకంలో కొత్త పనులకు, సవరించిన పనులకు కేంద్రం అనుమతులు నిలిపివేసింది. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని ఒప్పించి, నిధులు మంజూరు చేయించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. బోర్ల నుంచి కాకుండా నేరుగా జలాశయాల నుంచి నీరు సేకరించి అన్ని సీజన్లలోనూ ప్రజలకు నిరంతరం తాగునీరు అందించేలా దాదాపు రూ.84,500 కోట్లతో సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)లు కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది. కేంద్ర జల్‌శక్తి మంత్రిని దిల్లీలో కలిసి పథకం పునర్‌వ్యవస్థీకరణ ప్రాధాన్యం వివరించారు. 2024–25వ సంవత్సరంతో ముగిసిన జేజేఎం(జల జీవన్ మిషన్) గడువు పెంచాలని కూడా కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈలోగా కేంద్రం మొదట అనుమతించిన సుమారు రూ.27 వేల కోట్ల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జేజేఎం(జల జీవన్ మిషన్) గడువు 2028వ సంవత్సరం వరకు పొడిగిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి ఆదివారం (01–02–26) ప్రకటించడం రాష్ట్రానికి ఊరట కలిగించింది.

### పనుల పూర్తికి ప్రణాళికలు

పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.23 వేల కోట్ల ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా కేంద్రం వాటా కింద రాష్ట్రానికి 50 శాతం వరకు నిధులు రానున్నాయి. రాష్ట్ర వాటా నిధుల కోసం జాతీయ ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి బ్యాంకు నుంచి ప్రభుత్వం రూ.10 వేల కోట్ల వరకు రుణం తీసుకుంటోంది. దానికి మరో రూ.3 వేల కోట్లు కలిపి మొత్తం దాదాపు రూ.13 వేల కోట్లు తీసుకోవాలని ఇటీవల నిర్ణయించింది. 2028వ సంవత్సరంలోగా పెండింగ్ పనులు పూర్తి చేయించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించనున్నారు.

### 2028 నాటికి 95.53 లక్షల ఇళ్లకు రక్షిత నీరు

రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంలో ప్రతిపాదించిన పనులన్నీ పూర్తి చేస్తే 2028 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు మాత్రం శాశ్వత పరిష్కారం చూపొచ్చు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దాదాపు 95.53 లక్షల ఇళ్లలో 70.44 లక్షల ఇళ్లకు నేరుగా కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. వచ్చే రెండు సంవత్సరాల్లో మిగిలిన 20.09 లక్షల ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చి మొత్తం 95.53 లక్షల కుళాయిల ద్వారా రోజూ నీరందించనున్నారు.

# క్లీన్ చిట్టా... పాప పరిహారం

**తిరుమల :** తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మళ్లీ చిచ్చు రేపింది. సీబీఐ పర్యవేక్షణలోని సిట్ దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను ఇరు పక్షాలు తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తుండటంతో, అసలు నిజం ఏంటనేది ఇప్పుడు సామాన్య భక్తులలో సరికొత్త చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా వైసీపీ చేస్తున్న క్లీన్ చిట్ ప్రచారానికి, సిట్ ఛార్జిషీట్‌లో ఉన్న కెమికల్ నెయ్యి వాస్తవాలకు మధ్య రాజకీయ ప్రచారం తెరలా మారిపోతోంది. సిట్ నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు లేదా చేప నూనె ఆనవాళ్లు ఉన్నట్లు నిర్ధారణ కాలేదని వైసీపీ గట్టిగా ప్రచారం చేస్తోంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసమే ఈ అపవాదు వేసిందని, ఇప్పుడు సిట్ నివేదికతో తాము సుద్ధపూసలమని నిరూపితమైందని ఆ పార్టీ నేతలు వాదిస్తున్నారు. ప్రజల మనోభావాలతో ఆడుకున్నందుకు కూటమి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం జంతు కొవ్వు అంశాన్ని మాత్రమే హైలైట్ చేస్తూ, ఇతర అంశాలను పక్కదారి పట్టించే వ్యూహాన్ని వైసీపీ అనుసరిస్తోంది.అయితే, సిట్ ఛార్జిషీట్ లోని లోతైన అంశాలను గమనిస్తే భయంకరమైన వాస్తవాలు బయటపడు తున్నాయి. సిట్ నివేదిక ప్రకారం.. సరఫరా అయిన నెయ్యిలో జంతు కొవ్వు లేకపోవచ్చు కానీ, అది అసలు నెయ్యే కాదు. అది కేవలం ప్రమాదకరమైన కెమికల్స్ , వెజిటబుల్ ఆయిల్స్ తో తయారైన మిశ్రమమని సిట్ తేల్చింది. అంటే, ఐదేళ్ల పాటు లక్షల లీటర్ల కెమికల్ నెయ్యి ని భక్తులకు ప్రసాదం రూపంలో పంచారనేది సిట్ ప్రధాన అభియోగం. జంతు కొవ్వు లేదని సంబరపడుతున్న వైసీపీ, ఈ కెమికల్ కల్తీ పై ఎందుకు మాట్లాడటం లేదని టీడీపీ ప్రశఅనిస్తోంది.వైసీపీ ఇంతలా ఎదురుదాడి చేస్తున్నా, కూటమి ప్రభుత్వం నుండి ఇంకా గట్టి కౌంటర్ మొదలవ్వలేదు. దీనికి ప్రధాన కారణం, సిట్ నివేదికపై కోర్టుల స్పందన కోసం ప్రభుత్వం వేచి చూస్తుండటమే కావచ్చు. సీబీఐ నేతృత్వంలోని సిట్ ఇచ్చిన ఈ ఛార్జిషీట్ కోర్టులో విచారణకు వచ్చినప్పుడు, వైసీపీ చేసిన తప్పులు నిబంధనల ఉల్లంఘన, అనర్హులైన వారికి టెండర్లు ఎలా నిరూపితమవుతాయనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రాజకీయం కంటే న్యాయపరంగా వైసీపీని ఇరికించాలని కూటమి భావిస్తున్నట్లు కనిపిస్తోంది. త్వరలోనే ఈ సీబీఐ–సిట్ రిపోర్టుపై న్యాయస్థానాలు



స్పందించనున్నాయి. కల్తీ నెయ్యి సరఫరా చేసిన బోలే బాబా డైరీ ,ఇతర సంస్థల వెనుక ఉన్న పెద్ద తలకాయల పాత్రపై కోర్టు ప్రశ్నలు కురిపించే అవకాశం ఉంది. జంతు కొవ్వు లేదన్న ఒక్క పాయింట్ మీద వైసీపీ గెలిచినట్లు కనిపిస్తున్నా, విషపూరితమైన కెమికల్ నెయ్యి సరఫరా జరిగిందని కోర్టు గనుక సీరియస్ అయితే, ఆ పార్టీకి అది కోలుకోలేని దెబ్బ అవుతుంది.సామాన్య భక్తుడికి కావల సింది జంతు కొవ్వు ఉందా లేక కెమికల్స్ ఉన్నాయా అన్నది కాదు.. తమ ఆరాధ్య దైవం ప్రసాదంలో కల్తీ జరిగిందా లేదా అన్నదే ముఖ్యం. సిట్ నివేదిక కల్తీ జరిగిందని స్పష్టంగా చెబుతోంది. ఒకవేళ కేవలం కెమికల్స్ మాత్రమే ఉన్నా, అది కూడా అపచారమే అన్నది భక్తుల విశ్వాసం. కాబట్టి వైసీపీ చేస్తున్న క్లీన్ చిట్ ప్రచారం కేవలం రాజకీయ రంగు పూయడమేనని, కోర్టుల తీర్పు తర్వాత అసలు దోషులు ఎవరో బహిర్గతమవుతాయని టీడీపీ నేతలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

### సిట్ రాడార్‌లో ముగ్గురు

కల్తీ నెయ్యి కేసులో కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన అనంతరం ప్రభుత్వానికి సిట్ 14 పేజీల లేఖ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఈ లేఖలోని చివరి పేరాలో ఉన్న అంశాలు కీలకంగా మారాయి. తిరుమలలో నెయ్యి సరఫరాకు సంబంధించిన అప్పట్లో కీలక బాధ్యతల్లో ఉన్న ముగ్గురు ఉన్నతాధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిట్ స్పష్టంగా చెప్పినట్టు తెలుస్తోంది. ఇందులో అప్పటి , నేటి ఈవో అనిల్ సింఘాల్, అప్పటి అదనపు ఈవో ధర్మారెడ్డి, ఫైనాన్సియల్ అడ్వైజర్ అండ్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పింది. ఈ సిఫార్సుల మేరకు ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు కొన్ని గంటల్లోనే వచ్చే అవకాశం ఉంది. సిట్ తన నివేదికలో అధికారుల తీరుపై తీవ్రమైన విమర్శలు గుప్పించిందని అంటున్నారు. శ్రీవారి ప్రసాదానికి వాడే నెయ్యి సరఫరాలో ఉండాల్సిన కఠినమైన నాణ్యతా ప్రమాణాలను బలహీన పరిచేలా ఈ అధికారులు వ్యవహరించారని సిట్ గుర్తించిందట. ముఖ్యంగా నెయ్యి సేకరణకు సంబంధించిన నిబంధనల తయారీలో కనీసం మనసు పెట్టలేదని ఆరోపించిందని సమాచారం. అత్యంత నిర్లక్ష్యంగా పని చేశారని నివేదికలో పేర్కొందని తెలుస్తోంది. ఈ పద్దతుల వల్ల నెయ్యి నాణ్యతలో పెద్ద ఎత్తున రాజీ జరిగిందనే ఆరోపణ చేరిందంటున్నారు. ఒకప్పుడు తిరుమల నెయ్యి టెండర్లు అంటే అత్యంత కఠినమైన నిబంధనలకు మారుపేరుగా ఉండేదని, కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిబంధనల స్వరూపం మారిపోయిందని నివేదికలో వెల్లడించినట్టు సమాచారం. యథేచ్ఛగా నిబంధనలు సడలించడంతో కల్తీకి ఆస్కారం ఏర్పడిందని అంటున్నారు. టెండర్లలో పాల్గొనే డెయిరీలు స్వయంగా పాలు సేకరించాల్సిన అవసరం లేదని రూల్ తీసుకొచ్చారు. వెన్న సేకరణ, నెయ్యి ఉత్పత్తి సామర్థ్యంతో సంబంధం లేకుండా టెండర్లు అనుతిచ్చారు. కనీసం మూడేళ్ల పాటు కార్యకలాపాలు నిర్వహించాలనే రూల్ పక్కన పెట్టారు. టెండర్ దక్కించుకోవడానికి ఉండాల్సిన కనీస టర్నోవర్ మొత్తాన్ని 250 కోట్ల నుంచి 150 కోట్లకు తగ్గించేశారు. ఇలాంటి సడలింపుల ద్వారానే నెయ్యి కల్తీకి ఆస్కారం ఏర్పడిందని సిట్ వెల్లడించినట్టు వార్తలు వస్తున్నాయి. ఓవైపు దీనిపై రాజకీయ దుమారం రేగుతున్న టైంలోనే సిట్ సిఫార్సుల మేరకు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. సిట్ నివేదిక అందుకున్న సుప్రీంకోర్టు ఇంకా ఎలాంటి ఆదేశాలు ఇస్తుందో అన్న సస్పెన్స్ కూడా కొనసాగుతోంది.

# టీటీడీ ఈవో అనిల్ సింఘాల్ బదిలీ, నెక్స్ట్ ఏంటీ?

**తిరుమల :** తిరుమల లడ్డూ కల్తీ అంశలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీ ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి అనిల్ కుమార్ సింఘాల్‌ను బదిలీ చేసింది. ఆయన స్థానంలో ప్రస్తుతం ముఖ్యమంత్రి కార్యాలయం ముఖ్య కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ముద్దాడ రవిచంద్రకు టీటీడీ ఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన అనిల్ కుమార్ సింఘాల్‌ను సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఉత్తర్వులలో ఆదేశించారు.అనిల్ కుమార్ సింఘాల్ 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అధికారి. గతంలోనూ ఆయన టీటీడీ ఈవోగా సుదీర్ఘ కాలం పనిచేశారు. 2017 మే 6 నుండి 2020 అక్టోబర్ 4 వరకు మొదటి విడతలో టీడీపీ, వైసీపీ హయాంలో టీటీడీ ఈవోగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్ర సర్వీసులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆయనను రెండోసారి టీటీడీ ఈవోగా నియమించడంతో గత ఏడాది సెప్టెంబర్‌లో అనిల్ సింఘాల్ మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో టీటీడీ పాలనలో కొత్త మార్పులు చోటుచేసుకోనున్నాయి. గతంలో ఆయన టీటీడీ ఈవోగా చేయడం, ఆ సమయంలో లడ్డూ కల్తీ ఆరోపణలతో అనిల్ సింఘాల్‌ను బదిలీ చేసి జీఏడీలో రిపోర్ట్ చేయాలని సూచించారు.తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యి కల్తీపై ప్రత్యేక విచారణ బృందం ఇటీవల తన తుది నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఈ నివేదికతో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి నిప్పు రాజుకుంది.సిట్ తన ఛార్జ్ షీట్‌లో తిరుమలకు నెయ్యి సరఫరాలో భారీ అవకతవకలు జరిగినట్లు పేర్కొంది. సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యిని సరఫరా చేయడం ద్వారా రూ. 250 కోట్ల కుంభకోణం జరిగిందని వెల్లడించింది. ఉత్తరాఖండ్‌కు చెందిన భోలే బాబా డెయిరీతో పాటు ఇతర కంపెనీలు నకిలీ సీల్స్, తప్పుడు ల్యాబ్ రిపోర్టులతో టీటీడీని మోసం చేసినట్లు గుర్తించింది. అయితే, తాజా నివేదికలో జంతువుల కొవ్వు ఆనవాళ్లు లేవని పేర్కొంది. కానీ పామాయిల్, కెమికల్ ఎస్టర్స్ వంటి ఇతర పదార్థాలతో నెయ్యిని కల్తీ చేసినట్లు పేర్కొన్నట్లు వార్తలు రావడంతో చర్చ మొదలైంది.గత వైసీపీ ప్రభుత్వం కావాలనే నిబంధనలు సడలించి, తమకు అనుకూలమైన డెయిరీలకు కాంట్రాక్టులు ఇచ్చిందని టీడీపీ విమర్శిస్తోంది. నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందన్న ఎన్డీడీబీ నివేదికను గుర్తు చేస్తూ, సిట్ నివేదిక కల్తీని ధృవీకరించిందని, ఇది ముమ్మాటికీ భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. సిట్ నివేదికలో జంతు కొవ్వు లేదని తేలడంతో వైసీపీ ఎదురుదాడి ప్రారంభించింది. సీఎం చంద్రబాబు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే దేవుడిని వాడుకున్నారని, అబద్ధపు ప్రచారంతో భక్తులను అయోమయానికి గురిచేశారని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. క్లీన్ చిట్ లభించిందని వైసీపీ నేతలు వాదిస్తుంటే, కల్తీ జరిగిందని సిట్ స్పష్టంగా చెప్పిందని టీడీపీ సహా కూటమి నేతలు కౌంటర్ ఇస్తున్నారు. ఈ పరస్పర ఆరోపణల నేపథ్యంలో, అసలు దోషులు ఎవరో తేల్చి కఠిన శిక్ష వేయాలని భక్తులు కోరుకుంటున్నారు.

# హింసను ప్రేరేపించేందుకు వైఎస్సార్‌సీపీ కుట్ర

మొదటిపేజీ తరువాయి

వ్యాఖ్యలు చేస్తూ, వారు చేసిన పాపాల నుంచి పక్కదారి పట్టించాలని చూస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ట్రాప్‌లో మనవాళ్లు పడకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. కార్యకర్తలు సంయమనం పాటించేలా సీనియర్ మంత్రులు, నేతలు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. రాష్ట్రానికి ఎక్కువగా పెట్టుబడులను సాధించి అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని సీఎం చంద్రబాబు మంత్రులకు తేల్చి చెప్పారు. దీనిని చెడగొట్టేందుకు వైఎస్సార్‌సీపీ శతవిధాలా యత్నిస్తోందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. తప్పు చేసిన ప్రతీ ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వైఎస్సార్‌సీపీ ట్రాప్‌లో పడొద్దని హితవు పలికారు. పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్ కు స్పష్టం చేయాలని నేతలను ఆదేశించారు. హింస, విధ్వంసం, అవినీతి పునాదులతో పుట్టిన వైఎస్సార్‌సీపీ ట్రాప్‌లో పడితే వారికీ మనకూ తేడా ఉండదని సీఎం చంద్రబాబు వివరించారు. పార్టీ సీనియర్ నేతలు రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్ తదితరులతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. మన పార్టీ సిద్ధాంతాలు ప్రజల మేలు కోసమే అనేది క్యాడర్‌కు స్పష్టం చేయాలని ఆదేశించారు.

### చేసిన పాపాలు కప్పిపుచ్చుకునేందుకే

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ అడ్డంగా దొరికిపోయిందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆ పార్టీని చీదరించుకుంటున్నారని తెలియజేశారు. చేసిన పాపాలను దారి మళ్లించాలనేది వైఎస్సార్‌సీపీ కుట్ర అని, పెట్టుబడులు సాధించి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే మన ప్రధాన అజెండా అని గుర్తు చేశారు. కానీ అది వైఎస్సార్‌సీపీ నేతలకు నచ్చడం లేదని, అందుకే అడ్డుకునేందుకు నానావిధాలా కుట్రలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు చేసిన ప్రతి ఒక్కరినీ చట్టపరంగా శిక్షించి తీరుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

### అదే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకే వైఎస్సార్‌సీపీ నేతలంతా బూతు పురాణం ఎత్తుకున్నారని కార్యకర్తల టెలికాన్ఫరెన్స్‌లో నేతలు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు స్పష్టం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైఎస్సార్‌సీపీ అడ్డంగా బుక్ అయిందని ఆక్షేపించారు. రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్‌సీపీని చీదరించుకుంటున్నారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. లడ్డూ కల్తీ వ్యవహారాన్ని డైవర్ట్ చేయడానికే వైఎస్సార్‌సీపీ నేతలు బూతులు మాట్లాడుతున్నారన్న నేతలు, వైఎస్సార్‌సీపీ ట్రాప్‌లో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పడకూడదని సూచించారు. గత 20 నెలలుగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతోందని వివరించారు. అన్ని వర్గాల వారు కూటమి పాలనపై సంతోషంగా ఉన్నారని మంత్రులు తెలిపారు. పెట్టుబడుదారులు పెద్ద ఎత్తున రాష్ట్రానికి వస్తున్నారని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ నేతలు ఇక చేసేదేమీ లేక బూతులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కార్యకర్తలను కావాలనే రెచ్చగొట్టి లా అండ్ ఆర్డర్ సమస్య సృష్టించాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అలజడులు చూసి ఏపీకి ఎవరూ రాకుండా చేయాలన్నది వైఎస్సార్‌సీపీ నేతల కుట్రని నేతలు దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ కవ్వింపు చర్యల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పల్లా శ్రీనివాసరావు, అచ్చెన్నాయుడులు సూచించారు.

# వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

మొదటిపేజీ తరువాయి

**అమరావతి :** జనసేన కార్యవర్గ సమావేశంలో పార్టీ నేతలపై అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఇంత జరుగుతున్నా చాలామంది మాట్లాడటంలేదని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారాన్ని ఎందుకు తిప్పి కొట్టడం లేదని నేతలను ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతల ట్రాప్‌లో పడొద్దని నేతలను పవన్ హెచ్చరించారు. మహిళల విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలని, ఆడపిల్లలకు తమ చేయి తగిలినా రేప్ చేశారని ప్రచారం చేస్తారన్నారు. అన్నింటికీ తానే మాట్లాడితే ఇక ఎమ్మెల్యేలు, మంత్రులు, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఎందుకని – మిగతా3లోప్రశ్నించారు. నేతలను వారి కుటుంబ సభ్యులను ఇష్టం వచ్చినట్టు మాట్లాడతారని జాగ్రత్తగా ఉండాలని పవన్ కల్యాణ్ హెచ్చరించారు. సిద్ధాంత, సబ్జెక్ట్ పరంగా మాట్లాడాలని సూచించారు. త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేస్తామన్న పవన్ జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీలో మార్పులు చేస్తామన్నారు. వ్యక్తిగత వ్యవహారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, తమ వల్ల పార్టీకి నష్టం కలుగుతుందని పవన్ అన్నారు. శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలన్న అధినేత భౌతిక దాడులు జనసేన విధానం కాదన్నారు. విమర్శలకు విషయంతోనే సమాధానం చెబుదామన్న పవన్ మంగళగిరిలోని జఖ కన్వెన్షన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశాన్ని కొనసాగించాలనిౄాజ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌కు చెప్పి అక్కడినుంచి వెళ్లిపోయారు.

“వైఎస్సార్‌సీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎందుకు తిప్పికొట్టడం లేదు. మహిళల విషయంలో పార్టీ శ్రేణులు జాగ్రత్తగా ఉండాలి. మహిళలకు మీ చేయి తగిలినా రేప్ చేశారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తారు. వైఎస్సార్‌సీపీ నేతల ట్రాప్‌లో చిక్కుకోవద్దు. అన్నింటికీ నేనే మాట్లాడితే ఎమ్మెల్యేలు, మంత్రులు ఉన్నది ఎందుకు? జనసేన నేతలు మాత్రం సిద్ధాంతపరంగా, సబ్జెక్ట్ పరంగా మాట్లాడాలి. త్వరలో 32 మందితో క్రమశిక్షణ కమిటీ ఏర్పాటు చేస్తాం.“

### వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీని ప్రజలకు వివరించి వైఎస్సార్‌సీపీ తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని జనసేన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానించినట్లు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. చుక్క పాలు లేకుండా నెయ్యి సరఫరా చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన వైఎస్సార్‌సీపీ నేతలు సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. దీనిపై జనసేన నేతలు బాధ్యత తీసుకుని ఖండించాలన్నారు. జనసేనౄాజని పునర్ వ్యవస్థీకరించటం, 32 మందితో క్రమశిక్షణా కమిటి, సభ్యత్వ నమోదు కోసం ప్రత్యేక కమిటిని ఏర్పాటు చేయాలని సమావేశంలో తీర్మానించామన్నారు. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తూ మరో తీర్మానం చేసినట్లు మనోహర్ చెప్పారు. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ విషయం సమావేశంలో చర్చకు వచ్చిందని త్రిసభ్య కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. వ్యక్తిగత విషయాలతో పార్టీకి చెడ్డపేరు తెచ్చేలా ఎవరూ ప్రవర్తించవద్దని పవన్ గట్టిగా ఆదేశించినట్లు మనోహర్ చెప్పారు. ఓటు రాజకీయాల కోసం ప్రజల్లో చీలిక తెచ్చేందుకు వైఎస్సార్‌సీపీ ప్రయత్నిస్తోందని, ఆ ఉచ్చులో పడొద్దని జనసేన నేతలకు స్పష్టం చేశారు.

# ఫిబ్రవరిలో గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన

**విశాఖపట్టణం :** విశాఖలో ప్రతిష్టాత్మక ప్రాజెక్టు శంకుస్థాపనకు ముహూర్తం ఫిక్స్ అయింది. భీమిలి నియోజకవర్గం పరిధిలోని ఆనందపురం మండలం తర్లు వాడలో 308 ఎకరాల భూమిని సిద్ధం చేసి త్వరలో గూగుల్ సంస్థకు అప్పగించనున్నారు. దాదాపు రైతుల భూములకు పరిహారం చెల్లింపులు పూర్తయ్యాయి. సింహాచలం భూముల కేటాయింపునకు సంబంధించిన ఫైలు రాష్ట్ర ప్రభుత్వానికి చేరింది. ఆసియాలోనే అతిపెద్ద గూగుల్ డేటా సెంటర్ విశాఖలో ఏర్పాటు కానుంది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వంతో ఇదివరకే ఒప్పందం చేసుకుంది. అయితే తాజాగా ఆ సంస్థ శంకుస్థాపనకు సంబంధించి కీలక అప్డేట్ వచ్చింది. ఫిబ్రవరిలోనే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి శంకుస్థాపన ఉంటుందని విశాఖ జిల్లా కలెక్టర్ స్వయంగా ప్రకటించారు. ఈ మేరకు సంబంధిత సంస్థ సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు.

# రాయపోల్ మండలంలో పదో తరగతి ప్రతిభకు భారీ ప్రోత్సాహకం

- స్టేట్ టాపర్‌కు రూ.5 లక్షలు... జిల్లా టాపర్ కు రూ.2 లక్షలు.
- మండల టాపర్ కు రూ.10 వేలు... విద్యార్థులకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ భరోసా.



**రాయపోల్, ఫిబ్రవరి 2:**రాయపోల్ మండల పరిధిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ మాసాన్‌పల్లి రాజు పేర్కొన్నారు. సోమవారం రాయపోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యే జీవితానికి బలమైన పునాదని,పేద--ధనిక తేడా లేకుండా విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చన్నారు.ప్రతిభను గుర్తించి ఇలాంటి భారీ ప్రోత్సాహకాలు అందించడం వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు.రాయపోల్ మండలం నుంచి రాష్ట్ర,జిల్లా,మండల స్థాయిలో టాపర్లు కావాలని ఆకాంక్షించారు. స్టేట్ టాపర్‌కు రూ.5 లక్షలు,సెకండ్ బహుమతిగా రూ.3 లక్షలు, జిల్లా టాపర్‌కు రూ.2 లక్షలు, నియోజకవర్గ టాపర్‌కు రూ.1 లక్ష,మండల టాపర్‌కు రూ.10 వేల నగదు బహుమతి అందజేస్తామని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు వెల్లడించారు.విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిరంతర కృషితో చదువులో ముందుకు సాగాలని,ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ హన్మంతు రాజు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు జి. కుమార్,మహేష్, శ్రీనివాస్,ఇన్చార్జి హెచ్ఎం నర్సింగా రావు,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కంపెనీలతో ఎంఓయూలు.. తెలంగాణ యువతను వంచన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- కప్పాటి పాండురంగా రెడ్డి




**హైదరాబాద్, ఫిబ్రవరి 02(సమయం న్యూస్) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నకిలీ కంపెనీలతో బూటకపు ఒప్పందాలు కుదుర్చుకుంటూ, లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయంటూ తెలంగాణ ప్రజలను, ముఖ్యంగా యువతను పక్కదోవ పట్టిస్తోందని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి ఆరోపించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటిస్తున్న పెట్టుబడులన్నీ కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. ఉనికిలోనే లేని కంపెనీలు, లేదా నకిలీ కంపెనీలతో ఎంఓయూలు చేసుకుంటూ, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు.నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు వాస్తవ దూరమైన ప్రకటనలతో మరోసారి యువతను మోసం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఈ దొంగ ఒప్పందాల వెనుక ఉన్న అసలు వాస్తవాలను బయటపెట్టాలని, ప్రజలకు నిజాయితీగా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు."ఉదాహరణకు, గతంలో అమెరికా పర్యటనలో 'స్వచ్ బయో' వంటి కంపెనీలతో రూ. 1000 కోట్ల ఒప్పందం అని గొప్పలు చెప్పారు. తీరా చూస్తే అది ఎంఓయూకి కేవలం రెండు వారాల ముందే పుట్టిన కంపెనీ అని తేలింది. ఇలా ఉనికిలో లేని కంపెనీలు, అడ్రస్ లేని సంస్థలతో ఫోటోలకు ఫోజులివ్వడం తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం సాధించిందేమీ లేదు." ప్రభుత్వం ఇప్పటికైనా కల్లబొల్లి మాటలు కట్టిపెట్టి, చిత్తశుద్ధితో కూడిన పాలన అందించాలని ఆయన హితవు పలికారు.

# ఇందూరు మాజీ ఎంపీటీసీ పటేల్ ప్రవీణ్ అంతక్రియలు

- పాల్గొన్న తాండూరు-మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**పెద్దముల్ మండలం, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పెద్దెముల్ మండలం ఇందూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పటేల్ ప్రవీణ్ అంత్యక్రియల్లో పాల్గొని,భౌతిక కాయాన్ని సందర్శించి పైలెట్ రోహిత్ రెడ్డి, సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ తాండూరు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ పంజుగుల శ్రీశైల్ రెడ్డి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ప్రవీణ్ పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టకాలంలో పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

# మల్లెమడుగు విద్యార్థినిలకు గోల్డ్ మెడల్



**ఖమ్మం , ఫిబ్రవరి 2: ( సమయం న్యూస్ ) :** ఇటీవలసర్దార్ పటేల్ స్టేడియం ఖమ్మంలో జరిగిన సిఎం కప్ క్రీడల్లో ఫుట్బాల్ బాలికల విభాగం నుండి ఖమ్మం రూరల్ మండలానికి చెందిన జెడ్పీ ఉన్నత పాఠశాల ( మల్లెమడుగు ) విద్యార్థినిలు గోల్డ్ మెడల్ సాధించారు . ఖో-ఖో బాలికల విభాగం నుండి సిల్వర్ మెడల్ సాధించారు . ఈ మేరకు ఆ పాటశాల ప్రధానోపాధ్యాయులు కె.సాంబమూర్తి,పిడి బియ్యని కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలియజేశారు. గోల్డ్ మెడల్ సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థినిలను ప్రధాన ఉపాధ్యాయులు ,ఉపాధ్యాయులు ,అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు అలివేణి ,59 , 60 డివిజన్ కార్పొరేటర్స్ లలితా రాణి , నిరంజన్ కుమార్ ,గ్రామ పెద్దలు కృష్ణమూర్తి, బోజర్ల సూర్యం, కృష్ణ, జానీ మియా, వెంకయ్య, వైకుంఠ చారి, తాటికొండ శ్రీనివాస్, తిరుపతిరావు, సైదులు, బట్టబోతుల సతీష్ తదితరులు అభినందించారు

# బిఆర్ఎస్ సిపిఎం మధ్యపొత్తు

- కాంగ్రెస్ తో సిపిఐ కి కుదరని స్నేహం
- బీజేపీ జనసేన లది తలో దారి
- పోటీకి దూరంగా టీ డీ పీ
- స్వతంత్రుల భారీ నామినేషన్లు
- ఉపసంహరణలపై అందరి దృష్టి

(ఎండీ షఫీ యు జమ )

**ఖమ్మం , ఫిబ్రవరి 2 : ( సమయం న్యూస్ ) :** ప్రస్తుత పురపాలక ఎన్నికలలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలోఅన్ని పార్టీ లు పోటీని ప్రతిష్టాత్మకంగా తీసుకొని , బరిలో దిగేందుకు సన్నాహాలు పూర్తి చేసుకున్నాయి. ఈ సన్నాహాలలో భాగంగా చర్చలు, పొత్తులకు శ్రీకారం చుట్టాయి. ఈ చర్చలు పొత్తుల సందర్భంగా ఆ పార్టీలు తమదైన శైలిలో ఎత్తుగడలనుఅవలంబించాయి. ఇందులో కొన్ని పార్టీలు సక్సెస్ కాగా కొన్ని పార్టీలు విఫలం చెందాయి. ప్రధాన ప్రతిపక్షం బీ ఆర్ ఎస్ తో సిపిఎం మధ్య పొత్తు ఫలించగాఅధికార పార్టీ కాంగ్రెస్ తో సిపిఐ మధ్య కుదరని స్నేహం.... ఆయా పార్టీల అవసరాలు , ఎత్తుగడల తీరు తెన్నుల ను స్పష్టం చేస్తుంది. ఇదిలా ఉండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న, జనసేన, టిడిపి ల మధ్య ఎలాంటి చర్చలు జరగలేదు , పొత్తులు పెట్టుకోవడం సాగలేదు.. దాంతో బిజెపి జనసేన పార్టీలు ఒంటరి పోరాటానికి దిగాయి. ఇదే సమయంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులకు ఎలాంటి సంకేతాలు అందకపోవటంతో , బి ఫామ్ లు లభించని పరిస్థితులలోపోటీకి దూరంగా నిలిచారు. గత పంచాయితీ ఎన్నికలలో అతి తక్కువ సీట్లలో పోటీ చేసిన భారతీయ జనతా పార్టీ ఈ పురపాలక ఎన్నికలలో భారీ సంఖ్యలో నామినేషన్లను దాఖలు చేసింది. విశ్వగురు మీద నమ్మకం పెట్టుకుంది. మంచి ఫలితాలు వస్తాయనిఆశలు పెట్టుకుంది. కాగా జనసేన ఈఎన్నికలలో బోణీ చేయడమే కాకుండా ఆశ్చర్యకర ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తోంది. ఇదిలా ఉండగా ఖమ్మం జిల్లాలో ఎదులాపురం ,వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి మున్సిపాలిటీలు ఉండగా , భద్రాద్రి బికొత్తగూడెం జిల్లాలో అశ్వరావుపేట, ఇల్లందు , కొత్తగూడెం మున్సిపాలిటీలు ఉన్నాయి. కా గా ఖమ్మం జిల్లాలోని ఎదులాపురం మున్సిపాలిటీ కొత్తగా ఆవిర్భవించింది. తొలి సారి ఇక్కడ ఎన్నికలు జరుగుతున్నాయి ఈ ఎదులాపురం మున్సిపాలిటీ , మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం పాలేరు పరిధిలో వస్తుంది. ఇక్కడ విజయం సాధించి , కాంగ్రెస్ ఖాతాలో ఎదులాపురం మున్సిపాలిటీని చేర్చాలని పొంగులేటి మొదటి నుండి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ మున్సిపాలిటీ లో అత్యధిక స్థానాలను సిపిఐ కోరడంతో పొత్తు కుదరలేదు అని వినికిడి. ఇదే విధమైన వైఖరి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లో సిపిఐ ప్రదర్శించిన క్రమంలో అక్కడ కూడా ఇద్దరి మధ్య స్నేహం ఫలించలేదు. అక్కడ ఇక్కడ కూడా ఒంటరిగానే సిపిఐ పోటీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బి ఆర్ ఎస్ తో సిపిఎం పొత్తు మంచి సామరస్య వాతావరణం లో ముందస్తుగానే జరిగిపోయింది. సిపిఎం బిఆర్ఎస్ మధ్య పొత్తు కేవలం ఖమ్మం జిల్లాలోని మున్సిపాలిటీలలో మాత్రమే పరిమితమైనట్లు , భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో ఇరు పార్టీలు విడివిడిగనే పోటీ చేస్తున్నట్లు ఆయా వర్గాల సమాచారం. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ అత్యధిక స్థానాలలో ఒంటరిగానే పోటీ చేసే సూచనలు ఉన్నాయి. ఈనెల మూడవ తేదీన నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులకు ఉపసంహరణ తుది గడువు ఉండటంతో పొత్తు పొడిచే అవకాశాలపై సిపిఐ ఆశాజనకంగా ఉంది. ఈ పరిణామాలపై సిపిఎం తెలివైన ఎత్తుగడను అవలంబించగా సిపిఐ అవివేకమైన ఎత్తుగడను తీసుకుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. తన బలం , తన ఉనికి , తన పరిస్థితుల నేపథ్యంలో సిపిఎం అందుకు అనుగుణమైన తీరును ప్రదర్శించగా తన బలం తన ఉనికి తన పరిస్థితులను అతిగా ఊహించుకొని సిపిఐ అత్యాశతో అత్యధిక స్థానాలను కోరుకొని పొత్తును విచ్చినం చేసుకుందని పరిశీలకులు పేర్కొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ దీటుగా తమ పార్టీ చవితి ఎన్నికలలో మంచి ఫలితాలను రాబట్టిందని కాబట్టి ఈసారి కూడా ఇంక మంచి ఫలితాలను సాధించగలనని నీ మాతో బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అన్ని జిల్లాలలో అత్యధిక స్థానాలు సాధించి , నెంబర్ వన్ స్థాయిలో నిలిచింది. ఈసారి కూడా అవే పలితాలు పునరావృతమవుతాయని విశ్వసిస్తోంది. కాగా , ఈనెల 11 వ తేదీన ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పుర పాలక సంస్థ లకు పోలింగ్, 13 న జరిగే కౌంటింగ్ పార్టీల

# ఖురాన్ ప్రాముఖ్యత -రంజాన్ విశిష్టత

- అల్ హుదా నుండి ఆయత్ ప్రస్థానం
- లౌకిక అలౌకిక విద్య బోధనలు- సామాజిక సేవలు
- మహిళ సాధికారతకు ప్రతిక : డాక్టర్ ఆయేషా సుల్తానా




**ఖమ్మం, ఫిబ్రవరి :2 ( సమయం న్యూస్ )** ఖురాన్ మానవ జీవితానికి పరమ మార్గదర్శకం. అది కేవలం ఒక గ్రంథం మాత్రమే కాదు; హృదయాలను ప్రకాశింపజేసే దివ్య వెలుగు. అజ్ఞాన అంధకారంలో ఉన్న మానవునికి సత్య మార్గాన్ని చూపించే శాశ్వత సందేశం ఖురాన్. మన ఆలోచనలు, ప్రవర్తన, జీవన లక్ష్యాన్ని శుద్ధి చేసి, మనిషిని మనిషిగా నిలబెట్టే శక్తి ఖురాన్‌కే ఉంది.రంజాన్ -- ఖురాన్ అవతరించిన పవిత్ర మాసంరంజాన్ మాసం ఖురాన్‌తో విడదీయరాని సంబంధం కలిగిన మహిమాన్విత మాసం."రమజాన్ మాసంలోనే ఖురాన్ అవతరించబడింది" అనే వాక్యం ఈ మాసానికి ఉన్న విశిష్ట స్థితిని స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ మాసంలో ఖురాన్ చదవడం, వినడం, అధ్యయనం చేయడం, ఆచరించడం అపారమైన ప్రతిఫలాన్ని ఇస్తాయి. తరావీహ్ నమాజ్‌లో ఖురాన్ పారాయణం వినడం హృదయాలను కదిలించి, ఆత్మను శుద్ధి చేస్తుంది.ఖురాన్‌ను కేవలం చదవడమే కాకుండా, దాని భావాన్ని అర్థం చేసుకుని జీవనంలో అమలు చేయడమే అసలైన లక్ష్యం. అందుకే ఖురాన్ తర్జుమా, తఫ్సీర్, సులభమైన వివరణలు నేటి కాలంలో అత్యంత అవసరంగా మారాయి. కాగా... ఇదే... ఖురాన్ ప్రాముఖ్యత , రంజాన్ (మాసం) పర్వ దినోత్సవం విశిష్టత... గురించి స్పష్టం చేస్తూ , లౌకిక ఆ లౌకిక విద్య తో పాటు సామాజిక సేవలు అంద జేస్తున్నా.. డాక్టర్ ఆయేషా సుల్తానా,అల్ హుదా నుండి ఆయత్ స్థాపన ప్రస్తానం.ఖుర్‌ఆన్ బోధనలో అల్ హుదా నుండి ఆయత్ వరకు2014 సంవత్సరం నుండి "అల్ హుదా" పేరుతో మహిళలకు ధార్మిక విద్య, ఖురాన్ బోధనలు ఆఫ్‌లైన్ ద్వారా ప్రారంభమయ్యాయి. కరోనా కాలంలో ఈ బోధనలు ఆన్‌లైన్ రూపం దాల్చి మరింత విస్తరించాయి. ఆ సేవా ప్రయాణమే తరువాతఆయత్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్గారూపుదిద్దుకుంది.ఈ సంస్థ ద్వారా ఖుర్‌ఆన్ ఆధారిత ధార్మిక విద్యతో పాటు ఆంగ్ల భాష , వ్యక్తిత్వ వికాసం , జీవన నైపుణ్యాలు (స్కిల్స్) వంటి అంశాలు కూడా బోధించబడుతూ, మహిళలకు ఆత్మవిశ్వాసం, స్ఫూర్తి, జీవన దిశను అందిస్తున్నారు డా. ఆయేషా సుల్తానా..

**నిరంతర ఆన్‌లైన్ బోధనలు -- ఆయత్ అకాడమీ ప్రత్యేకత**

2022 సంవత్సరం నుండి ఇప్పటివరకు ప్రతిరోజూ ఉదయం 6 నుండి 7 గంటల వరకు, సాయంత్రం 7.30 నుండి 8.30 గంటల వరకు జూమ్ ద్వారా నిరంతరంగా ఖురాన్, హదీస్, ఫిఖ్ వంటి ధార్మిక బోధనలు ఉచితంగా అందించబడుతున్నాయి. ప్రతి క్లాస్‌కు సగటున 150 నుండి 200 మంది విద్యార్థులతో బ్యాచ్‌లు కొనసాగుతున్నాయి.గత నాలుగు సంవత్సరాలలో 40కు పైగా విభిన్న కోర్సులు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఆయత్ అకాడమీ ద్వారా ఇప్పటివరకు 3000కు పైగా మహిళలు విద్యార్థులుగా చేరి, ఒక బలమైనఆయత్ ఒక కుటుంబ వ్యవస్థగా రూపుదిద్దుకుంది. అంతేకాకుండా, ప్రతి నెలా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ సామాజిక బాధ్యతను కూడా ఆయత్ సంస్థ నిర్వర్తిస్తోంది.

**రచనలు -- పురస్కారాలు -- సేవా ప్రయాణం**

డా. ఆయేషా సుల్తానా అనేక ప్రముఖుల చేతుల మీదుగా పలు అవార్డులను అందుకున్నారు.ఆంగ్లం, తెలుగు భాషలలో అనేక రచనలు చేసి పాఠకుల మన్ననలు పొందారు.ఆరా మ్యాగజైన్ కు ఎడిటర్గా పనిచేసి, ప్రస్తుతం ఆ మ్యాగజైన్ ఎడిటోరియల్ బోర్డు సభ్యురాలిగా కొనసాగుతున్నారు.అలాగే రాడియన్స్ లో ఎడిటర్గా సేవలందించారు.ఆవేర్ ట్రస్ట్ సభ్యురాలిగా, జెఐహెచ్ మార్కజ్ లో క్రియాశీలకంగా పని చేస్తున్నారు.

ఆమె రచనల్లో ఒక ప్రత్యేకమైన గుర్తింపు - శైలి ఉన్నాయి.అక్సే ఫుర్ఖాన్' రోమన్ ట్రాన్స్‌లిటరేషన్.ఉర్దూ రాని, కానీ ఆంగ్లం లేదా తెలుగు తెలిసిన వారికి ఖురాన్ భావాన్ని సులభంగా అర్థం చేసుకునేలా ఇది ఎంతో ఉపయుక్తంగా, అవసరమైన సాధనగా మారింది.2017 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఆంగ్లం, తెలుగు భాషల్లో 5000కు పైగా పుస్తకాలు పాఠకులకు చేరడం ఆమె ప్రతిభకు తార్కాణం.

**తరావీహ్ ఖురాన్ సారం -- సులభమైన భాషలో**

ఈ పుస్తకానికి మరో విశిష్టత, అజీజియా మసీదు ఖతీబ్, సుపరిచిత ఇస్లామిక్ పండితుడు ఏజాజ్ ముహియుద్దీన్ వసీమ్ రచించిన తరావీహ్ నమాజ్‌లో ఖురాన్ సారం నిలుస్తుంది. ప్రతి రుకూ యొక్క భావాన్ని అత్యంత సరళమైన భాషలో, సామాన్యులకు కూడా సులభంగా అర్థమయ్యేలా వివరించారు.ప్రత్యేకించి రమజాన్ మాసంలో ఈ పుస్తకం ప్రతి కుటుంబానికి, ప్రతి పాఠకుడికి ఆధ్యాత్మిక మార్గదర్శకంగా ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుంది.

**ఆయత్ పబ్లికేషన్స్ -- జ్ఞాన ప్రసారానికి వేదిక**

ఈ విలువైన గ్రంథం ఆయత్ పబ్లికేషన్స్ ద్వారా తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఖురాన్‌ను అర్థం చేసుకుని జీవించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఇది ఒక అమూల్యమైన కానుక.ఖురాన్‌తో బంధం బలపడితే జీవితం మారుతుంది.రంజాన్‌లో ఆ బంధం మరింత గాఢమవుతుంది.ఆ బంధాన్ని మహిళల హృదయాలకు, సమాజానికి చేరవేయడమే ఆయత్ ప్రయాణం. ఇదే డాక్టర్ అయేషా సుల్తానా ప్రస్తుత జీవన ప్రస్థానం.

# ప్రజా దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు వెంటనే చేపట్టాలి

: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, ఫిబ్రవరి 2 ( సమయం న్యూస్ ) : :** ప్రజల దరఖాస్తులను అధికారులు ప్రాధాన్యత నిచ్చి వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని, ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ సందర్భంగా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామం నుండి డి. సుజాత ఉపాధి కొరకు స్వీపర్ పోస్ట్ ఇప్పించగలందులకు దరఖాస్తు చేయగా, జిల్లా ఉపాధికల్పన అధికారిని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామం నుండి గ్రామస్థులు, గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆక్రమణ కాకుండా చర్యలకు దరఖాస్తు సమర్పించగా, సత్తుపల్లి తహసీల్దార్ నకు విచారణ చేసి, చర్యలు చేపట్టాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు.స్థానిక పంపింగ్ వెల్ రోడ్ నుండి పిడకల రాంబాయి, తనకు ఇల్లు లేదని, డబల్ బెడ్ రూం ఇల్లు కేటాయించుటకు దరఖాస్తు సమర్పించగా, హౌజింగ్ పిడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.వైరా పట్టణం నుండి ఎస్కె. గాలిబి, తనకు స్థలం ఉందని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కు దరఖాస్తు సమర్పించగా, హౌజింగ్ పిడి ని తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు .తిరుమలాయపాలెం మండలం సుబ్లేడ్ గ్రామం నుండి పి. వెంకటమ్మ, తన భర్త ఎల్లయ్య జూన్, 2023 లో మరణించారని, తనకు ప్రభుత్వం నుండి వితంతు పెన్షన్ మంజూరుకు దరఖాస్తు సమర్పించగా, డిఆర్డీవో కు తగుచర్యకై కలెక్టర్ ఆదేశించారు.అనంతరం వివిధ శాఖల్లో పనిచేసి 31 జనవరి న పదవీ విరమణ చెందిన 7 గురు అధికారులు, సిబ్బందిని కలెక్టర్ సన్మానించి, వారి సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ తెలంగాణ

## సంఘ్‌ని అర్థం చేసుకోవాలంటే సంఘ్ నుంచే అనుభవం రావాలి

### డాక్టర్ మోహన్ భాగవత్

**హైదరాబాద్ ఫిబ్రవరి2( సమయం న్యూస్). :** రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)ని అర్థం చేసుకోవాలంటే ఆ అనుభవాన్ని సంఘ్‌లో భాగం కావడం ద్వారానే పొందాలని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ అన్నారు.

వందేళ్ళు పూర్తయిన సందర్భంగా ఏ సంస్థ అయినా ఉత్సవాలు చేసుకుంటుందని, కానీ స్వయంసేవకులు అలా ఆలోచించక, వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం అనే సంఘ కార్యాన్ని మరింత విస్తరించాలని నిర్ణయించుకుని పలు కార్యక్రమాల యోజన చేశారని తెలిపారు. సంఘ కార్య శతాబ్ది సందర్భంగా ఫిబ్రవరి 1వ తేదీన హైదరాబాదులో “100 ఏళ్ళ సంఘ్ యాత్ర – కొత్త ఆశయాలు” (100 years of Sangha Journey - New Horizons) ఎరిట ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు 1000 మంది వరకూ పాల్గొన్న వివిధ రంగాల మేధావులను ఉద్దేశించి డాక్టర్ మోహన్ భాగవత్ ప్రసంగించారు. ఒతకు ముందు హైదరాబాదులో సీనియర్ బ్యూరోక్రాట్స్, సినీరంగ ప్రముఖులతో సమావేశమై ఆర్ఎస్ఎస్ వందేళ్ళ ప్రస్తానం, లక్ష్యం, ఆశయాలు వంటి పలు అంశాలను తెలియజేశారు. గత పది, ఇరవై ఏళ్లలో సంఘ కార్యం ఎంతో విస్తరించిందని తెలియజేస్తూ సంఘ్‌ను అర్థం చేసుకోవడం చాలా కష్టమని, సంఘ్ లాంటి పని సమాజంలో మరొకటి లేదని ఒకవేళ పైపైన అర్థం చేసుకుంటే తప్పుగా కూడ అర్థం కావొచ్చని అప్రమత్తం చేశారు. అందుకే, సంఘ్‌లో భాగం కావడం ద్వారానే సంఘ కార్యాన్ని అర్థం చేసుకుని అనుభవాన్ని పొందాలని అన్నారు. “సంఘ్ మొదటి సిద్ధాంతం ఉత్తమ దేశ నిర్మాణం లక్ష్యంగా వ్యక్తి నిర్మాణం చేయడం. ఇదే ముఖ్యమైన పని దీని మీదే ధ్యాస సంఘ్ ఉంచుతుంది.

ఏ వ్యక్తినైతే నిర్మాణం చేస్తామో, ఆ వ్యక్తి అలాగే ఉండాలి కూడా. ఈ కార్యం ఎక్కువ సమయం తీసుకునేది, అలాగే కేంద్రీకృతంగా జరిగే పని. అందుకే వ్యక్తి నిర్మాణం అన్న ఒకే ఒక విషయంపై కేంద్రీకృతమై, సంఘ్ పనిచేస్తోంది.

ఈ పని తప్ప, మరో పని చేయాల్సిన అవసరం సంఘ్‌కి లేదు” అని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు దేశవ్యాప్తంగా ఒక లక్షా ముప్పై వేలకు పైగా చిన్నా పెద్ద సేవా కేంద్రాలను నిర్వహిస్తున్నారని, సమాజం నుంచి కూడా సహాయాన్ని తీసుకోగా మిగిలిన కార్యం కోసం అవసరమైనవి వారే భరిస్తూ పని కూడా పూర్తి చేస్తారని సంఘ కార్యశైలిపై అవగాహన కల్పించారు. “సంఘ్ సేవా సంస్థ కాదు. సంఘ్ స్వయంసేవకులు పథ సంచలన్ చేస్తారు. అచ్చు మిలటరీ తరహాలోనే క్రమశిక్షణగా చేస్తారు. కానీ సంఘ్ పారా మిలటరీ ఆర్గనైజేషన్ కాదు. నిత్య శాఖలో లాఠీ శిక్షణలాంటివి ఇస్తారు. కానీఇదేమీ శారీరిక్ అఖాడా కాదు.

అలాగే సాంఘీక్ గీత్, వ్యక్తిగత గీత్ తో పాటు బ్యాండ్ కూడా ఉంటుంది. కానీ సంఘ్ సంగీత సంస్థ కాదు. పైపై మాటలను చూసి, సంఘ్‌ను అర్థం చేసుకుంటే తప్పుగా అర్థమవుతుంది” అని సంఘ కార్యాచరణను మోహన్ భాగవత్ పరిచయం చేశారు. సంఘ్ స్వయంసేవకులు చాలా పనులు చేస్తున్నారని తెలియజేస్తూ, కళారంగం మొదలు రాజకీయ క్షేత్రం వరకూ అన్ని రంగాల్లోనూ స్వయంసేవకులు ఉన్నారని, కొందరు స్వయంసేవకులు స్వయంగా ఆ రంగాలను నడుపుతుంటే, మరికొందరు ఎప్పటి నుంచో ఉన్న రంగాల్లో భాగస్వాములై నేడు అగ్రభాగంలో ఉన్నారని ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ వెల్లడించారు. వీరిని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంఘ్ నియంత్రించదని, పూర్తి స్వయంప్రతిపత్తితో వారు పనిచేస్తుంటారని వివరించారు. సంఘ్ భావజాలంతో, సంఘ్ ఇచ్చిన సంస్కారాల ఆధారంగా ఆ పనులన్నీ చేసేది స్వయంసేవకులే అయినప్పటికీ ఈ పనులన్నింటినీ చూడటం ద్వారా ఎవరూ సంఘ్‌ని అర్థం చేసుకోలేరన్నారు. స్నేహం, ప్రేమ ఆధారంగానే సంఘ కార్యం నడుస్తుందని, ఇచ్ఛాపూర్వకంగా, వివేకంతో స్వయంసేవకులు పనులు చేస్తారని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి చేయడం అనేది ప్రజల కోసం పనిచేసే కొన్నిసంస్థలు లేదా కొందరి పనే మాత్రమే అని అనుకుంటారని, అయితే ఈ స్వభావాన్ని మార్చి, మనల్ని మనమే ఉద్ధరించుకోవాలి అని ఉద్బోధించడమే సంఘ్ పని అని ఆర్ఎస్ఎస్ దృష్టికోణాన్ని డాక్టర్ మోహన్ భాగవత్ వివరించారు. పార్టీలు, ప్రభుత్వాలు, నేతలు, మహాపురుషులు పోషించేది సహాయక పాత్ర మాత్రమేనని, సమాజమే యజమాని అని తేల్చి చెప్పారు. సమాజంలో ఏకత, గుణాత్మకత వచ్చేవరకూ దేశ భవితవ్యం మారదని, మారకుంటే మనం ప్రమాదంలో పడినట్లేనని అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యక్తి నుంచి వ్యవస్థ వరకూ దేశ సమగ్ర ఉన్నతి లక్ష్యంగా సంఘ్ ఆశిస్తున్న పంచ పరివర్తన్ గురించి వివరించారు. ఇందులో భాగాలైన 1.కుటుంబ ప్రబోధన్ (భజన్, భోజన్, భాష, భూష, భవన్, భ్రమణ్) 2.పర్యావరణ పరిరక్షణ 3.సామాజిక సమరసత 4.స్వదేశీ 5. పౌరవిధుల గురించి పరిచయం చేశారు. నేడు హిందూ సమాజంలో తాము హిందువులమని గర్వించేవారు, హిందువులమని వ్యక్తిగతంగా మాత్రమే అంగీకరించేవారు, హిందువుగా జీవిస్తున్నప్పటికీ బయటకు వ్యక్తం చేయనివారు, అసలు హిందువులమన్న మూలాలనే మరచినవారు ఇలా భిన్న వర్గాలున్నాయని డాక్టర్ మోహన్ భాగవత్ తెలియజేశారు. అందరమూ ఒకే సంస్కృతికి చెందినవారం కాగా, అందరిలోనూ ఉమ్మడిగా ఈ చైతన్యం మేల్కొనేలా చేయడం నేడు సమాజం ముందున్న బాధ్యత అన్నారు. సంఘ కార్యం గురించి వివరించిన ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ మోహన్ భాగవత్ సభికుల ప్రశ్నలకు బదులిచ్చారు. ఆర్ఎస్ఎస్ గురించి, ఆర్ఎస్ఎస్ ప్రేరిత సంస్థలు, సంఘ్‌లో మహిళల పాత్ర, హిందుత్వం, మతం, ధర్మం, సంస్కృతి, అంతర్గత సమస్యలు, కులవ్యవస్థ, సామాజిక సమరసత, యువతరం పాత్ర, స్వదేశీ, విద్య, కుటుంబం, దేశ భద్రత, జనాభా మార్పులు, భారత్‌తో ముడిపడిన అంతర్జాతీయ అంశాలు, దేశ నిర్మాణం, సమాజ సంబంధంగా పలువురు అడిగిన ప్రశ్నలకు డాక్టర్ మోహన్ భాగవత్ జవాబులిచ్చారు. సంఘ్ కార్యంలో భాగస్వాములు కావడమెలా అన్న ప్రశ్నకు బదులిస్తూ సమీపంలోని సంఘ శాఖ లేదా సంఘ ప్రేరిత సంస్థల ద్వారా నేరుగా ఆ పని చేయవచ్చని, అయితే సంఘ్ చేసే పనిని వ్యక్తిగతంగా చేస్తున్నవారు కూడా అంతే గౌరవనీయులంటూ తనను సంఘ్ ప్రేరితునిగా పేర్కొన్న భూదానోద్యమ మూలపురుషులు వినోభా భావేని డాక్టర్ మోహన్ భాగవత్ ప్రస్తావించారు. భారత్ – అంతర్జాతీయ సంబంధాల గురించి అడిగిన ఒక ప్రశ్నకు డాక్టర్ మోహన్ భాగవత్ స్పందిస్తూ ఏ దేశమైనా తమ జాతీయ ప్రయోజనాల మేరకే అంతర్జాతీయ వ్యవహారాలను నిర్వహిస్తుంటుందని, భారత్ కూడా ఈ విషయంలో రాజీలేని ధోరణినే అవలంబించాలని అన్నారు. అంతర్జాతీయ పరిణామాలతో వ్యవహరించాలంటే ఏ దేశమైనా ఆర్థికంగా, సామాజికంగా శక్తిమంతమై ఉండాలన్నారు. ప్రపంచంలో ఎంత అలజడి ఉన్నప్పటికీ మన దేశంలో సామాజిక బాధ్యతతో కూడిన బలమైన కుటుంబ వ్యవస్థ కారణంగా వాటి ప్రభావం మనపై అత్యల్పమన్నారు. అంతర్గత భద్రతా సవాల్ విసురుతూ భారత్‌లోకి జరుగుతున్న బంగ్లాదేశీయులు, రోహింగ్యా చొరబాట్ల గురించి అడిగిన ప్రశ్నకు అక్రమంగా వచ్చినవారిని గుర్తించడం, నిర్బంధించడం, తిప్పిపంపడం ప్రభుత్వ విధులే అయినప్పటికీ, పౌరులు సైతం బాధ్యతతో వ్యవహరించి ఇలాంటివాటిని అధికారులు, భద్రతా వ్యవస్థల దృష్టికి తీసుకెళ్ళాలని పిలుపునిచ్చారు. దేశాన్ని ఉన్నత స్థితికి తీసుకెళ్ళేందుకు సమాజ పరివర్తన జరగాలని, ఇందుకు అందరి సహాయ సహకారాలు కావాలని హైదరాబాద్ కార్యక్రమాల్లో భాగంగా డాక్టర్ మోహన్ భాగవత్ ని కలుసుకున్న వివిధ రంగాల ప్రముఖులు, మేధావులను ఆయన కోరారు. సమాజాన్ని ప్రభావితం చేయగల స్థాయిలో ఉన్న ప్రముఖులు, ఆదర్శ వ్యక్తులు స్వయంఉదాహరణగా నిలిచి తద్వారా సమాజంలో మార్పు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఇటువంటివారిని చూసి సమాజం మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- ఆర్థిక నేరాలపై సాంకేతికతను వినియోగించి త్వరిత గతిన ఛేదించాలి.
- నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి.
- ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలి, అమలు చేయాలి.
- సమస్యాత్మక గ్రామాల పై ప్రత్యేక దృష్టి సారించాలి.
- ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి.
- ఎన్నికల వేళ అక్రమ నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువులు సరఫరా జరగకుండా చూడాలి.



**నారాయణపేట, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో ఉన్న పెండింగ్ కేసులు, దర్యాప్తులో నాణ్యత, నేరాల నియంత్రణ అంశాల పై ఎస్పీ సమీక్షించారు. అలాగే ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని, రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాల పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ప్రతి కేసులో క్యాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండేలా దర్యాప్తు చేపట్టి నేరస్తులకు శిక్ష పడేటట్లు చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం అదేలా చూడాలని సూచించారు. కేసుల విచారణలో జాప్యం చేస్తే సహించేది లేదని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జనసామర్థ్యం గల ప్రదేశాలలో విజబుల్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని తెలిపారు. జిల్లా లో అక్రమ గంజాయి రవాణా, మట్కా ,జూదం వంటి అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని, పబ్లిక్ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దొంగతనాల కేసుల్లో ఆధునిక సాంకేతికతను వినియోగించి లాంగ్ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించి దొంగిలించిన సొత్తును బాధితులకు అందించాలన్నారు. మున్సిపల్ ఎన్నికలలో తీసుకోవలసిన భద్రతా చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సున్నితమైన గ్రామాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్ (చీదీఔం)ను వెంటనే అమలు చేయాలని, రౌడీ షీటర్స్, పాత నేరస్తులు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా ముందస్తుగా బైండోవర్ కేసులు నమోదు చేసి, వెపన్స్ డిపాజిట్ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు ఉండాలని, మహిళలు, వృద్ధులు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉంటూ నిరంతరం తనిఖీలు నిర్వహించి నగదు, మద్యం, ఇతర ప్రలోభకర వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని, కోడ్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని పోలీస్ విభాగాలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో శాంతి భద్రతలు కాపాడాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. జిల్లా మున్సిపాలిటీల పరిధిలో, మరికల్ కేంద్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ముందస్తు గత మూడు సంవత్సరాల నుండి ఎక్కువగా జరిగిన రోడ్డు ప్రమాదాల ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్ మరియు యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాస్ ను గుర్తించి అక్కడ రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలను రోడ్డు భద్రతా మీటింగులో చర్చించి సంబంధిత అధికారులతో కలిసి రోడ్డు ప్రమాదాల నివారకు సూచికలను ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐలు శివ శంకర్, రామ్ లాల్, సైదులు, భగవత్ రెడ్డి ఎస్సైలు వెంకటేశ్వర్లు, నరేష్, సునీత, రాజు, రాముడు, బాలరాజు, రాజశేఖర్, రాములు, భాగ్యలక్ష్మి రెడ్డి,ఎస్.ఎం నవీద్, అశోక్ బాబు, పురుషోత్తం, గాయత్రి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్డర్ ఒక దగ్గర... విధులు మరో దగ్గర

**హైదరాబాద్, ఫిబ్రవరి 2(సమయం న్యూస్) :** జిహెచ్ఎంసి లో కొద్ది మంది ఆపరేటర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. వీరికి కొంతమంది అవినీతి అధికారులు కూడా తోడు కావడంతో ఆడింది ఆట పాడిందే పాటగా తయారైంది. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ పై గత నెలలు పలు ఆరోపణలు రావడంతో వేరే సెక్షన్ కు బదిలీ చేయడం జరిగింది. ఈ లోపు కొత్తగా సర్కిళ్లను ఏర్పాటు చేయడంతో జనవరి 30వ తేదీన అతనికి తార్నాక డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహించే విధంగా ఆర్డర్ ఇవ్వడం జరిగింది. కానీ అక్కడ జాయిన్ కాకుండా మల్కాజ్గిరి జోనల్ కమిషనర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నరు. జోనల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సీనియర్ అధికారి ప్రోత్సాహంతోనే అతను అక్కడ పని చేస్తున్నట్టు తెలుస్తుంది. అధికారులు ఇచ్చిన ఆర్డర్ ను బేఖాతరు చేస్తూ తార్నాక సర్కిల్ కార్యాలయంలో జాయిన్ కాకుండా మల్కాజ్గిరి జోనల్ కార్యాలయంలో పనిచేయడం నిబంధనలకు విరుద్ధం. ఏ ఆర్డర్ లేకుండా ఎక్కడైనా పని చేయొచ్చా అధికారులు తేల్చాలి.

## ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడికి పరామర్శ



**రాయపోల్, ఫిబ్రవరి 2:** రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) మండల అధ్యక్షులు అయ్యగల్ల రవి తండ్రి పెంటయ్య నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ మండల నాయకులు సోమవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెంటయ్య మరణం వారి కుటుంబానికి తీరని లోటు అని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఈ కష్ట సమయంలో ఎమ్మార్పీఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుర్ర నర్సింలు, ఆంధ్రప్రభ జర్నలిస్ట్ శ్రీనివాస్ ఉషనగల్ల, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, భాను ప్రసాద్, అయ్యగల్ల రవి, స్వామి, సీఆర్పీ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 9వ వార్డులో ఇంటింటి ప్రచారం

- మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీపాలు నర్సింహులు





**తాండూర్ మున్సిపల్, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** తాండూరు మున్సిపల్ మాజీ వైస్ చైర్ పర్సన్ పట్లోళ్ల దీపా నర్సింలు దూకుడు పెంచారు. పట్టణంలోని 9వ వార్డు నుంచి దీపా నర్సింలు రెండోసారి పోటీ చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 9వ వార్డులో ప్రచారం చేపట్టారు. వార్డులో పర్యటించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తున్నారు. పెద్దలు, మహిళలు, వృద్ధులను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు.

## తల్లి--బిడ్డ కలిసి వైద్య శిబిరానికి ZPHS ఓద్యారం ఆదర్శ కార్యక్రమం

వైద్య శిబిరం -- ప్రేరణాత్మక నివేదిక



**గంగాధర ఫిబ్రవరి2( సమయ్దం న్యూస్). :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓద్యారంమండలం: గంగాధరపాఠశాల విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రుల ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఓద్యారం నందు వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిబిరంలో విద్యార్థులు మరియు తల్లిదండ్రులకు ూా పరీక్షలు నిర్వహించగా, అవసరమైన వారికి ల్యాబ్ పరీక్షలు కూడా చేపట్టారు. పోషకాహార లోపం ఉన్న విద్యార్థులను గుర్తించి తగిన వైద్య చికిత్స అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలికి దోహదపడేలా సమగ్ర డైట్ ప్లాన్ను వివరించారు. ప్రత్యేకంగా, అమ్మాయిలు తమ తల్లులతో కలిసి వైద్యులను కలసి, తమ ఆరోగ్య సమస్యలను ధైర్యంగా, స్వేచ్ఛగా వివరించడం ఈ శిబిరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తల్లులు కూడా తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు చూపించి, అవసరమైన వైద్య సహాయం పొందారు. అత్యవసర చికిత్స అవసరమైన విద్యార్థులను జిల్లా ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగింది. ఈ విధంగా, శిబిరం విద్యార్థులు మరియు తల్లిదండ్రులలో ఆరోగ్యంపై అవగాహనను పెంచుతూ, నమ్మకాన్ని కలిగించే విధంగా నిర్వహించబడింద్వైద్య శిబిరం అనంతరం, విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని, అమ్మాయిలకు మరియు అబ్బాయిలకు వేర్వేరుగా వైద్యుల కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహించబడినవి. ఈ కౌన్సెలింగ్‌లో విద్యార్థుల ఆరోగ్యానికి అవసరమైన ముఖ్య సూచనలు, శుభ్రమైన జీవనశైలి, పోషకాహారం తీసుకునే విధానం, మరియు ఉత్తమ అలవాట్లు (దీవర్ ఝుఎఠం) గురించి వైద్యులు సవివరంగా వివరించారు. ఈ వైద్య శిబిరండా. రాజగోపాల్ గారి పర్యవేక్షణలో, డా. శ్వేత -- మెడికల్ ఆఫీసర్, డా. శిరీష, డా. సుమన్‌మరియు వారి వైద్య సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించగా, మండల విద్యాధికారి (వీజూా) శ్రీ ఎనుగు ప్రభాకర్ రావు గారు శిబిరానికి హాజరై కార్యక్రమాన్ని పరిశీలించి, విద్యార్థులు మరియు తల్లిదండ్రులతో మాట్లాడి, వైద్య శిబిరాల ప్రాముఖ్యతను వివరించారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాలొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



**తాండూర్, మున్సిపల్, ఫిబ్రవరి,0202(సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తాండూరు మున్సిపాలిటీ పరిధిలోని 09వ వార్డు సాయిపూర్ లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్లోళ్ళ చైతన్య ప్రశాంత్ ను ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు.

# మైనారిటీ యువతకు ఉపాధి శిక్షణ

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ ఫిబ్రవరి2( సమయం న్యూస్) :** నిరుద్యోగ మైనారిటీ యువతకు స్వయం ఉపాధి కల్పించే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణా కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రం హమీద్‌పురాలోని ఉర్దూ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ (ు+వీఖీజ) ఆధ్వర్యంలో టైలరింగ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ వంటి కోర్సుల్లో మూడు నెలల ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్న అవకాశాలను దృష్టిలో ఉంచుకుని 'జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్' కోర్సును ప్రవేశపెట్టామని, దీని ద్వారా ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలే కాకుండా స్వయం ఉపాధి పొందవచ్చని తెలిపారు. అదేవిధంగా మహిళల కోసం స్వయం ఉపాధిని ఇచ్చే 'టైలరింగ్' శిక్షణ కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, శిక్షణ పొందుతున్న అభ్యర్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, ప్రాక్టికల్ అంశాలపై దృష్టి సారించాలని కోరారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లతో పాటు ఉపాధి మేళాల ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కలిమ్, ఫాకల్టీ లు, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో దేవనూరు గ్రామంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ

● 20 మంది మహిళలకు మొదటి విడత 50 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణ

●శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్-రేణుకదేవి కిషన్ రావు



**యాలాల మండలం, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** దేవనూరు గ్రామంలో రంగాపూర్ మాదారం తాండూర్ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్. రేణుకదేవి కిషన్ రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిక్షణ పొందారు. ఈ సందర్భంగా సేవాసమితి ప్రతినిధులు మాట్లాడుతూ,...మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ఇలాంటి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఎంతో దోహదపడతాయని తెలిపారు. శిక్షణ సమయంలో కుట్టు మిషన్ వినియోగం,దుస్తుల కటింగ్,స్టిచింగ్ వంటి అంశాలపై నిపుణులచే అవగాహన కల్పిస్తారు. కార్యక్రమం ప్రారంభంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆశయాలను గుర్తు చేస్తూ సేవ, ప్రేమ,త్యాగ భావనతో సమాజ సేవ చేయాలని పిలుపునిచ్చారు. శిక్షణ పూర్తయ్యాక మహిళలకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కిరణ్ రావు సత్య సాయి సేవ సమితి జిల్లా అధ్యక్షులు జగన్ సింగ్ ఠాగూర్ రంగాపూర్ వెంకటయ్య ఉప సర్పంచ్ బోడ్కా మాధవి మల్లేశం మాజీ ఎఎంసీ (ూవీజ) డైరెక్టర్ మంత్రి వెంకటయ్య,ఎంఆర్ పిఎస్(వీ=ూ) మండల అధ్యక్షుడు మెట్లి సూర్య ప్రకాష్, నరసింహులు, మైలారం పకీరప్ప,కోటం పకీరప్ప, రమేష్, రవి, సత్యసాయి సేవా సమితి సభ్యులు గ్రామస్తులు మహిళలు పాల్గొన్నారు

# మున్సిపల్ కౌంటింగ్.. ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

● నిర్మల్ పాలిటెక్నిక్ కళాశాలలో కేంద్రాల పరిశీలన

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ ఫిబ్రవరి2( సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా, పటిష్ట భద్రత మధ్య నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు కేటాయించిన స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్, అక్కడ చేపట్టిన భద్రతా చర్యలపై సంతృప్తి వ్యక్తం చేశారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లెక్కింపునకు అవసరమైన సిబ్బందిని ముందుగానే కేటాయించాలని, గదుల్లో సరిపడా టేబుళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సీటింగ్ సదుపాయం కల్పించాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, భోజన వసతి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో లెక్కింపు ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, తహసిల్దార్ రాజు తదితరులు ఉన్నారు.

# రైతులకు స్థిర ఆదాయానికి సమీకృత వ్యవసాయం ఉత్తమ మార్గం

● జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

**లక్ష్మీదేవి పల్లి ఫిబ్రవరి2( సమయం న్యూస్) :** రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయం సాధించేందుకు సమీకృత వ్యవసాయ విధానం ఉత్తమ మార్గమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. సోమవారం లక్ష్మీదేవిపల్లి మండలంలోని లోతువాగు గ్రామంలో రైతు పడిగా ప్రశాంత్ ఏర్పాటు చేసిన సమీకృత వ్యవసాయ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలు చేస్తున్న సమీకృత, ఆధునిక వ్యవసాయ పద్ధతులను ఆయన పరిశీలించారు. ఈ సమీకృత వ్యవసాయ కేంద్రంలో ఆకుకూరలు, మునగతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలను పూర్తిగా డ్రిప్ ఇరిగేషన్ విధానంలో సాగు చేస్తున్న తీరును కలెక్టర్ ప్రశంసించారు. నీటి వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నందుకు రైతు పడిగా ప్రశాంత్‌ను అభినందించారు. అలాగే యూనిట్‌లో కొనసాగుతున్న కొర్రమీను చేపల పెంపకం, మేకల పెంపకం, బ్యాక్‌యార్డ్ మదర్ యూనిట్, డక్స్ యూనిట్‌లను కూడా పరిశీలించి, వాటి నిర్వహణపై రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ తరహా సమీకృత వ్యవసాయ యూనిట్లు జిల్లాలోని ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తాయని కలెక్టర్ అన్నారు. అనంతరం మైలవరం గ్రామంలో రైతు మాడె కృష్ణవేణి ఏర్పాటు చేసిన కౌజు పిట్టల యూనిట్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ యూనిట్‌ను కేవలం రూ. 25,000/- తక్కువ పెట్టుబడితో షెడ్ నిర్మాణం, ఫెన్సింగ్, కౌజు పిల్లలు, ఫీడ్ మరియు అవసరమైన పరికరాలతో ఏర్పాటు చేసిన విధానాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. తక్కువ పెట్టుబడితో గ్రామీణ మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు



కల్పించే ఈ యూనిట్లను జిల్లాలో విస్తృతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని , జిల్లాలో ఈ విధంగా 500 కౌజు పిట్టల యూనిట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే మైలవరశీ గ్రామానికి చెందిన యువ రైతు కుంజా సందీప్ అమలు చేస్తున్న ప్రకృతి సేంద్రియ వ్యవసాయ విధానాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పరిశీలించారు. అనేక రకాల సమీకృత పంటల సాగుతో పాటు జీవామృతం, పంచగవ్య వంటి సేంద్రియ ఎరువుల తయారీ యూనిట్లను పరిశీలించి, సేంద్రియ వ్యవసాయం ద్వారా నేల సారవంతత పెరిగి, సాగు ఖర్చులు తగ్గడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక లాభాలు సాధ్యమవుతాయని తెలిపారు. ఈ సందర్భంగా యువ రైతు కుంజా సందీప్‌ను కలెక్టర్ అభినందిస్తూ, సేంద్రియ సాగును మరింత విస్తృతంగా చేపట్టాలని పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ గ్రామంలోని యువ రైతులకు సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు సుజాతనగర్‌లోని రవి హైబ్రిడ్ సీడ్స్ కేంద్రాన్ని సందర్శించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, సమీకృత వ్యవసాయ విధానం రైతులకు స్థిరమైన, నిరంతర ఆదాయాన్ని అందించే ఉత్తమ మార్గమని తెలిపారు. ఒకే వ్యవసాయ క్షేత్రంలో పంటల సాగుతో పాటు పశుపోషణ, పక్షుల పెంపకం, చేపల పెంపకం వంటి అనుబంధ కార్యకలాపాలను సమన్వయంతో చేపట్టడం వల్ల సాగులోని ప్రమాదాలు తగ్గి లాభాలు పెరుగుతాయని అన్నారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగునీటి పద్ధతుల వినియోగంతో నీటి వృథా తగ్గి దిగుబడులు మెరుగుపడతాయని అన్నారు. తక్కువ పెట్టుబడితో కౌజు పిట్టల యూనిట్లు, బ్యాక్‌యార్డ్ యూనిట్లు, సేంద్రియ వ్యవసాయం వంటి కార్యక్రమాలు గ్రామీణ యువత, మహిళలకు మంచి ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని తెలిపారు. జిల్లాలో ఈ తరహా మోడల్ యూనిట్లను విస్తృతంగా ఏర్పాటు చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకయ్య,సంబంధిత శాఖల అధికారులు, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● సమస్యలతో పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులకు న్యాయం చేకూరుతుందనే భరోసా కల్పించాలి

● పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**పాల్వంచ ఫిబ్రవరి2( సమయం న్యూస్):** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ను సోమవారం ఆకస్మికంగా సందర్శించడం జరిగింది. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. 5ూ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ రికార్డులను ఒక క్రమ పద్ధతిలో అమర్చుకోవాలని అన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి,పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వర్టికల్స్ వారీగా పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే అధికారులు,సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లోని అధికారులు ,సిబ్బందికి పలు సూచనలు చేశారు. డయల్ 100 ఫోన్ రాగానే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు న్యాయం చేకూర్చాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రమాద నివారణా చర్యలు చేపట్టాలని తెలిపారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం అక్కడ విధులలో ఉన్న సిబ్బంది సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్,ఎస్సై శ్రీనివాస్,టీజీఎస్పీ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.




# వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి విధానంపై శిక్షణ

**నారాయణపేట, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** నారాయణపేట కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి (జుఇజూశీ) విధానాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ూూజుణూ (ూస్త్రతీఅఎబశ్రీబతీుశ్రీ ఞూతీశీఎవంంవస ఖీశీశీసూతీశీసబఙ్మ జుఇజూశీతీ ణవజవశ్రీశీజూఎవత్ ూబ్ష్త్రశీతీఉఎ) సంస్థ ప్రతినిధుల ద్వారా నిర్వహించారు. ఈ శిక్షణలో ఏ పీ ఈ డీ ఏ అసిస్టెంట్ మేనేజర్ సుకేష్ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి విధానం, ూూజుణూ లైసెన్సింగ్, ఐ ఈ సి సర్టిఫికెట్ పొందే విధానం, ఆర్ సి ఎం సీ నమోదు ప్రక్రియ వంటి అంశాలను విపులంగా వివరించారు. అదనంగా బయ్యర్ సెల్లార్ మీటింగ్, ఫారిన్ ట్రేడ్ ఫేర్ నిర్వహిస్తామని, వీటిలో పాల్గొనేవారికి ప్రయాణ ఖర్చులపై 50% రాయితీ అందిస్తామని తెలిపారు. అలాగే, ఎగుమతి మౌలిక సదుపాయాల అభివృద్ధికి సాధారణంగా 40%, ప్రభుత్వ సంస్థలకు 90% వరకు రాయితీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఆర్గానిక్ సర్టిఫికేషన్ కూడా ఏ పీ ఈ డీ ఏ ద్వారా అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ గారు మాట్లాడుతూ---యువకులు, ఎఫ్ పీ వో సంఘాలు, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు చేపట్టి మన రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సాయిబాబా పాల్గొని ఉద్యానవన పంటల ఎగుమతులపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బియ్యం, మామిడి వంటి పంటలకు అమెరికా (ఖూ), యూరోపియన్ యూనియన్ (జుఖ), ఆసియన్ దేశాల్లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతు సోదరులు, ఎఫ్ పీ వో ల ప్రతినిధులు/సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, ఎగుమతి అవకాశాలపై విలువైన సమాచారాన్ని పొందారు.



# బీఆర్ఎస్ అభ్యర్థికి 'డబుల్' ఓటు

**నామినేషన్ రద్దు చేయాలని ఎంఐఎం డిమాండ్!**

**జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఎంఐఎం అభ్యర్థి బాబు జానీ**

**చర్యలు తీసుకోకుంటే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరిక**

**కరీంనగర్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల వేళ 37వ డివిజన్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ కార్పొరేటర్ మహమ్మద్ షర్ఫోద్దిన్ రెండు వేర్వేరు చిరునామాలతో ఓటు హక్కు కలిగి ఉన్నారని, ఇది ఎన్నికల నిబంధనలకు విరుద్ధమని ఎంఐఎం అభ్యర్థి మొహమ్మద్ అహ్మద్ మొహియుద్దీన్ (బాబు జానీ) ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు.

### రెండు చోట్ల ఓటు హక్కు.. నిబంధనల ఉల్లంఘన

బాబు జానీ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అభ్యర్థి శర్ఫోద్దీన్ (జూ×జ చీశీ.ూజీ6274371) పట్టణంలోని ఇంటి నెం. 8-5-30/1, ఇంటి నెం. 1-1-191 అనే రెండు వేర్వేరు చిరునామాల ద్వారా ఓటు హక్కు కలిగి ఉన్నారు. గత ఎన్నికల్లో కూడా ఈ రెండు చోట్ల ఓటు హక్కును వినియోగించుకున్నారని ఆయన ఆరోపించారు. ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉండటం, దానిని అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేయడం చట్టవిరుద్ధమని ఆయన స్పష్టం చేశారు.

### నామినేషన్ తిరస్కరించకుంటే న్యాయపోరాటం

శర్ఫోద్దీన్ నామినేషన్‌ను వెంటనే తిరస్కరించాలని బాబు జానీ డిమాండ్ చేశారు. "ఆధారాలతో ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఒకవేళ ఆయన నామినేషన్‌ను ఆమోదిస్తే, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మేము గౌరవ కోర్టును ఆశ్రయించడానికి సిద్ధంగా ఉన్నాము" అని ఆయన పత్రికా ముఖంగా హెచ్చరించారు. ఎన్నికల స్క్రీనింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి అధికారులు దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఉత్కంఠ ఇప్పుడు 37వ డివిజన్ ఓటర్లలో నెలకొంది.

# ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి టాపర్లకు రూ.2.2 కోట్ల నగదు బహుమతులు

- అదనపు కలెక్టర్ నగేష్
- శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్



**మెదక్ ఫిబ్రవరి2( సమయం న్యూస్).:** తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించాలని శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ నిర్ణయించిందని . అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రోత్సహిస్తూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ వారు బహుమతుల ప్రధానం గోడపత్రికలనుఅదనపు కలెక్టర్ కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ ఏడాది (2026)లో ప్రభుత్వ పాఠశాలల నుంచి 10వ తరగతి బోర్డు పరీక్షలు రాసే విద్యార్థుల్లో టాపర్లకు రూ. 2.2 కోట్ల నగదు బహుమతులను ప్రకటించిందని ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర స్థాయిలో స్టేట్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి రూ. 5 లక్షలు, రెండో స్థానం వచ్చిన విద్యార్థికి రూ. 3 లక్షలు, ప్రతి జిల్లా టాపర్ కు రూ. 2 లక్షల చొప్పున, ప్రతి నియోజకవర్గ టాపర్‌కు రూ.ఒక లక్ష చొప్పున, 612 మండలాల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థికి రూ. 10 వేల నగదు అందజేయనున్నట్టు వెల్లడించింది. దీనికి సంబంధించిన గోడ పత్రికను సోమవారం మెదక్ కలెక్టరేట్ లో డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి మున్సిపల్ కమిషనర్స్ కలిసి, రత్నాకర్ శ్రీరామ్ బ్రాంచ్ మేనేజర్ మెదక్, జూనియర్ మేనేజర్ రాజేంద్రప్రసాద్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ శ్రీకాంత్ రవి కుమార్ అదనపు కలెక్టర్ విడుదల చేశారు .ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సేవా దృక్పథం హర్షనీయమని ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ కొనియాడారు. లక్ష్యాలు సాధించిన విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలి అన్నారు.

# అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం

- జనవరి నెలలో 22 కేసులు నమోదు.
- జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS.



**వికారాబాద్,ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** జిల్లా వ్యాప్తంగా అక్రమ రవాణా మరియు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ జారీ చేసిన ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా కేవలం జనవరి నెలలోనే జిల్లా వ్యాప్తంగా మొత్తం 22 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇందులో ప్రధానంగా సహజ వనరుల దోపిడీని అరికట్టే క్రమంలో, అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లపై 14 కేసులు, అలాగే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టరుపై ఒక కేసు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. పర్యావరణానికి మరియు ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న నిషేధిత చైనా మాంజా విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి 4 కేసులు నమోదు చేశామని ఆమె వివరించారు. అక్రమ రవాణానే కాకుండా సామాజిక రుగ్మతలపై కూడా టాస్క్ ఫోర్స్ బృందాలు గట్టి నిఘా ఉంచాయి. ఇందులో భాగంగా పేకాట స్థావరాలపై దాడులు చేసి ఒక కేసు, మాదకద్రవ్యాల నిరోధక చట్టం (చీణూ) కింద ఒక కేసు, మరియు ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న కల్తీ ఆహార పదార్థాల విక్రయదారులపై ఒక కేసు నమోదు చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఇదే విధంగా నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ హెచ్చరించారు. జిల్లా ప్రజలు, పోలీసులకు సహకరించాలని, ఎక్కడైనా చట్టవ్యతిరేక పనులు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని ఎస్పీ స్నేహ మెహ్రా తెలియజేయడం జరిగింది.

# ఆకుల నందకుమార్ కూతురు ఉమా చైత్రిక పుట్టినరోజు పురసరించుకొని

- విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు పలకలు అందజేత



**యాలాల మండలం, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** యాలాల్ మండలం దేవనూరు గ్రామం లో ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వర్గీయ ఉమాపతి మాజీ సర్పంచ్ జ్ఞాపకార్థం 1 నుండి 10వ తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ మరియు పలకలు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ ఖాసీం, మాజీ సర్పంచ్ శివకుమార్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు...

# బేగంబజార్ పరిధిలో పర్యటించిన ఎండీ

- ఏళ్లనాటి డీప్ మాన్ హోల్ ధ్వంసం వల్ల సీవరేజ్ ఇబ్బందులు
- మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 02(సమయం న్యూస్) :** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్-4, బేగంబజార్ లోని సమస్యాత్మకమైన ప్రాంతాలను ఎండీ అశోక్ రెడ్డి పరిశీలించారు. మొదటగా ఉస్మాన్ గంజ్ లో 400 మి.మీ. ఆర్‌సీసీ సీవర్ బీ--90 ప్రధాన సీవర్ లైన్ డీప్ మాన్ హోల్ శిథిలమైపోవడంతో అవుట్ లెట్ లేక సీవరేజ్ రహదారిపై పొంగడంతో అధికారులు కొత్త మాన్ హోల్ నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి సోమవారం ఆ ప్రాంతాన్ని సందర్శించి డీప్ మాన్ హోల్ పునర్నిర్మాణ పనులను పరిశీలించి, శాశ్వత పరిష్కరానికి అధికారులతో చర్చించారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సీవరేజ్ ఓవర్‌ఫ్లో సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేస్తూ సమగ్ర సీవరేజ్ నెట్‌వర్క్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఫీల్‌ఖానా, ఉస్మాన్ గంజ్, బేగంబజార్ ప్రాంతంలో జీహెచ్ఎంసీ వాననీటి కాలువ ఉండడం, కొన్ని సీవరేజ్ లైన్లు వాననీటి కాలువ అనుసంధానం అయినట్టు గుర్తించారు. దీంతోపాటు ఉస్మాన్ గంజ్ ప్రధాన రహదారిపై జీహెచ్ఎంసీ కొత్త రోడ్, నాలా పైకప్పు నిర్మించే క్రమంలో.. పైపు లైన్ తో పాటు కొన్ని మ్యాన్ హోల్స్ ధ్వంసం చేసి నాలా లోకి మళ్లించింది. వర్షా కాలంలో అందులో పూడిక పేరుకుపోయి.. మరికొన్ని సీవరేజ్ లైన్లు వెనక్కి వచ్చి ఈ ప్రాంతాల్లో తరుచూ మురుగు రహదారులపైకి పొంగుతోంది. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించడానికి ధ్వంసమైన మ్యాన్ హోళ్లను పునర్మించి, రోడ్డులో పూడికుపోయిన మ్యాన్ హోళ్లను గుర్తించి డీ సిల్టింగ్ చేసి రోడ్డు మీద పారుతున్న మురుగును ఈ డ్రెయిన్ కి మళ్లించి శాశ్వత పరిష్కారంగా ఉస్మాన్ గంజ్ బ్రిడ్జి అవతల వైపున్న జలమండలి సీవరేజ్ లైన్ కు కొత్త కనెక్టివిటీ పైపు లైన్ ను నిర్మించాలని సూచించారు. అలాగే వర్షపు నీటి కాల్వలో మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాంటి పాయింట్లను గుర్తించి వర్షపు నీటి కాల్వ నుంచి సీవరేజ్ లైన్ ను వేరు చేసి ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో సీజీఎం ప్రభు, జీఎం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అభ్యర్థులకు నిబంధనల ప్రకారం గుర్తులను కేటాయించాలి.

- జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను



**నారాయణపేట, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం గుర్తులు కేటాయించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను తెలిపారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, బ్యాలెట్ పేపర్స్ ముద్రణపై రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. నామినేషన్ల విత్ డ్రా అనంతరం వివిధ రాజకీయ పార్టీల తరపున, స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారికి ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి ఆయా గుర్తులను కేటాయించాల్సి ఉంటుందన్నారు. వార్డుల వారీగా ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వివరాలతో కూడిన బ్యాలెట్ పేపర్ ల ముద్రణ విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఫైనల్ ప్రూఫ్ రీడింగ్ అనంతరం రిటర్నింగ్ అధికారులు బ్యాలెట్ పేపర్స్ ముద్రణ చేయించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే వారందరికీ పోస్టల్ బ్యాలెట్స్ అవకాశం కల్పించడం జరుగుతుందని, నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రిటర్నింగ్ అధికారులందరూ హ్యాండ్ బుక్కును క్షుణ్ణంగా అధ్యయనం చేసి అందులోని నిబంధనల ప్రకారం ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వర్తించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మున్సిపాలిటీల కమిషనర్లు గోల్కొండ నర్సయ్య, శ్రీ రాములు, నాగరాజ్, శ్రీకాంత్, ఎన్నికల నోడల్ అధికారులు, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నిర్వహిస్తున్న "చదువుకో తెలంగాణ"

- కార్యక్రమం అత్యంత అభినందనీయం



**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,02(సమయం న్యూస్):** కొడంగల్ 1.గర్ల్స్ స్కూల్, 2.జెడ్పీహెచ్ఎస్ స్కూల్ లకు సంబంధించిన ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమం గురించి గొప్పగా చెప్పడం జరిగింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం పాఠశాలలో "చదువుకో తెలంగాణ" కార్యక్రమం యొక్క పోస్టర్ల ఆవిష్కరణ మరియు విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో కోడంగల్ బ్రాంచ్ మేనేజర్ పి.సంజీవ్,మరియు ఎంఈఓ రాంరెడ్డి ,,డిఓ కె వెంకటేష్.డిఓ నర్సమ్మ, మరియు సిబ్బంది , వివరంగా వివరించడం జరిగింది. అందుకుగాను రెండు స్కూల్ లు టెన్త్ క్లాస్ విద్యార్థులు సానుకూలంగా స్పందించి ప్రణాళికబద్ధంగా చదివి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ అందిస్తున్న ఐదు లక్షల రివార్డుతో పాటుగా మరిన్ని రివార్డులను గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకువచ్చిన ప్రతిభా పురస్కారం అవార్డు విద్యార్థులకు ఎంతగానో ఉత్తేజనీస్తుందన్నారు. పేద విద్యార్థులు సహాయపడేలా ఇలాంటి కార్యక్రమాలతో ముందుకు వచ్చిన శ్రీరామ్ లైఫ్

# హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓ డైరీ ఆవిష్కరణ





**హైదరాబాద్, ఫిబ్రవరి 02 (సమయం న్యూస్) :** హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓ డైరీ--2026 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలోని ఎండీ ఛాంబర్ లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎండీ అశోక్ రెడ్డి, టీఎన్జీఓస్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీ కృష్ణ తో కలిసి డైరీ, క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓస్ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్. రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఖాలెద్ అహ్మద్, ప్రచార కార్యదర్శి వై.బి. శాస్త్ర, ఈసీ సభ్యుడు శ్రీధర్, జల మండలి యూనిట్ అధ్యక్షుడు ఎం. మహేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శి పి. భరత్ లతో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# ఇందూరు మాజీ ఎంపీటీసీ పటేల్ ప్రవీణ్ అంతక్రియలు

పాల్గొన్న తాండూరు-మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**పెద్దముల్ మండలం, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పటేల్ ప్రవీణ్ అంత్యక్రియల్లో పాల్గొని,భౌతిక కాయాన్ని సందర్శించి పైలెట్ రోహిత్ రెడ్డి, సీనియర్ నాయకులు విఠల్ రెడ్డి మరియు బీఆర్ఎస్ పార్టీ తాండూరు మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ పంజుగుల శ్రీశైల్ రెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ పటేల్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్టకాలంలో పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు ఉన్నారు.

# గోదావరి పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలి:

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

**నిర్మల్ ఫిబ్రవరి2( సమయ్దం న్యూస్).:** రానున్న గోదావరి నది పుష్కరాలకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా మండలాల వారిగా పుష్కర ఘాట్ల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. బాసర పుష్కర ఘాట్ వద్దకు పుష్కరాల స్నానాలు ఆచరించే భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. ప్రతి పుష్కర ఘాటు వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ఆయా మండలాల వారీగా రెవెన్యూ, వివిధ విభాగాల ఇంజనీరింగ్, పోలీసు, విద్యుత్, శాఖల అధికారులు లు వెంటనే పుష్కర ఘాట్ల ప్రాంతాలను సందర్శించి, అక్కడ అవసరమైన ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. అన్ని పుష్కర ఘాట్ ల వద్ద అవసరమైన పార్కింగ్ ప్రాంతాలను గుర్తించాలని తెలిపారు. భక్తుల కొరకు దుస్తులు మార్చుకునే గదులు, త్రాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రతి పుష్కర ఘాటు వద్ద ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు, దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పుష్కర ఘాట్ల వరకు అవసరమైన రోడ్డు సదుపాయం కల్పించాలని చెప్పారు. ఎప్పటికప్పుడు మెరుగైన పారిశుధ్యం కొనసాగించాలని వివరించారు. పుష్కర ఘాట్ల పరిసర ప్రాంతాలలో వంగిన, పాడైన విద్యుత్ స్తంభాలను మార్చాలని పేర్కొన్నారు. మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలని అన్నారు. పార్కింగ్ ప్రాంతాలలో, పుష్కర ఘాట్ ల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు, పటిష్ట పోలీసు బందోబస్తు కల్పించాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులను అంచనా వేస్తూ దానికి అనుగుణంగా సంబంధించిన మౌలిక సదుపాయాలను కల్పించాలని తెలిపారు. ఈ సమావేశంలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అదనపు ఎస్పీ ఉపేంద్రా రెడ్డి, వివిధ విభాగాల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ లు, తహసిల్దార్ లు, ఎంపీడీవోలు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సి ఎం కప్ 2025 నియోజక వర్గ స్తాయిలో క్రీడ పోటీలు

**నిర్మల్ ఫిబ్రవరి2( సమయం న్యూస్).:** సియం కప్-2025 లో భాగంగా నియోజక వర్గం స్థాయిలో తేదీ 04.02.2026 నుండి 05.02.2026 వరకు ఏడు క్రీడలను నిర్వహించడం జరుగుతుందని జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి బి. శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

1. కబడ్డీ
2. ఖో ఖో
3. వాలీబాల్
4. అథ్లెటిక్స్
5. చెస్
6. బ్యాడ్మింటన్
7. ఫుట్ బాల్

పైన పేర్కొన్న 7 క్రీడా పోటీలను నిర్వహించడం జరుగును. మిగతా అన్ని క్రీడలను నేరుగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలకు పంపడం జరుగును.

పైన తెలిపిన ఏడు క్రీడలు వాసవి వరల్డ్ స్కూల్ పక్కన గల మైదానంలో తేదీ 04.02.2026 నుండి 05.02.2026 లలో జరుగును. కావున నిర్మల్ నియోజక వర్గంలో ఆన్లైన్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొని, మండల స్థాయిలో పై ఏడు విభాగాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తేదీ 04.02.2026 రోజున ఉదయం 8.00 గంటలకి (న్యూ కలెక్టర్ రోడ్ )వాసవి వరల్డ్ స్కూల్ మైదానంలో రిపోర్ట్ చేయలసినదిగా కోరడమైనది.

గమనిక: పై ఏడు క్రీడలలో టీం గేమ్స్ లలో మండల స్థాయిలో సెలక్షన్ టీమ్ మరియు వ్యక్తిగత క్రీడలలో ప్రథమ బహుమతి పొందిన క్రీడాకారులు నియోజక వర్గ స్థాయిలో పాల్గొనుటకు అర్హులు.

# బీఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి




**తాండూర్, మున్సిపల్, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** తాండూర్ మున్సిపల్ 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సబా ఫాతిమా హబీబ్ లాల ఆధ్వర్యంలో దాదాపు 50 మంది బిఆర్ఎస్ పార్టీ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిక. వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.కాంగ్రెస్ లో చేరిన వారు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## క్రిటికల్ పోలింగ్ స్టేషన్ ల పరిశీలన.



**మహబూబ్ నగర్ ఫిబ్రవరి2 ( సమయం న్యూస్).:** దేవరకద్ర మున్సిపాలిటీలో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సాధారణ పరిశీలకురాలు శ్రీమతి కాత్యాయని దేవి, ఐ, ఏ,ఎస్ సోమవారం సందర్శించారు.దేవరకద్ర పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బలుసు పల్లి లోనిమండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించి అధికారులతో ఎన్నికల నిర్వహణపై చర్చించారు.ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు..

## మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా18వ వార్డు అభ్యర్థి గౌరీ రాములు ఇంటింటి ప్రచారం




**తాండూర్, మున్సిపల్ ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ పట్టణంలోని 18వ వార్డు నుంచి గౌరీ రాములు కాంగ్రెస్ పార్టీ తరపు నుండి పోటీ చేస్తున్నారు. మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పట్టణంలోని 18వ వార్డులో ప్రచారం చేపట్టారు.సోమవారం వార్డులో పర్యటించారు.వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలుస్తూ చెయ్యి గుర్తుకు ఓటు వేసి నన్ను గెలిపించాలంటూ ప్రచారం.

## సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

-- జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

-- హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్ : 81253 52721



**సంగారెడ్డి, ఫిబ్రవరి 2 ( సమయం న్యూస్).:** జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులను స్వీకరించేందుకు సంగారెడ్డి జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సందేహాల నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ ఫోన్ నంబర్81253 52721 కు కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ హెల్ప్ డెస్క్ మున్సిపల్ ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రభుత్వ సెలవు రోజులతో సహా 24 గంటలు, మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తూ నిరంతరంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే నమోదు చేసి పరిశీలించి, ఎన్నికల నిబంధనలు మరియు మార్గదర్శకాల మేరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేశామని కలెక్టర్ తెలిపారు.

## బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడికి పరామర్శ.



**రాయపోల్ ఫిబ్రవరి 2:** రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు అయ్యగల్ల రవి తండ్రి పెంటయ్య గత నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ, మాజీ జెడ్పిటిసి యాదగిరి వడ్డేపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్,చిరంజీవి,మాజీ ఉపసర్పంచ్ గుమ్మడి వెంకటేశం, అయ్యగల్ల రవి,శ్రీనివాస్,యాదగిరి లు బాధిత కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# సుస్థిర అభివృద్ధే ముఖ్యం

- పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి
- కళాశాల ఆవరణలో మొక్కలు నాటిన
- ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బి. శ్రీనివాస్ రెడ్డి





**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం ( వెట్ ల్యాండ్స్ డే ) సందర్భంగా కళాశాల వృక్ష మరియు జంతు శాస్త్ర విభాగాలు మరియు ఎకో క్లబ్ ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డా బి. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన "ప్రపంచ పర్యావరణ సంక్షోభం - ఒక పరిష్కార మార్గం" అను అంశంపై నిర్వహించిన స్వాగతోపన్యాసానికి ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అభివృద్ధి మరియు పర్యావరణం అనునవి ఒక నాణేనికి రెండు వైపుల వంటివి అని, అడవులు మరియు భౌగోళిక వనరుల అసమతుల్య వినియోగం వల్ల జీవ వైవిధ్య వినాశనం, వాతావరణ మార్పులు, ఓజోన్ పొర క్షీణత, ఎడారీకరణ, రేడియో ధార్మిక ప్రభావాలు వంటి ఎన్నో దుష్ప్రభావాలు కలుగుతున్నాయని సమతుల్యత తో కూడిన అభివృద్ధి ఒక్కటే దీనికి పరిష్కారమన్నారు. చిత్తడి నేలలు పర్యావరణ పరంగా ఎంతో విలువైనవని, అవి ఎన్నో జీవరాశు లకు ఆశ్రయ మిస్తాయని కాని అవి నేడు అనేక ఒత్తిడులకు గురవుతున్నాయని వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అయన తెలిపారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ ప్రాముఖ్యతను గుర్తించి ఐక్య రాజ్య సమితి సూచించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం, ఐ. క్యూ. ఎ. సి కోఆర్డినేటర్ టి. రాంబాబు, జంతుశాస్త్ర అధ్యాపకులు రమేష్, హరిప్రియ అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

# మున్సిపాలిటీలలో జోరందుకున్న ఎన్నికల ప్రచారం

- చేవెళ్ళ మున్సిపాలిటీ లో ఎన్నికల ప్రచారంలో మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి , ఎమ్మెల్యే కాలే యాదయ్యతో,
- పాటుగా పాల్గొన్న చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించండి
- పలు వార్డులలో ఎన్నికల ప్రచారం



**చేవెళ్ల, ఫిబ్రవరి,02.( సమయం న్యూస్) :** హాజరైన చేవెళ్ళ మాజీ ఎంపీ శ్రీ గడ్డం రంజిత్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేవెళ్ళ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ , చేవెళ్ళ మున్సిపల్ పరిధిలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. సోమవారం చేవెళ్ళ మున్సిపాలిటీలోని పలు వార్డు లాలో వారు విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ఓట్లు అభ్యర్థించారు.వార్డులలోని ప్రతి గల్లీలో తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి , కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు , డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మొదలగు సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని సూచించారు. ఆయా వార్డు లలో కాంగ్రెస్ అభ్యర్థుల ను 'చేయి' గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. వార్డులను ఆదర్శంగా తీర్చిదిద్దే బాధ్యతను తాము తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమం లో చేవెళ్ల మున్సిపల్ సీనియర్ నాయకులు అభ్యర్థి మద్దెల శ్రీనివాస్, బండారి శైలజ ఆగిరెడ్డి, దేవర సమత వెంకట్ రెడ్డి, మంగలి కళ్యాణి యాదగిరీ, చేవెళ్ళ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట రెడ్డి , శ్రీకాంత్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు, ముఖ్య కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మున్సిపాలిటీ 5వ వార్డులో టీ ఆర్పి ,అభ్యర్థిగా బీ. రాజు నామినేషన్



**చేవెళ్ల,ఫిబ్రవరి, 02:(సమయం న్యూస్) :** చేవెళ్ల నియోజకవర్గంలోని చేవెళ్ల మున్సిపాలిటీ 5వ వార్డు నుంచి తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీ ఆర్ పి) సభ్యుడిగా బీ. రాజు నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు తీన్మార్ మల్లన్న బీ-ఫారాన్ని అధికారికంగా అందజేశారు.ఈ కార్యక్రమం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారి రమేష్ యాదవ్ (అడ్వకేట్) నేతృత్వంలో నిర్వహించబడింది. అలాగే చేవెళ్ల మండల అధ్యక్షులు కల్వకుర్తి అశోక్ (అడ్వకేట్) మరియు ప్రదీప్ పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బీ. రాజును భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో కృషి చేస్తాయని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజాపక్ష విధానాలను ప్రతి గడపకు చేర్చేలా ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు:జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింగ్ ముదిరాజ్, అధికార ప్రతినిధి శంకరొళ్ల సురేష్ ముదిరాజ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బండారు విజయలక్ష్మి, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్ల వాసుక పాల్గొన్నారు.

## షాబాద్ ఎమ్మార్వో అన్వర్ కు అభినందనలవెల్లువ .



**చేవెళ్ల, ఫిబ్రవరి: 02: ( సమయం న్యూస్) :** ఉత్తమ తహసిల్దార్ గా అవార్డు అందుకున్నందుకు గాను షాబాద్ మండల్ తాసిల్దార్ అన్వర్ కు సీతారాంపూర్ గ్రామ సర్పంచ్ పావని చెన్నయ్య, ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, సుధాకర్ ,రెడ్డి ఏకాంబరెడ్డి ,డాక్టర్ రాజు ,శ్రీనివాస్ రెడ్డి ,ఆంజనేయులు ,రాములు ,మాణి ,కృష్ణ, తదితరులు కలసి ఎమ్మార్వో కు సన్మానం చేయడం జరిగింది. అనంతరం సీతారాంపూర్ గ్రామంలో భూములు కోల్పోయిన గ్రామస్తులకు రావలసిన ప్లాట్లకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



## చేవెళ్లలో ఊపందుకున్న బీజేపీ ప్రచారం.

**చేవెళ్ల,ఫిబ్రవరి:02 (సమయం న్యూస్) :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 14 ,15, 16 ,17 ,18 ,వార్డులలో భాజపా నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రత్నం ఇంటింటి ప్రచార కార్యక్రమం లో పాల్గొన్నారు.చేవెళ్ల మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి దాఖలు చేసిన అన్ని దీజ్ఞా నామినేషన్ దరఖాస్తులు పూర్తిగా ఆమోదం పొందినట్లు తెలియజేయడమైనది.అదేవిధంగా, చేవెళ్ల మున్సిపల్ ఎన్నికల బి--ఫారాలు పార్టీ ఇన్‌చార్జ్ శ్రీ వడ్డెపల్లి రాజేశ్వర్ రావు గారు సమర్పించగా, ఈ సందర్భంగా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు శ్రీ అత్తెల్లి అనంత రెడ్డి , సీనియర్ నాయకులు శ్రీ మల్లారి రమణ రెడ్డి , శ్రీ పాండురంగ రెడ్డి , అంజనేయులు , డా. వైభవ్ రెడ్డి తదితర ప్రముఖ నాయకులు హాజరయ్యారు.ఈ ప్రక్రియతో చేవెళ్ల మున్సిపల్ ఎన్నికలకు దీజ్ఞా పార్టీ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందని నాయకత్వం స్పష్టం చేసింది. ప్రజల సేవే లక్ష్యంగా, ఎన్నికల్లో విజయం సాధించేందుకు సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

## తుంకిమెట్ల లో రైతులకు యూరియా బుకింగ్ ఈ యాప్ పై అవగాహన కల్పించిన-ఎడిఎ శంకర రాథోడ్



**బొంరస్ పేట మండలం, ఫిబ్రవరి,02(సమయం న్యూస్) :** తుంకిమెట్ల గ్రామములో ఆగ్రో రైతు సేవా కేంద్రం లో కొడంగల్ ఎడిఎ(టూణూ) శంకర్ రాథోడ్ రైతులకు యూరియా బుకింగ్ ఈ యాప్ గురించి అవగాహన కలిగించటం జరిగింది.ఇందులో వివిధ గ్రామాల రైతులు ఆగ్రో రైతు సేవా కేంద్రంతుంకిమెట్ల యజమాని విశ్వేశ్వరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఎడిఎ శంకర్ రాథోడ్ మాట్లాడుతూ.. రైతులు యూరియా బస్తాలు బుకింగ్ చేసిన తర్వాత ఇరవై నాలుగు గంటల్లో తమ యూరియా ను తీసుకోవచ్చని,రైతులు నేరుగా ఇంటి నుండే అందుబాటులో ఉన్న దుకాణాల నుండి యూరియా బుక్ చేసుకొని ఈ యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# మ్యాచ్ బాయ్‌కాట్ చేస్తే పాక్‌కు చుక్కలే

## 15న శ్రీలంకలో భారత్‌తో పాకిస్తాన్ మ్యాచ్ ఆడదని ప్రభుత్వం ప్రకటన



తమ జట్టు 2026 టీ20 ప్రపంచ కప్‌లో పాల్గొంటుందని, అయితే ఫిబ్రవరి 15న శ్రీలంకలో భారత్‌తో జరిగే మ్యాచ్ కోసం మైదానంలోకి దిగదని పాకిస్తాన్ ప్రభుత్వం గత ఫిబ్రవరి 01న అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటన తర్వాత క్రికెట్ ప్రపంచంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాస్తవానికి పాకిస్తాన్ తెలివి తక్కువగా ఇంత పెద్ద ప్రకటన చేసింది, కానీ దీనివల్ల కలిగే నష్టాన్ని వారు ఊహించలేదు అని మాజీ క్రికెటర్లు అంటున్నారు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్‌కు 5 పెద్ద నష్టాలు ఉన్నాయి. దైనిక్ జాగరణ్ ప్రకారం, పాకిస్తాన్ ఈ నిర్ణయం ప్రకటించడం అంటే భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు ప్రపంచ కప్ నుండి ఆ జట్టుపై నిషేధం పడవచ్చు. టోర్నమెంట్ నుండి బంగ్లాదేశ్ ఇప్పటికే తన పిచ్చి నిర్ణయం కారణంగా నిష్క్రమించింది. ఇప్పుడు పాకిస్తాన్ ప్రపంచ కప్ నుండి నిషేధం ఎదుర్కొనే ప్రమాదంలో పడింది. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించినందుకు పాకిస్తాన్ ఆదాయంపై కూడా ఐసిసి నిషేధం విధించవచ్చు. నివేదికల ప్రకారం, ఐసిసి ద్వారా పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు సంవత్సరానికి 34.51 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు 316 కోట్ల రూపాయలు) ఆదాయం వస్తుంది. ఈ ఆదాయం నిలిచిపోతే పాకిస్తాన్ పూర్తిగా దివాలా తీసినట్లే. భారత్‌తో మ్యాచ్ ఆడకపోతే, పాకిస్తాన్ జట్టు జియోస్టార్‌కు నష్టపరిహారం చెల్లించాల్సి రావచ్చు. ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్ ద్వారా అత్యధికంగా సంపాదన వస్తుంది. ఈ మ్యాచ్‌లో 10 సెకన్ల ప్రకటన స్లాట్ సైతం చాలా ఖరీదైనది. మ్యాచ్ జరగకపోతే వారికి చాలా నష్టం వాటిల్లుతుంది. పాకిస్తాన్ మీద ద్వైపాక్షిక సిరీస్‌లపై కూడా పూర్తి నిషేధం విధించవచ్చు. ఈ నిషేధంతో పాకిస్తాన్ క్రికెట్ బోర్డు మరింత దివాళా తీస్తుంది. ప్రపంచ కప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించడం వల్ల పాకిస్తాన్ పాకిస్తాన్ సూపర్ లీగ్ లో సైతం నష్టపోవచ్చు. వాస్తవానికి, టోర్నమెంట్ కోసం విదేశీ ఆటగాళ్ల ఎన్‌ఓసి అంటే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్‌పై నిషేధం విధించవచ్చు. భారత్ తో మ్యాచ్ లు ఆడకూడదనే నిర్ణయం గురించి పిసిబి ఇంకా ఐసిసికి తెలియజేయలేదని పలు నివేదికలు సూచిస్తున్నాయి. ఈ బహిష్కరణను పిసిబి అధికారికంగా ఐసిసికి తెలియజేసిన తర్వాతే చర్యలు చేపడుతుంది.. 2026 టి 20 ప్రపంచ కప్ నుండి పాకిస్తాన్ ను మినహాయించవచ్చు అని ప్రచారం జరుగుతోంది. పాకిస్తాన్ టి 20 లీగ్ (పిఎస్ఎల్) లో విదేశీ ఆటగాళ్లకు ఎన్‌ఓసిలు ఇవ్వడానికి కూడా ఐసిసి నిరాకరించవచ్చు. బంగ్లాదేశ్ ను వెనకుండి ప్రోత్సహించిన కారణంగా, వారికి ఓ న్యాయం, తమకు ఓ న్యాయం ఉండదని చెప్పడానికి.. బంగ్లా దారిలో పయనించి పాకిస్తాన్ ఈ నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. ఐసిసి షెడ్యూల్ ప్రకటించిన తర్వాత తమ మ్యాచ్ లను భారత్ వెలుపల తరలించడానికి నిరాకరించిన తరువాత టి 20 ప్రపంచ కప్ లో పాల్గొనకూడదని బంగ్లాదేశ్ తన నిర్ణయాన్ని ప్రకటించింది. దీని తరువాత, పాకిస్తాన్ ఆటగాళ్ళు, పీసీబీ చీఫ్ మొహ్సిన్ నఖ్వీ ఐసిసిని విమర్శించారు. టోర్నమెంట్ ను బహిష్కరిస్తాం అన్నారు. అయితే, సెమీఫైనల్ లేదా ఫైనల్‌లో భారత్‌తో మ్యాచ్ ఉంటే ఏం చేయనున్నారో పాకిస్తాన్ ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు. అప్పుడు వారు ఆడతారా లేదా? ప్రస్తుతం పాక్ ప్రభుత్వం ఫిబ్రవరి 15న జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరిస్తామని మాత్రమే ప్రకటించి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది.



# అఫ్రిది టు బుమ్రా

## వరల్డ్‌కప్ చరిత్రలో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు వీరులు వీరే!

### మొట్టమొదటి ఆటగాడిగా షాహిద్ అఫ్రిది

### 2014 వరల్డ్‌కప్‌లో విరాట్ కోహ్లి కింగ్

### 2024 వరల్డ్‌కప్‌లో జస్ప్రీత్ బుమ్రాకు అవార్డు

**'టీ20 వరల్డ్‌కప్' అంటేనే క్షణక్షణం ఉత్కంఠ పోరు. ఈ మెగా టోర్నమెంట్‌లో జట్టు విజయం ఎంత ముఖ్యమో.. వ్యక్తిగతంగా అద్భుత ప్రదర్శన చేసిన ఆటగాడికి దక్కే 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డుకు కూడా అంతే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. ఇప్పటివరకు చాలా మంది ప్లేయర్స్ ఈ అవార్డు అందుకున్నారు. మొట్టమొదటి ఆటగాడిగా పాకిస్థాన్ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది రికార్డుల్లో ఉన్నాడు. ఇప్పటివరకు జరిగిన ప్రతి టీ20 వరల్డ్‌కప్‌లో ఈ అవార్డు గెలిచిన ఆటగాళ్లు చరిత్రలో నిలిచిపోయారు.**

2007 దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి టీ20 వరల్డ్‌కప్‌లో షాహిద్ అఫ్రిది ఈ అవార్డును దక్కించుకున్నాడు. అఫ్రిది 91 రన్స్, 12 వికెట్స్ పడగొట్టాడు. 2009లో ఇంగ్లాండ్ వేదికగా జరిగిన టోర్నీలో శ్రీలంక స్టార్ తిలకరత్నే దిల్షాన్ 317 రన్స్ చేసి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు. 2010 వెస్టిండీస్‌లో ఇంగ్లాండ్ తరఫున ఆడిన కెవిన్ పీటర్సన్ కీలక ఇన్నింగ్స్‌లతో (248 రన్స్) తన ముద్ర వేశాడు. 2012 శ్రీలంకలో జరిగిన వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ అద్భుత ప్రదర్శనతో (249 రన్స్, 12 వికెట్స్) ఈ అవార్డు గెలుచుకున్నాడు.

2014 వరల్డ్‌కప్‌లో కింగ్ విరాట్ కోహ్లీ అసాధారణ నిలకడతో (319 రన్స్) 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచాడు. 2016 భారత వేదికగా జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో కూడా మరోసారి విరాట్ (273 రన్స్, 1 వికెట్) ఘనతను సాధించి అరుదైన రికార్డు నెలకొల్పాడు. 2021లో జరిగిన టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ డేవిడ్ వార్నర్ కీలక పరుగులతో (289) జట్టును విజేతగా నిలబెట్టడంలో ప్రధాన పాత్ర పోషించాడు. 2022 ఆస్ట్రేలియాలో జరిగిన టోర్నీలో ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్ తన ఆల్‌రౌండ్ ప్రదర్శనతో (13 వికెట్స్, 12 రన్స్) ఈ అవార్డు అందుకున్నాడు. వెస్టిండీస్-అమెరికా వేదికగా జరిగిన 2024 వరల్డ్‌కప్‌లో జస్ప్రీత్ బుమ్రా 15 వికెట్లతో అవార్డు కైవసం చేసుకున్నాడు. ఇప్పుడు అందరి దృష్టి 2026 టీ20 వరల్డ్‌కప్ (భారత్ ఉ శ్రీలంక)పై ఉంది. ఈసారి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు ఎవరి ఖాతాలోకి వెళ్లనుందో చూడాలి.

# ఐసీసీకి పోటీగా కొత్త క్రికెట్ బోర్డు..

### ఐసీసీ స్థాయి క్రికెట్ సంస్థ ఏర్పాటుకు పీసీబీ ప్రయత్నం

### 8 క్రికెట్ బోర్డులను సంప్రదించిన పీసీబీ

### పీసీబీ ప్రయత్నం ఆదిలోనే ఫెయిల్?

పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) మరోసారి అంతర్జాతీయ క్రికెట్ వర్గాల్లో నవ్వులపాలవుతోంది. అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి ప్రత్యామ్నాయంగా.. తమకంటూ ఒక ఐసీసీ స్థాయి క్రికెట్ సంస్థను ఏర్పాటు చేయాలనే ఆలోచనతో పీసీబీ చేసిన ప్రయత్నం పూర్తిగా ఫెయిల్ అయినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనకు మద్దతు కోరుతూ పీసీబీ ఏకంగా 8 క్రికెట్ బోర్డులను సంప్రదించినట్లు తెలుస్తోంది. అందులో కేవలం రెండు దేశాలు మాత్రమే మద్దతు ఇవ్వడంతో పీసీబీకి భారీ షాక్ తగిలింది. కొత్త క్రికెట్ బోర్డు కోసం చైనా, బంగ్లాదేశ్, యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ స్టేట్స్, వెస్టిండీస్, జింబాబ్వే వంటి దేశాలతో పీసీబీ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఐసీసీ నిర్ణయాలపై అసంతృప్తితో ఉన్న దేశాలను ఏకం చేసి. కొత్త అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేయాలన్నది పీసీబీ ప్లాన్‌గా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఆలోచనకు ప్రపంచ క్రికెట్ నుంచి పెద్దగా స్పందన రాలేదు. పీసీబీ సంప్రదించిన ఎనిమిది బోర్డుల్లో ఆరు బోర్డులు నో చెప్పినట్లు సమాచారం. యూఏఈ, ఒమాన్, సౌదీ అరేబియా, యుఎస్ఏ, వెస్టిండీస్, జింబాబ్వే ఈ ప్రతిపాదనను తిరస్కరించినట్లు టాక్. కేవలం చైనా, బంగ్లాదేశ్ మాత్రమే పీసీబీ ఆలోచనకు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. ఆరు దేశాల తిరస్కరణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు చేసిన ఐసీసీ స్థాయి సంస్థ ఆలోచన మొదటి దశలోనే కుప్పకూలినట్లైంది. ఈ పరిణామంపై అటు క్రికెట్ అభిమానులు, ఇటు విశ్లేషకులు తమదైన శైలిలో స్పందిస్తున్నారు. ఐసీసీకి పోటీగా మరో అంతర్జాతీయ సంస్థను ఏర్పాటు చేయడం అంత ఈజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముందు పాకిస్థాన్ క్రికెట్ తన అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవాలని, ఆటపై దృష్టి పెట్టాలని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి పీసీబీ మరోసారి అనవసర నిర్ణయాలతో క్రికెట్ ప్రపంచంలో నవ్వుల పాలయ్యిందనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది.



# బీబీసీ స్పోర్ట్స్‌ఉమెన్ అవార్డుకు నామినేట్

### జాబితాలో హర్మన్‌ప్రీత్, స్మృతి, దివ్య పేర్లు

**ఢిల్లీ:** మీడియా దిగ్గజం బీబీసీ ప్రతియేటా అందజేసే 'బీబీసీ ఇండియా స్పోర్ట్స్‌ఉమెన్ ఆఫ్ ది ఇయర్ అవార్డు'లకు నిరుడు అంతర్జాతీయ క్రీడా యవనికపై మువ్వన్నెల కీర్తి పతాకాన్ని రెపరెపలాడించిన పలువురు క్రీడాకారులు చోటు దక్కించుకున్నారు. అవార్డుకు నామినేట్ అయినవారిలో టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు సారథి హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన, చెస్ సంచలనం దివ్య దేశ్‌ముఖ్, షూటింగ్‌లో పతకాలు కొల్లగొడుతున్న సురుచి సింగ్, ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ పోటీలో ఉన్నారు. మరి వీరిలో అవార్డు ఎవరిని వరిస్తుందనేది త్వరలో తేలనుంది.

# భారత్‌కు స్వర్ణం..

### ఏషియన్ గేమ్స్ సెపక్‌తక్రా టెస్ట్ ఈవెంట్

**హైదరాబాద్:** ఏషియన్ గేమ్స్ 2026 టెస్ట్ ఈవెంట్‌లో భారత సెపక్‌తక్రా టీమ్ పసిడి పతకంతో మెరిసింది. జపాన్ వేదికగా జరిగిన టోర్నీలో భారత పురుషుల జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. టోర్నీలో తమ కంటే బలమైన జట్లను ఓడిస్తూ ముందుకు సాగిన భారత్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆకాశ్ యుమ్నమ్, సందీప్‌కుమార్, అరుణ్, రామ్‌కుమార్, బాబీకుమార్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు.





# ఆరంభ మ్యాచ్‌లకు హాజిల్‌వుడ్ దూరం

**సిడ్నీ :** టీ20 ప్రపంచకప్ ఆరంభానికి ముందే ఆస్ట్రేలియా క్రికెట్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. టోర్నీలో ఇప్పటికే కమిన్స్ దూరమవగా.. తాజాగా కొన్ని మ్యాచ్‌ల పాటు ఆ జట్టు ప్రీమియం పేసర్ జోష్ హాజిల్‌వుడ్ సేవలనూ కోల్పోనున్నది. కాలి మడమ నొప్పి గాయం నుంచి ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయిలో కోలుకుంటున్న అతడు సిడ్నీలో పునరావాసం పొందుతున్నాడు. దీంతో అతడి స్థానంలో రిజర్వ్ పేసర్‌గా సీన్ అబాట్‌కు అవకాశం దక్కింది. పాకిస్థాన్‌తో సిరీస్‌కు దూరమైన గ్లెన్ మ్యాక్స్‌వెల్, నాథన్ ఎల్లీస్, టిమ్ డేవిడ్.. నేడు కొలంబోలో జట్టుతో కలిసే అవకాశముంది.

# 2వేల మందితో వరల్డ్ జూనియర్ రన్

**హైదరాబాద్, ఆట ప్రతినిధి :** గచ్చిబౌలి స్టేడియం వేదికగా రెండు వేల మంది పిల్లలతో అలెన్ వరల్డ్ జూనియర్ రన్ ఉత్సాహంగా, ఉల్లాసంగా సాగింది. హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌తో పాటు నగరంలోని దాదాపు 180 పాఠశాలల నుంచి రెండు వేల మందికి పైగా విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. స్పాట్ ఆన్ స్పోర్ట్స్ సంస్థ నిర్వహించిన ఈ రనన్‌ను భారత యువ అథ్లెట్ అగసర నందిని జెండా ఊపి ప్రారంభించింది. గచ్చిబౌలిలో మొదలైన పరుగు టిమ్స్ గేటు నుంచి గోపీచంద్ అకాడమీ, ఐఎస్‌బీ సర్కిల్ మీదుగా తిరిగి స్టేడియంలోకి ప్రవేశించింది. 1కే రన్‌లో పిల్లలతో పాటు తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 1కే, 3కే, 5కే, 10కే విభాగాల్లో కలిపి 84 మంది ప్లేయర్లు 3 లక్షల ప్రైజ్‌మనీ సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్పాట్ ఆన్ స్పోర్ట్స్ సీఈవో రోహిత్‌మిశ్రా పాల్గొన్నారు.



# జైలర్-2లో షారూఖ్ ఖాన్






తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ క్రేజీ సీక్వెల్ జైలర్ 2. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న ఈ చిత్రానికి కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నాడు. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది. కాగా దీనిపై అఫీషియల్ న్యూస్ అభిమానుల్లో జోష్ నింపుతోంది. జైలర్ 2 నెక్ట్స్ షెడ్యూల్ ముంబైలో జరుగనుంది. తాజా సమాచారం ప్రకారం వచ్చే వారం షురూ కానున్న ఈ షెడ్యూల్‌లో షారుక్ ఖాన్ జాయిన్ అవ్వబోతున్నాడు. ఈ షెడ్యూల్‌లో షారుక్‌ఖాన్‌పై వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు ఇన్‌సైడ్ టాక్. మొత్తానికి నెల్సన్ దిలీప్ కుమార్ షారుక్ ఖాన్‌ను ఎలాంటి స్పెషల్ రోల్‌లో చూపించబోతున్నాడు.. తలైవా, షారుక్ ఖాన్ కాంబోలో సీన్లుంటాయా..? అన్నది తెలియాల్సి ఉంది. సిల్వర్ స్క్రీన్‌పై ఇద్దరు స్టార్ యాక్టర్లను చూసేందుకు ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్, అభిమానులు. జైలర్ 2ను 2026 జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ ఏమైనా ఇస్తారేమో చూడాలి. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరుండబోతున్నారన్నదానిపై మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.



# అతడి ప్రవర్తన చూసి దూరం పెట్టాను

## మాజీ ప్రియుడి గురించి మృణాల్ కామెంట్స్

కొన్ని రోజులుగా ప్రేమ, పెళ్లి అంశాల్లో వరుసగా వార్తల్లో ఉంటున్నారు నటి మృణాల్ ఠాకూర్. తాజాగా ఆమె తన మాజీ ప్రేమికుడి గురించి చెప్పి మరోసారి నెట్టింట వైరల్‌గా మారారు. అతడితో బంధం ముగిసిపోయినందుకు తానేమీ బాధ పడలేదని తెలిపారు. ఆమె నటించిన తాజా చిత్రం 'దో దీవానే శహర్ మే' ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకురానుంది. దీని ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన మాజీ ప్రేమికుడి గురించి ప్రస్తావించారు. నాకు దూకుడు ఎక్కువని నాతో ఉండలేనని బ్రేకప్ చెప్పాడు. నేను యాక్టింగ్ చేయడం కూడా తనకు నచ్చలేదు. విడిపోవడానికి అది కూడా ఓ కారణం. బ్రేకప్ చెప్పినందుకు నేనేం బాధపడలేదు. తన మనస్తత్వం గురించి జాలి పడ్డాను. అలాంటి వాళ్లతో కొనసాగడం కూడా కష్టమే. అందుకే విడిపోయాం. అలాంటివాళ్లతో ఉంటే భవిష్యత్తులో పిల్లలు కూడా అదే భావనలతో పెరుగుతారు. అది నాకు ఇష్టం లేదని మృణాల్ తెలిపారు.కొన్ని నెలలుగా మృణాల్ డేటింగ్ వార్తలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. నటుడు ధనుష్ తో ఆమె రిలేషన్‌లో ఉన్నట్లు ప్రచారం జరిగింది. ధనుష్ తనకు మంచి స్నేహితుడంటూ ఆ ప్రచారాన్ని మృణాల్ ఖండించారు. తర్వాత టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ తో ఆమె డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీటిపై స్పందిస్తూ.. 'ఇలాంటి రూమర్స్ వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంటాయి. వాళ్లు వార్తలు సృష్టిస్తుంటారు. వాటిని చూసి నేను నవ్వుకుంటాను. ఫ్రీ పీఆర్ స్టంట్స్ ఇవి' అంటూ వాటికి చెక్ పెట్టారు.

# కొత్త తారలతో మ్యాడ్-3 చిత్రీకరణ

టాలీవుడ్‌లో యూత్‌ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌లుగా భారీ విజయాలను అందుకున్న 'మ్యాడ్', 'మ్యాడ్ 2' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్లుగా నిలిచిన విషయం తెలిసిందే. దర్శకుడు కళ్యాణ్ శంకర్ తెరకెక్కించిన ఈ రెండు చిత్రాలు యువతను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఫన్, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌తో సాగిన ఈ సిరీస్‌కు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది. నార్నె నవీన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ హీరోలుగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఈ సక్సెస్‌ఫుల్ ఫ్రాంచైజీకి కొనసాగింపుగా 'మ్యాడ్ 3' ను తెరపైకి తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన నిర్మాతలు, ఈసారి కొత్త కాన్సెప్ట్‌తో పాటు కొత్త కాస్టింగ్‌ను కూడా పరిచయం చేయాలని భావిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. గత చిత్రాల్లో కనిపించిన హీరోల స్థానంలో ఈసారి కొత్త యువ నటులను తీసుకొస్తున్నట్లు సమాచారం. ఈ కొత్త కాస్టింగ్‌లో భాగంగా 'లిటిల్ హార్ట్స్' ఫేమ్ జేయ్ కృష్ణ, 'కోర్ట్' ఫేమ్ హర్ష్ రోషన్ పేర్లు వినిపిస్తున్నాయి. యంగ్ టాలెంట్‌ను ప్రోత్సహిస్తూ ఫ్రెష్ ఫేస్‌లతో ఈ చిత్రాన్ని రూపొందించాలన్న ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో సినిమాకు 'మ్యాడ్ జూనియర్స్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు ఫిల్మ్‌నగర్‌లో ప్రచారం జరుగుతోంది. టైటిల్ ద్వారా కూడా ఈ చిత్రం కొత్త తరం యువత కథగా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ మూవీ షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు సమాచారం. త్వరలోనే ఫస్ట్ లుక్, టీజర్ వంటి అప్డేట్స్ విడుదల చేసే అవకాశముంది. హాస్యం, ఫ్రెండ్‌షిప్, కాలేజ్ లైఫ్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రం రూపొందనుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు.






# మూవీగా వస్తోన్న మిర్జాపూర్ వెబ్ సీరిస్

యాక్షన్ క్రైం థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచిన ఫ్రాంచైజీ సిరీస్ మిర్జాపూర్. ఈ సిరీస్‌లో ఇప్పటికే మూడు సీజన్లు సందడి చేశాయి. పవర్ ఫుల్ క్యారెక్టర్లతో సాగే మూడు సీజన్లకు ప్రేక్షకుల వద్ద నుంచి అదిరిపోయే స్పందన వచ్చింది. కాగా ఈ యూనివర్స్‌ను మరింత ఎక్కువ మంది ప్రేక్షకులకు అందించేందుకు మేకర్స్ సరికొత్త ప్లాన్‌తో వస్తున్నారు. మిర్జాపూర్ ఇక ఫీచర్ ఫిల్మ్‌గా రానుంది. ఈ సినిమా కథను థియేటర్లలో అద్భుతమైన థియాట్రికల్ ఎక్స్‌పీరియన్స్ అందించేలా డిజైన్ చేశారని ఇన్‌సైడ్ టాక్. మిర్జాపూర్ ది ఫిల్మ్ అధికారికంగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉందని తెలియజేశారు. క్రైం సాగాను బిగ్ స్క్రీన్‌పై ఎలా చూపించబోతున్నారని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ఈ చిత్రంలో పాపులర్ యాక్టర్లు పంకజ్ త్రిపాఠి, అలీ ఫజల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గుర్మీత్ సింగ్ డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రానికి పునీత్ కృష్ణ కథనందిస్తున్నారు. ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రితేశ్ సిధ్వానీ, ఫర్హాన్ అక్తర్ నిర్మిస్తున్నారు. విడుదలకు సంబంధించిన వివరాలపై త్వరలోనే క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. గుర్మీత్‌సింగ్, ఆనంద్ అయ్యర్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన మిర్జాపూర్ వెబ్ సిరీస్‌లో పంకజ్ త్రిపాఠి, శ్వేతా త్రిపాఠి, అలీ ఫజల్, హర్షిత గౌర్, విజయవర్మ తదితరులు నటించారు.






# నాని సరసన పూజా హెగ్డే..

నేచురల్ స్టార్ నాని వరుస హిట్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్నారు. ఇప్పుడు ఆయన 'సాహో' ఫేమ్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఒక భారీ సినిమా చేయబోతున్న సంగతి మనందరికీ తెలిసిందే. ఈ క్రేజీ కాంబో గురించి ఎప్పుడెప్పుడు అప్‌డేట్ వస్తుందా అని ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు ఒక అదిరిపోయే వార్త బయటకొచ్చింది. కాగా సమాచారం ప్రకారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూన్ నెల నుంచి మొదలుకానుందట. ఇప్పటికే సుజీత్ అదిరిపోయే స్క్రిప్ట్‌ను రెడీ చేశారట. నానిని మనం ఇప్పటివరకు చూడని ఒక సరికొత్త స్టైలిష్ లుక్‌లో, పవర్‌ఫుల్ యాక్షన్ రోల్‌లో సుజీత్ చూపించబోతున్నారు. ఇక మరోక విషయం ఏంటి అంటే.. ఈ సినిమాలో నాని సరసన 'బుట్టబొమ్మ' పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించబోతున్నట్లు సమాచారం. నాని, పూజా హెగ్డే కలిసి నటిస్తున్న మొదటి సినిమా ఇదే కావడంతో, వీరిద్దరి జోడీ స్క్రీన్ మీద చూడటానికి చాలా ఫ్రెష్‌గా ఉండబోతోంది. అంతేకాదు ఈ మూవీ కోసం సుజీత్ చాలా టైమ్ తీసుకుని, విజువల్స్ పరంగా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తీయాలని ప్లాన్ చేస్తున్నారట. అందుకే ఈ సినిమాను 2027 లో థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చిచ్చుఅబూబయిట్స్త్ర షూటింగ్ అప్‌డేట్ తెగ వైరల్ అవుతోంది. నాని తన నటనతో, సుజీత్ తన మేకింగ్ స్టైల్‌తో ఎలాంటి మ్యాజిక్ చేస్తారో చూడాలి!

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# ఆదిలాబాద్‌కు మొండిచేయి..

- బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం
- సీసీఐ, రైల్వే లైన్, ఎయిర్‌పోర్ట్ ఊసేదీ?
- ఎంపీ గోడం నగేష్‌కు చిత్తశుద్ధి లేదు
- నలుగురు ఎమ్మెల్యేలున్నా ఒక్క వర్సిటీ తేలేకపోయారు
- కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల చంటి ధ్వజం



**ఆదిలాబాద్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆదిలాబాద్ జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఎంపీ, ఎమ్మెల్యేల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి విమర్శించారు. ఆదివారం బోథ్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి బీజేపీ తరఫున నలుగురు ఎమ్మెల్యేలు గెలిచినా జిల్లాకు ఒక్క యూనివర్సిటీని కూడా సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్ విషయంలో ఎంపీ గోడం నగేష్‌కు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. గొర్రె తోక బెత్తెడు అన్న చందంగా స్థానిక ఎంపీ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేల పనితీరు ఉందని, వారు మాటల్లో తప్ప చేతల్లో అభివృద్ధిని చూపలేకపోతున్నారని మండిపడ్డారు. జిల్లా వాసులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సీసీఐ పునరుద్ధరణ, హైదరాబాద్-నాగపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ నిధుల గురించి బడ్జెట్‌లో కనీస ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయం వ్యవహారం మాటలకే పరిమితమైందని ధ్వజమెత్తారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి నిధులు, పర్వత ప్రాంత రోడ్ల ప్యాకేజీలు ఇవ్వకుండా మొండిచేయి చూపారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ఓట్ల రాజకీయాల కోసమే దక్షిణ భారతదేశాన్ని వాడుకుంటున్నారని విమర్శించారు. వ్యవసాయ రంగానికి, ఉపాధికి నిధులు తగ్గించారని, ఎరువుల ముడి సరుకుల ధరలు పెంచి రైతాంగాన్ని కుంగదీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కిసాన్ సమ్మాన్ నిధిని రూ. 10 వేలకు పెంచుతామని చెప్పి, బడ్జెట్‌లో ఆ ఊసే ఎత్తకపోవడం హాస్యాస్పదమన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి నిధులు పెంచకుండా కేవలం రూ. 72 వేలు ఇవ్వడం బీజేపీ సంకుచిత బుద్ధికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు నోరు విప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గోర్ల రాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ చట్ల ఉమేష్, మార్కెట్ డైరెక్టర్ మహమ్మద్ అబ్రార్, ఆత్మ డైరెక్టర్లు రహీముద్దీన్, గడ్డల నారాయణ, ధన్నూర్ ఉప సర్పంచ్ కారం రవి, చమేందర్ రెడ్డి, మహమ్మద్, ఆత్రం సుశీల, అనిల్ అప్ప, మెరుగు నరసింహ దాసు, ఇట్టేడి రాజు రెడ్డి, అచ్యుతానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లోత్తునూరులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నలుగురు లబ్ధిదారులకు రూ. 1.41 లక్షల సాయం**

**అందజేసిన సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్**

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాలతో పంపిణీ**



**గొల్లపల్లి, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం లోత్తునూరులో ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకు.. గ్రామానికి చెందిన నలుగురు లబ్ధిదారులకు మంజూరైన రూ. 1,41,500 (ఒక లక్షా నలభై ఒక్క వెయ్యి ఐదు వందలు) విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను సర్పంచ్ ఆకుల సుమన్ గౌడ్ పంపిణీ చేశారు. కష్టకాలంలో తమను ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సర్పంచ్ సుమన్ గౌడ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఒరగంటి మల్లేష్, లక్కం శ్రీకాంత్, గోనె ఆశన్న, ఓరగంటి జాను, బోనాల రాజు, కాళ్ళ రమేష్, మనోహర్, మహేష్, కాళ్ళ రాజు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# తూప్రాన్ కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫారాల పంపిణీ

**అందజేసిన మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి**

**మున్సిపల్ పీఠం మనదేనని ధీమా.. 16 వార్డులకు అభ్యర్థులు ఖరారు**



**తూప్రాన్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన కాంగ్రెస్ అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యే, గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి తూంకుంట నర్సారెడ్డి సోమవారం బీఫారాలు అందజేశారు.

## అభ్యర్థుల జాబితా ఇదే..

తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 16 వార్డులకు గాను అభ్యర్థులకు బీఫారాలు అందించారు. 1వ వార్డు: విశ్వరాజ్, 2వ వార్డు: దీపక్ రెడ్డి, 3వ వార్డు: చిట్టిమిల్ల అనిల్, 4వ వార్డు: మాలవత్ రాజేష్ నాయక్, 5వ వార్డు: మామిండ్ల జ్యోతి కృష్ణ, 6వ వార్డు: పల్లెర్ల జ్యోతి రవీందర్ గుప్తా, 7వ వార్డు: బాలకృష్ణ, 8వ వార్డు: సత్తెమ్మ, 9వ వార్డు: మల్లేష్ యాదవ్, 10వ వార్డు: నర్సింలు, 11వ వార్డు: రాములు, 12వ వార్డు: రామునిగారి స్వప్న నాగరాజు గౌడ్, 13వ వార్డు: రాధిక శ్రీనివాస్, 14వ వార్డు: దుర్గం సభిత నాగేష్, 15వ వార్డు: కొడిప్యాక అన్నపూర్ణ నారాయణ గుప్తా, 16వ వార్డు: బొడ్డు జ్యోత్స్న వేణులకు బీఫారాలు అందజేశారు.

## విజయం మనదే..

ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడారు. తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారని, మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఎలక్షన్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



# గజ్వేల్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రం

**రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు**

**క్వింటాలుకు రూ. 8 వేలు మద్దతు ధర: డీసీఓ వరలక్ష్మి సూచన**

**గజ్వేల్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, రైతులు తాము పండించిన పంటలను వీటిలోనే విక్రయించాలని డీసీఓ వరలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం గజ్వేల్ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దళారులను ఆశ్రయించి రైతులు నష్టపోవద్దని హితవు పలికారు. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రంలోనే పంటను విక్రయించి ఆర్థికంగా లబ్ధి పొందాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాలు కందులకు రూ. 8000 చెల్లిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రగోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ, ప్యాక్స్ సీఈఓ బాల నరసయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పేదవాడి కడుపు నింపడమే కాంగ్రెస్ లక్ష్యం

**ఆరు గ్యారంటీలతో ప్రజాపాలన.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు**

**4వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ షరీఫ్**

**నర్సారెడ్డి సహకారంతో వార్డు అభివృద్ధి**

**గజ్వేల్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** సమాజంలో ప్రతి పేదవాడు గౌరవంగా బతకాలనేదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యమని 4వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి మహమ్మద్ షరీఫ్ తెలిపారు. సోమవారం ఆయన వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రజాపాలనలో ప్రజలపై ఆర్థిక భారం తగ్గించేందుకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500కే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నారని గుర్తుచేశారు. అలాగే పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు రూ. 500 బోనస్, మహాలక్ష్మి పథకంతో ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయని వివరించారు. ప్రజలు కోరుకున్న పాలన కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని షరీఫ్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి సహకారంతో వార్డును అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

# రాజకీయాలకతీతంగా గ్రామాభివృద్ధి

**పాఠశాల ప్రహరీకి రూ. 10 లక్షలు మంజూరు**

**డ్వాక్రా మహిళల కోసం సమైక్య భవనం**

**సొంత నిధులతో ఎల్ఈడీ లైట్లు వేయిస్తా**

**రాంపూర్ సర్పంచ్ సంగమేశ్వర్ వెల్లడి**



**కొల్చారం, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** రాజకీయాలకు అతీతంగా రాంపూర్ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ సంగమేశ్వర్ తెలిపారు. సోమవారం కొల్చారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో అభివృద్ధి పనులపై ఆయన మాట్లాడారు. గ్రామ ప్రభుత్వ పాఠశాలకు ప్రహరీ గోడ లేకపోవడంతో ఇబ్బందిగా ఉందని, దీని నిర్మాణం కోసం ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా రూ. 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. పాఠశాల ఆవరణలో గోడ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఏఈ మారుతి పరిశీలించారు. పనులు వెంటనే ప్రారంభించాలని సర్పంచ్ సూచించారు. అలాగే గ్రామంలోని డ్వాక్రా మహిళలకు సమావేశాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు ఉన్నాయని, వారి కోసం రూ. 10 లక్షల వ్యయంతో సమైక్య భవనానికి నిధులు మంజూరు చేయించినట్లు పేర్కొన్నారు. గ్రామాభివృద్ధిలో తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని సర్పంచ్ స్పష్టం చేశారు. ఇందులో భాగంగా తన సొంత నిధులతో గ్రామంలో పెద్ద ఎల్ఈడీ బల్బులను బిగిస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో ప్రమాదకరంగా, ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటికి మార్చేందుకు ఇప్పటికే ట్రాన్స్‌కో జిల్లా అధికారులను కలిసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీశైలం, నాయకులు పోచయ్య, గోవర్ధన్ రెడ్డి, జంగిటి మోహన్, మధు, విట్టల్ రెడ్డి, ప్రశాంత్, రవి, గురుప్రసాద్, శ్రీకాంత్, ఇతర గ్రామస్తులు పాల్గొన్నారు.

# గీత కార్మిక కుటుంబానికి ఆర్థిక భరోసా

**మృతుడు సదయ్య కుటుంబానికి రూ. 51 వేల సాయం**

**పిల్లల చదువు బాధ్యత మాదేనన్న రిటైర్డ్ సీఐ రాజమౌళి**

**అండగా నిలిచిన తెలంగాణ గౌడ యూనిఫాం సొసైటీ**



**పెద్దపల్లి, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** పెద్దపల్లి మండలం అప్పన్నపేటలో ఇటీవల ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు బూరుగు సదయ్య మృతి చెందారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు తెలంగాణ గౌడ యూనిఫాం సొసైటీ ముందుకొచ్చింది. సొసైటీ తరఫున రిటైర్డ్ సీఐ చిప్ప రాజమౌళి గౌడ్ రూ. 51,000 (యాభై ఒక్క వెయ్యి) ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా రాజమౌళి గౌడ్ మాట్లాడారు. సదయ్య కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారి పిల్లల చదువు బాధ్యతను తామే తీసుకుంటామని, ఆ కుటుంబానికి ఎల్లవేళలా భరోసాగా ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గౌడ సంఘాల జేఏసీ నాయకులు గోపగోని సారయ్య గౌడ్, బాలసాని వెంకటేశం గౌడ్, పడాల కొమురయ్య గౌడ్, కుమార్ గౌడ్, సదానందం గౌడ్, పడాల సతీష్ గౌడ్, బండారి సునీల్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఇతరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో బాల కార్మికులుంటే కఠిన చర్యలు

**'ఆపరేషన్ స్మైల్'పై ఆర్డీఓ జయచంద్రా రెడ్డి సమీక్ష**



**తూప్రాన్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** మెదక్ జిల్లా తూప్రాన్ డివిజన్ పరిధిలోని పరిశ్రమలు, వర్క్‌షాపులలో బాల కార్మికుల నియామకంపై కఠిన పర్యవేక్షణ ఉండాలని ఆర్డీఓ జయచంద్రా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం 'ఆపరేషన్ స్మైల్' అమలుపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అధికారులంతా తమ పరిధిలోని పరిశ్రమలు, ఇతర సంస్థలను నిరంతరం తనిఖీ చేయాలన్నారు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే సంబంధిత శాఖలకు సమాచారం అందించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్మిక చట్టాలను ఉల్లంఘించి పిల్లలతో పని చేయించుకునే యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి బాలల హక్కులను కాపాడటం ప్రతి అధికారి బాధ్యత అని గుర్తుచేశారు. డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జీపీవోలను ఆదేశించారు. విద్యార్థులకు భవిష్యత్తులో అడ్మిషన్లు, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ పథకాలు పొందడంలో ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఇందుకోసం వారికి అవసరమైన స్థానిక, ఆదాయ, కుల, జనన ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసి అందించాలని సూచించారు.





# అంగరంగ వైభవంగా అమ్మవార్ల బోనాలు

- జంగరాయిలో కన్నుల పండువగా జాతర
- పోతురాజుల విన్యాసాలు.. డప్పు చప్పుళ్లు
- భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న భక్తులు

**చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయిలో దుర్గామాత, పాపమ్మ దేవి అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవ జాతర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం మహిళలు బోనాల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవార్లకు అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామస్థులంతా కలిసి బోనాల పండగను జరుపుకున్నారు. డోలు వాయిద్యాలు, జల్దీబోనంతో మహిళలు గ్రామంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా అలరించాయి. గ్రామానికి చెందినవారే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు కూడా పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు కమ్మరి కిష్టయ్య, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మీపతి, మాజీ సొసైటీ డైరెక్టర్లు శ్రీనివాస్ గౌడ్, దుర్గా రెడ్డి, చంద్రారెడ్డి, యువకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




## పాత నేరస్తుడి అరెస్ట్.. 3 బైక్‌లు స్వాధీనం

**వాహన తనిఖీల్లో పట్టుబడ్డ కమ్మరి రాములు**

**మెదక్, రామాయంపేటలో వరుస చోరీలు**

**వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ మహేష్**

**మెదక్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని మెదక్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ సోమవారం కేసు వివరాలు వెల్లడించారు. నర్సిములు అనే వ్యక్తి పని నిమిత్తం మెదక్ వచ్చారు. ఆటోనగర్‌లోని వన దుర్గ భవాని వైన్స్ షాప్ ఎదుట తన వాహనాన్ని పార్క్ చేయగా.. గుర్తు తెలియని వ్యక్తి దానిని అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం బోధన్ చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఒక వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. అనుమానంతో అతడిని వెంబడించి పట్టుకుని విచారించగా అసలు విషయం బయటపడింది. నిందితుడిని కమ్మరి రాములుగా గుర్తించారు. రాములు గతంలోనూ మెదక్, రామాయంపేట పరిసర ప్రాంతాల్లో అనేక ద్విచక్ర వాహన చోరీలకు పాల్పడి జైలుకు వెళ్లొచ్చాడు. అతడిపై సుమారు ఆరు కేసులు నమోదై ఉన్నాయి. నిందితుడి నుంచి మూడు వాహనాలను స్వాధీనం చేసుకుని, రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

## గజ్వేల్ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం



**గజ్వేల్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఒకటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం ఆరో రోజు ఉత్సాహంగా సాగింది. సోమవారం విద్యార్థులకు యోగా, సూర్య నమస్కారాలతో శిక్షణ ప్రారంభించారు. అనంతరం వైద్య సిబ్బంది కమల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించగా, ఆశ వర్కర్ అంజలి ప్రేరణ తరగతులు నిర్వహించారు. తర్వాత దంత వైద్యులు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అలివేలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## మొదటి వార్డులో ప్రచార జోరు.. సమస్యలే నా సమస్యగా పరిష్కరిస్తా

**కాంగ్రెస్ అభ్యర్థి కప్ప మమత మహేష్**

**మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆశీస్సులతో బరిలో..**

**అభివృద్ధే లక్ష్యం.. చేతి గుర్తుకే ఓటేయాలని అభ్యర్థన**



**గజ్వేల్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారం ఊపందుకుంది. 1వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి కప్ప మమత మహేష్ సోమవారం వార్డులో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లను కలుస్తూ చేతి గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆశీర్వాదంతో బరిలో నిలిచానని తెలిపారు. ప్రజా సేవే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చానని, వార్డులోని ప్రతి సమస్యను తన సొంత సమస్యగా భావించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని స్పష్టం చేశారు. వార్డులో అర్హులైన పేదలకు వృద్ధాప్య పింఛన్లు, నిరుపేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు వచ్చేలా కృషి చేస్తానని తెలిపారు. నాణ్యమైన సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని, అసంపూర్తిగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని మాటిచ్చారు. అలాగే విద్యుత్ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. వార్డు ప్రజలందరూ తమను ఆదరించి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఐ మాత్రమే

**మున్సిపల్ ఎన్నికల్లో ఆదరించండి.. నియోజకవర్గ ఇంచార్జి శివలింగు కృష్ణ**



**గజ్వేల్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ నియోజకవర్గ ఇంచార్జి శివలింగు కృష్ణ కోరారు. సోమవారం గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పట్ల నిత్యం పోరాడుతూ ప్రజలకు అండగా నిలిచేది సీపీఐ మాత్రమేనని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో ప్రజా గొంతుకను బలంగా వినిపించాలంటే తమ అభ్యర్థులను గెలిపించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ బలపరిచిన అభ్యర్థుల వివరాలను ఆయన వెల్లడించారు. ఈ ఎన్నికల్లో 7వ వార్డు నుంచి మెట్టు శ్రీను, 9వ వార్డు నుంచి స్వయంగా తాను (శివలింగు కృష్ణ), 10వ వార్డు నుంచి పోతుల శంకరయ్య, 13వ వార్డు నుంచి గూడూరి యాదమ్మ పోటీ చేస్తున్నారని తెలిపారు. వీరందరినీ ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్‌లో సీపీఐ బలంగా ఉండాలన్నదే పార్టీ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పోచయ్య, రాజ్యం పాల్గొన్నారు.

## ప్రచారంలో పాల్గొంటే వేటే.. ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్చరిక

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల వేళ ప్రభుత్వ ఉద్యోగులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లేదంటే ఉద్యోగాలకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రచార పర్వం ఊపందుకున్న నేపథ్యంలో.. ఉద్యోగులు ఎవరూ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనవద్దని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలకు మద్దతుగా వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో పోస్టులు పెట్టినా, స్టేటస్‌లు ఉంచినా చర్యలు తప్పవు. ప్రచారంలో పాల్గొన్నట్లు ఒక్క ఫొటో దొరికినా, ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఉద్యోగం నుంచి తొలగిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కాబట్టి ఉద్యోగులు రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించింది.

## మున్సిపల్ ఎన్నికల వేళ పకడ్బందీ తనిఖీలు

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు ఎస్పీ మహేందర్**

**శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదని ఆదేశం**




**మెదక్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ పట్టణంలో పోలీసులు నిఘా పెంచారు. పట్టణ పరిధిలోని వెల్కమ్ బోర్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును, వివిధ పోలింగ్ స్టేషన్లను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ సోమవారం పరిశీలించారు. చెక్‌పోస్టుల వద్ద అమలులో ఉన్న బందోబస్తు ఏర్పాట్లను, సిబ్బంది చేపడుతున్న వాహన తనిఖీలను ఆయన స్వయంగా పర్యవేక్షించారు. అనంతరం భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద చేపట్టిన బందోబస్తును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి భంగం కలగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని స్పష్టం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అదనపు ఎస్పీ వెంట మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ టౌన్ సీఐ మహేష్, సిబ్బంది ఉన్నారు.

## మెదక్‌లో కాంగ్రెస్ బోణీ.. 32వ వార్డు ఏకగ్రీవం

**పోటీ నుంచి తప్పుకున్న బీఆర్ఎస్ అభ్యర్థి**

**కౌన్సిలర్‌గా గోదల మానస సాయిరాం ఎన్నిక**

**రెండోసారి ఏకగ్రీవం కావడంతో స్థానికుల హర్షం**



**మెదక్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** మెదక్ మున్సిపల్ ఎన్నికల పోరులో కాంగ్రెస్ పార్టీ తొలి విజయాన్ని నమోదు చేసింది. పట్టణంలోని పిట్లంబస్ (32వ వార్డు) కౌన్సిలర్ స్థానం ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ తరఫున బరిలో నిలిచిన గోదల మానస సాయిరాం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఇదే వార్డు నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గోదల జ్యోతి కృష్ణ నామినేషన్ దాఖలు చేశారు. అయితే అనూహ్య పరిణామాల మధ్య ఆమె టీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం తన నామినేషన్‌ను ఉపసంహరించుకొని, కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో బరిలో ఎవరూ లేకపోవడంతో గోదల మానస సాయిరాం ఎన్నిక ఏకగ్రీవమైంది. పిట్లంబస్ వార్డు వరుసగా రెండోసారి ఏకగ్రీవం కావడంతో స్థానిక ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

## ఒక్కసారి అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

**కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసహనం**

**సమస్యల వలయంలో 5వ వార్డు**

**ఇంటింటి ప్రచారంలో బీజేపీ అభ్యర్థి సల్ల అన్నపూర్ణ శ్రీనివాస్**



**గజ్వేల్, ఫిబ్రవరి 2 (సమయం న్యూస్):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థి సల్ల అన్నపూర్ణ శ్రీనివాస్ సోమవారం ముమ్మరంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వార్డులో అనేక సమస్యలు ఉన్నాయని ప్రజలు అభ్యర్థి దృష్టికి తెచ్చారు. తమకు ఇళ్లు సరిగా లేవని, రేషన్ కార్డులు, పింఛన్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి దీపాలు వెలగడం లేదని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించే నాథుడే కరువయ్యారని ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో తమను గెలిపిస్తే సమస్యలన్నీ పరిష్కరించి, వార్డును అభివృద్ధి చేస్తానని అన్నపూర్ణ శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిందని విమర్శించారు. ఇళ్లు లేనివారికి ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్ పెంపు (వృద్ధులకు రూ. 4016, వికలాంగులకు రూ. 6000), ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, మహిళలకు స్కూటీలు, రైతు భరోసా, కౌలు రైతులకు బోనస్, ఉచిత గ్యాస్ వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అబద్ధపు హామీలతో వచ్చిన కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని, కేవలం ఫామ్‌హౌస్‌కే పరిమితమై ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.